

పత్రిక

22-12-








చిదంబరంలో నటరాజస్వామి ఆలయం

ఫోటో: వి. వి. రామన్, (కోయంబత్తూరు)

దగ్గు మరియు రొంపనుండి నిజమైన స్వస్థత పొందుటకు







సిరోలిన్ వాడండి



దగ్గు లేక రొంపను అశ్రద్ధచేయకండి. సిరోలిన్ వాడి నిరపాయముగా, శీఘ్రముగా నిజమైన స్వస్థత పొందండి. సిరోలిన్ దగ్గును ఆపుటయేకాదు. అది మీ దగ్గుకు మూలకారణమైన హానికరమగు సూక్ష్మ క్రిములను నశింపచేయును; కఫమును నుసను పోగొట్టును. సిరోలిన్ ఎంత కష్టమైన దగ్గునైనను శీఘ్రముగా పోగొట్టి స్వస్థత చేకూర్చును. దాని పనితనమును బట్టియు రుచిని బట్టియు సిరోలిన్ కుటుంబములోని వారి అందరి అభిమాన పాత్రమై యున్నది. పిల్లలకు సిరోలిన్ అంటే ఎంతో ప్రీతి.

మీ యింట్లో సిరోలిన్ తప్పక ఉంచండి

'రోష్' తయారు సోల్ డిస్ట్రిబ్యూటర్సు: వాల్టాస్ లిమిటెడ్

ఉత్తరాలు

హమేషా తమాషా

"హమేషా తమాషా" లోని వీరాజీగారి "ఆడ మార్కు" శీర్షిక చాలా బాగుంది. బహుశా ఈ శీర్షిక ప్రచురింపబడడంవల్లనే కాబోలు అట్టమీది బొమ్మ శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారిది వేశారు!

శకుంతల (అనంతపురం)

ఎప్పుడూ ఇంతే

శ్రీ శంకర్ గారి ఎప్పుడూ ఇంతే 110 లో మూడు బొమ్మల్లోనూ, మొదటి బొమ్మలో చీర గురించి చెప్పే వ్యక్తి చెప్పులు తొడుగుకొని ఉన్నాడు. తీరా చూస్తే—2 వ బొమ్మలోనూ, దాని తరువాతి బొమ్మలోనూ, బూట్లతో సాక్షాత్కరించాడు. అది శ్రీ శంకర్‌గారి ఇంద్రజాలమా ? లేక వారి కార్టూనులు "ఎప్పుడూ ఇంతేనా ?"

రామిరెడ్డి సాంబిరెడ్డి (చుండూరు)

ఏదైనా ఫరవాలేదు.

కార్టూన్ లు

సుశీలగారి పాటలంటే నాకు చాలా యిష్టము. వారిని కార్టూను ద్వారా పరిచయం చేసినందుకు చాలా సంతోషం. వారు నిజంగా తెలుగు చిత్రసీమకు వెన్నెముకలాంటివారు. "గాన లతలీల, కోమల సుశీల" అని బహుచక్కగా వ్రాశారు.

సముద్రాల జయ (అచ్చన్నపాలెం)

* * *

"బాపుగారి కార్టూన్ను, "కోమల సుశీల" ని మరువలేకున్నాము.

పి వంద (హైదరాబాద్)

మనరాష్ట్రం

ప్రతిభ శాలి, మేధావి అయిన డాక్టరు రావు కాంగ్రెసు పరువేదో తీసిపారేస్తున్నట్లు కొండిన్య గారు వ్రాసినది కేవలం అభూతకల్పన. కాంగ్రెసు పార్టీలో కొద్దికాలము గూడ పనిచేయనంత మాత్రాన కాంగ్రెసువాది కాకపోరు. వారికట్టి అవకాశము దొరకలేదు. చేయలేదు. అంతే. సీట్ల వేటలో పోటీ పడే బురఖా కాంగ్రెసువాదులకన్న రావుగారు నిజమైన గాంధి మార్కు కాంగ్రెసువాది. మేధావులు కాంగ్రెసుపార్టీకవుసరమని, వారిచేత దేశసేవ చేయించుటకు వీలుగా, విజయవాడ నుండి పోటీ చేయమని ఆహ్వానించడం సంజీవరెడ్డిగారి దూరదృష్టికి నిదర్శనం. శ్రీ రావు చే యావదాంధ్ర దేశమునకు సేవ చేయించుకొనే మహద్భాగ్యము కలిగించుకొనుట విజయవాడ నియోజకవర్గ ప్రజల విధి పార్టీలకు మేధావు లవుసరం మేధావులు లేని రాజకీయపార్టీలు మనజాలవు. ఏది ఏమైనా ఒకవేళ శ్రీకొండిన్య ఆరోపించినట్లు శ్రీ రావు కమ్యూనిస్టులతో మాట్లాడి, తమ ఏకగ్రీవ ఎన్నికకు (కాంగ్రెసుపార్టీ ప్రతినిధిగా) దోహదం చేస్తే అది కాంగ్రెసు ప్రతిష్టనినుమడింప చేస్తుందేగాని భంగపరచదు.

రాఘవరావు (హైదరాబాదు)

* * *

కథకాని కథలు

ఈమధ్యన "కథకాని కథ" లు ఏమాత్రం బాగుండుటలేదు. ప్రతివారు 'నవ్వు' నే ప్రాధాన్యముగా తీసుకొని వ్రాస్తున్నారు. అలా వ్రాసేటప్పటికి 'నవ్వు' (హాస్యం) అనే పదానికి విలువ లేకుండా పోతున్నది. 'కథకాని కథ' ను హాస్య కథ (సంఘటన) గా మార్చేస్తుంటే అసలు ఆ శీర్షిక యొక్క ఉపయోగమే ఉండుటలేదు. అందులో మొదటి బహుమతి, రెండవ బహుమతి కూడాను అందరూ "నేను అవి కాలేజీలో చదివే రోజులు .... " లేక "నేను గుడివాడ నుంచి గుంటూరు" వెళుతున్నప్పుడు..." అని వ్రాస్తుంటే అసలు ఆ సంఘటన జరిగిందా లేక కల్పితమా అని పిస్తుంది.

అక్షయపాత్ర రాజేంద్రబాబు (అలహాబాదు)

* * *

1-12-61 సంచికలోని కథకాని కథలు బాగున్నాయి. చదువుతుంటే మరల చదవాలని అభిలాష కలుగుతోంది.

జి. రవీందర్ కుమారి (పటేల్ గూడా)

* * *

15-12-61 తేదీ సంచికలో కథకాని కథ శీర్షిక క్రింద ప్రచురించిన "పురానే జవాబు" కథలో భారత, పాకిస్తాన్ దేశాలమధ్య జరిగిన మూడవ 'టెస్టు' మేచ్ నాగపూరులో జరిగినట్టుగా వ్రాశారు. ఇంతవరకు ఎన్నడూ నాగపూరులో "టెస్" మేచ్ జరగలేదు. రచయితలు రాసిన ఇట్టి తప్పులను సంపాదకవర్గము గమనించితే చాలబాగుంటుందని నా అభిప్రాయము.

ఎం. కృష్ణశాస్త్రి (విజయనగరం)

చదువుల్రావు

టిట్‌బిట్ మీద నుంచున్న చదువుల్రావుకి నీళ్లెక్కడనుంచి వచ్చాయి? పోనీ ఎక్కడినించో సంపాదించా డనుకుందామన్నా, గొడుగులో నీళ్ళు చాలా వరకు కారిపోతాయి. గొడుగులో కొన్ని నీళ్ళున్నప్పటికి, ఆమెకి 'చదువుల్రావు' ఇచ్చింది తడి గొడుగని తెలియకపోదు. ఒకవేళ పరధ్యానంగా ఉందనుకోండి. అప్పుడు గొడుగు తెరవటానికి గొడుగులో చెయ్యిపెట్టినప్పుడన్నా అది తడి గొడుగు అని ఆమెకు తెలియదా ?

వండూరి శాయిబాబురావు (గుంటూరు)

డా॥ రాజు

కొత్తగా ప్రచురిస్తున్న దేవిక గారి 'డాక్టరు రాజు' గూడ హుషారుగా సాగుతోంది

వి. రత్నసుందర్ (విశాఖపట్నం)

పొట్టికథలు

మీ (మా)పత్రికకు పొట్టికథలు ఒక శోభను కలిగించుచున్నాయనే చెప్పాలి. 15-12-61 పత్రికలో దివాకర్ గారు "తెలివి గలవాళ్లు" అనుపేరుతో తెలివితక్కువ వారినిగూర్చి బహుచక్కగా వ్రాశారు. వారికి నా ధన్యవాదాలు.

సింగంపల్లి సుబ్బారావు (మద్రాసు)

కథలు

బొంబాయి ఆంధ్ర మహాసభవారు జరిపిన పోటీలో రెండవ బహుమతి పొందిన కథ 'ఆదర్శ జీవులు" ఉత్సాహంగా చదివేను. నిజమైన స్నేహం అంటే ఎటువంటిదో చక్కగా నిరూపించారు. ఇందులో స్నేహితుని మనశ్శాంతి కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తాడు రాజా.

అధికార్ల సుందర్రావు (ఆసంసోల్)

* * *

"శ్రీయుతులు హవిస్, ఆదివిష్ణు, సింగరాజు రామచంద్రమూర్తి వీరు ముగ్గురూ 'వివశువు' అనే సంయుక్త రచన పంపారు .... " అని వ్రాశారు.

ఒకే రచయిత ఈ మూడు పేర్లతో చలామణి అవుతున్నారని వూహిస్తున్నాను

డి. వి. రామయ్య (కాకినాడ)

మీ ఊహ తప్పు అనుకుంటున్నాము.

* * *

సంయుక్త రచన 'వివశువు' చదివాను. కథ ప్రాత పద్ధతిలో నున్నను ముగ్గురు వ్రాసిన కథగాగాక ఒకరే సృష్టించినదిగ నున్నది.

యం. నిర్మల (బొంబాయి)

* * *

'వివశువు'కథ పూర్తిగా చదివి పరవశమొందాను. కథంతా చదివాక 'మధుమూర్తి' గురించి రెండు కన్నీటిబొట్లూ, 'రాజేంద్ర' గురించి ఓ చిరునవ్వూ, 'ప్రసాదరావు' గురించి శుభాకాంక్షలు సమర్పించాను. ఈపాటికి 'ప్రసాదరావు, సరస్వతుల' వివాహము జరిగిపోయుంటుందని నా భావన

రచయితల రచనలలో అట్టే తేడాకన్పింత లేదు. ఈ కథ పత్రికకు "సువర్ణానికి తావి అబ్బినట్లు"గా వుంది.

ఆ ముగ్గురు రచయితలకూ ఇవే నా అభివందనములు.

దొమ్మరమరి విఠల్ రావు (హైదరాబాదు)

* * *

అరిగే రామారావు గారురచించిన "లచ్చిమి" కథ చాలబావుంది. వారికి మీద్వారా మా అభివందనములు

పి. దేవానంద్ (హైదరాబాదు)

★

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

ముఖచిత్రం :
గుమ్మడి

విషయానుక్రమణిక

శుక్రవారం : 22-12-61
ప్లవ సం॥ మార్గశీర్ష బ॥ పాడ్యమి
సంపుటము : 54 సంచిక : 16

స్థాపితము:
1908

*

ముఖ్యసంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

విడిప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీథి, మద్రాసు-1


★

లోకంపోకడ



'కాంగ్రెసుపార్టీ నాకు టిక్కెట్టు ఇవ్వక పోతేనేమి కనుక, స్వతంత్రపార్టీ ఇస్తోంది చూడండి!'

'ఏలాగూ మీరు గెలుస్తారా, ఏమిటి!'


గోవాలో పోర్చుగీసు సైనిక బలాల మోహరింపు
గాలి గుమ్మటాన్ని భేదించ వలసిన సమయం!
పోర్చుగల్
భారత సైనికులు
మన వాణిజ్య ఒప్పందం గడువు పెంచుకుందామా?
పోర్చుగీసు సామ్రాజ్య వాదులు
హ! హ!
భారత దేశంలో మనకు రాజాజీ వంటి మిత్రులు కొందరున్నారు. గోవా విమోచనకు చర్యతీసుకోరాదని వారు ఎంత బాగా వాదిస్తున్నారో చూడండి!
కులతత్వం
పాఠశాలల్లో పిల్లలను చేర్చుకునే టప్పుడు కులతత్వానికి స్థానం ఇవ్వరాదని డి.పి.ఐ. హెచ్చరించారు

ప్రాక్పశ్చిమ రాజ్యాలతో ప్రధాని ద్విపాత్రాభినయం:
తాటాకుల చప్పుళ్లకు కుందేళ్లు బెదరుతాయా?

శ్రీకృష్ణ

ప్రధానమంత్రి అనుసరిస్తున్న 'ద్విముఖ' వైదేశికనీతి ఈవారం ప్రధాన చర్చనీయాంశం అయింది. గోవానుంచి పోర్చుగీసువారిని తరిమి వేసేందుకు, అవసరమని తోస్తే బలప్రయోగం చేసే అవకాశం లేకపోలేదని ప్రధాని స్పష్టం చేశారు. కాని ఆ ఉపన్యాసంలోనే చైనీయులపై సైనికచర్య తీసుకొనడానికి భయం వ్యక్తం చేశారు. దానివల్ల ప్రపంచయుద్ధం సంభవించ వచ్చునని వారు అంటారు. అంటే పాశ్చాత్య రాజ్యాలపై (పోర్చుగల్ ఆ వర్గంలోనిదే కదటండీ!) సైనిక చర్యలకు తాము సాహసించినా, చైనీయుల మీద అలాంటి చర్యకు దిగితే మాత్రం ప్రపంచ యుద్ధానికి దారి తీసినట్లవుతుందని వారు భావిసున్నట్లు విదితం అవుతోంది. పోర్చుగీస్‌వారి మీద సైనిక చర్యకు పూనుకుంటే నాటో రాజ్యాలు ఏవీ వారిని ఆదుకోవని శ్రీ నెహ్రూ విశ్వాసం. అయితే అదే పరిస్థితలలో చైనాకు రష్యా సహాయం ఉండదని మాత్రం వారు గట్టిగా నమ్మలేకపోతున్నారు. ఇక్కడ మరొక వాదానికి కూడా ఆస్కారం ఉన్నది. గోవానుంచి లిస్బన్‌కు ఉన్న రవాణా, సమాచార సదుపాయాలే లే నుంచి పెకింగ్‌కు ఉన్నా, గోవాలోని పోర్చుగీసు బలాలను సునాయాసంగా అరేబియా సముద్రంలోకి తరిమివేయ వచ్చుననీ, లడక్ నుంచి చైనీయులను మాత్రం తరిమి వేయుడంసాధ్యంకాదనీ వారు భావిస్తున్నారని అను కోవలసి వస్తోంది. అంతేకాక భారత—చైనా దేశాలకు పంచశీల ఒప్పందం ఒకటి ఉన్నదికదా! మరి అలాంటి ఒప్పందమేమీ పోర్చుగల్‌తో లేకపోయె!

తీసుకోదలచింది పోలీసుచర్యే గానివ్వండి, లేదా సైనికచర్యే గానివ్వండి, దానివల్ల కలిగే పరిణామాలేమిటో జాగ్రత్తగా ముందు పరిశీలించటం అవసరం. గోవామీద ఇలాంటి చర్యకు ఉపక్రమించే ముందు, ఉదాహరణకు కాశ్మీర్ విషయమై భారత—పాకిస్తాన్‌దేశాల సంబంధాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించాలి. అమధ్య కొందరు కాంగ్రెసువాదులు అహింసాయుత పద్ధతులలో గోవాకు విమోచన కలిగించాలని ఆశించిన సంగతి పాఠకులకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఈ ఉద్యమం సఫలం అవటం, కాకపోవటం మాట ఎలా ఉన్నా, కాశ్మీర్ విమోచనకు ఇటువంటి ఉద్యమమే సాగించ దలచినట్లు పాకిస్తానీలు కూడా అప్పుడే వెల్లడించారు. ఆ పరిస్థితులలోనే భారత ప్రభుత్వం కల్పించుకుని కాంగ్రెసువారి సత్యాగ్రహసంకల్పాన్ని విరమింపజేసింది.

'సరిహద్దులలో జరిగిన సంఘటనల' మూలంగానే కదా భారత ప్రభుత్వం పోర్చుగీసువారిపై పోలీసుచర్య తీసుకోవాలని ఇప్పుడు యోచిస్తోంది! నిజానికి స్వాతంత్ర్యం లభించినది మొదలు భారత—పాకిస్తాన్ దేశాల చరిత్రను పరికిస్తే, ఇలాంటి సరిహద్దుసంఘటనలు కొల్లలుగా కనిపిస్తాయి.

* * *

భారత—చైనా వివాదాన్ని గూర్చి లోక్‌సభలో సమగ్రమైన చర్చ జరిగింది. కమ్యూనిస్టుపార్టీ ఉపనాయకుడు శ్రీ హిరేన్ ముఖర్జీ మినహా కొత్త పంథా తొక్కినవారు లేరనే చెప్పవచ్చు. భారతదేశం రానురాను 'పాశ్చాత్యరాజ్యాలకు సన్నిహితం' అవుతున్నదనే భయంతోనే సరిహద్దులలో చైనీయులు కొన్ని చర్యలు తీసుకుంటున్నారని తమకు అనుమానం కలుగుతోందన్నారు! బెంగాల్‌లో నిరుద్యోగసమస్య తీవ్రతరం అవుతుంటే ప్రభుత్వం ఏమీ చెయ్యలేని స్థితిలో ఉండటం చూచి చైనీయులు కరుణించి, లడక్‌లోని భూభాగాన్ని యథాశక్తి ఆక్రమిస్తున్నారు కాబోలు! ఎటావాటా భారతదేశం కమ్యూనిస్టు రాజ్యాల కూటమివైపు మొగ్గు చూపడమే శ్రీ ముఖర్జీకి కావలసింది. సరే భారతవైదేశిక విధానం ఇందుకు అనుగుణంగా రూపొందిందే అనుకుందాం. అప్పుడు చైనీయులు తాము ఆక్రమించిన భారత భూభాగాన్ని విడిచి వెళ్తారా? అన్నదే సమస్య. శ్రీ ముఖర్జీ అప్పుడు మరోవిధంగా వాదించవచ్చు. చైనా, భారతదేశాలు రెండూ ఒకే సిద్ధాంతాన్ని విశ్వసిస్తున్నాయి కనుక, భారతదేశానికి చెందినవి చైనాకు కూడా చెందుతాయని వారు అనవచ్చు. అయితే చైనాకు చెందినవి మాత్రం చైనాకే ఉండిపోతాయి!

భారత—చైనావివాదాన్ని జాగ్రత్తగా గమనిస్తున్న ఒక పరిశీలకుని అభిప్రాయం ఇక్కడ పొందుపరుస్తున్నాను: "భారత చైనా సరిహద్దు వివాదం, ప్రపంచాన్ని అణ్వస్త్ర మారణహోమానికి గురిచేస్తుందనే భ్రమలో పడి, స్వ్యాధీల్లి నిస్సబ్దత పాలుఅవుతోంది. ఈ వివాదంలో చైనాకు రష్యా సహాయంగా రావచ్చుననే అంచనాయే ఈ భ్రమకు ఆధారం. రష్యా రంగంలోకి దిగటం అంటూ జరిగితే, భారతదేశానికి సత్తాసుగా అమెరికా కూడా దిగవచ్చునని మరో పూహాగానం కూడా ఉంది. ఈ వాదం ఎన్నికలలో నిల్చునేందుకు టిక్కెట్లకోసం శ్రీ నెహ్రూ ఇంటిముందు కావలాకాచేవారికి నచ్చుతుందేమో కాని, కాంగ్రెసేతరులకు, కమ్యూనిస్టేతరులకు మాత్రం సబబుగా కనిపించదు. చైనీయులు ఆక్రమించిన ప్రాంతం భౌగోళిక పరిస్థితులు, కాలికగల బ్రహ్మాండమైన సైనికసంపత్తి, భారత వైదేశికనీతికి ఆధారభూతములైన సిద్ధాంతాలు, చరిత్రప్రసిద్ధమైన నెహ్రూ—చౌ ఒప్పందం (ఇది మూనిచ్ ఒప్పందం కోవలోనిదని చరిత్ర ధృవపరుస్తుంది!), అణ్వస్త్ర యుద్ధంవల్ల జరిగే వినాశనం మొదలైనవన్నీ ఏకరువుపెట్టి స్వ్యాధీల్లి విమర్శకుల నోరు కట్టివేసేందుకు ప్రయత్నిస్తోంది"

శ్రీ నెహ్రూ సరిహద్దులలో చైనీయుల కార్యకలాపాలను మొదటినుండి తగ్గించి అంచనా వేశారనీ, అసలు విషయాలను ప్రజలకు తెలియనివ్వలేదనీ, వారి ప్రసంగాలు, ప్రకటనలు చైనీయులకు తోడ్పడ్డాయనీ ప్రప్రథమంగా ఈసారి లోక్‌సభ సమావేశంలోనే ఆరోపణలు వచ్చాయి. ఇవిగో కొన్ని ఉదాహరణలు:

"దంబుగురు, న్యాగ్జూలలో చైనీయులు కొత్తగా సైనిక కేంద్రాలు ఏర్పాటుచేశారని 1961 ఆగస్టు—సెప్టెంబరు మాసాలలోనే కనుగొన్నట్లు 1961 అక్టోబరు 31 వ తేదీన భారత ప్రభుత్వం వ్రాసిన లేఖ తెల్పుతోంది. ఈ రెండు ప్రాంతాలు ఎవరికి చెందినవో నిర్ధారణగా చెప్పలేక పోతున్నామని వారం మొదట్లో శ్రీ నెహ్రూ ప్రకటించారు. కాని 'సురయాలో 1960 ఏప్రిల్ మాసంలోను, దౌలత్‌బేగ్ వోల్డిలో 1960 శీతాకాలంలోను చైనీయుల గస్తీదళాలు కనిపించినందుకు' భారత ప్రభుత్వం 1961 అక్టోబరు 31 వ తేదీ ఉత్తరంలో నిరసన తెలియజేసింది.

"ఈ సంఘటనలు జరిగి దాదాపు 1½ సంవత్సరాలు గతించినా పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయంలో గాని, చర్చల సందర్భంలో గాని ప్రభుత్వం వెల్లడి చెయ్యలేదు. సిక్కింలో జరిగిన కొద్దిపాటి దురాక్రమణలను కూడా చాలాకాలం క్రితమే ప్రభుత్వం బహిరంగ పరచినప్పుడు, వీటిని ఎందుకు బయట పెట్టలేదో అర్థంకాదు."

"లడక్ తూర్పుభాగంలోని దంబుగురు, న్యాగ్జూలలో చైనీయులు రెండు సైనిక కేంద్రాలు నెల

62-వ పేజీ చూడండి

శ్రీశైల ఆలయ ఉద్ధరణ నిధి

'ఆంధ్రపత్రిక' సేకరిస్తున్న శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివారి ఆలయ ఉద్ధరణ నిధికి డిసెంబరు 16 వ తేదీనాటికి రు. 90,144-83 వసూలు అయింది. యథాశక్తి విరాళాలు ఇచ్చి ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందని ప్రజలకు, ప్రజాసంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాము. విరాళాలు 'ఆంధ్రపత్రిక' కే గాని, ఆంధ్ర సచిత్ర వారపత్రికకు పంపరాదని మనవి చేస్తున్నాము.



క్రిస్మస్ కథ

1 ఆకాశం నిర్మలంగాఉంది నక్షత్రాలు, ఈశ్వర కటాక్షవీక్షణాలలా నిండుగా ప్రకాశిస్తున్నాయి. బెత్లెహేము నగరానికి కొద్దిదూరాన గొర్రెల కాపరులు కొందరు ప్రశాంతంగా కూర్చున్నారు. వారికి దగ్గరలోనే గొర్రెలు నిశ్చింతగా పచ్చిక మేస్తున్నాయి. అంతలో ఒక వింత వెలుగు, గొర్రెల కాపరుల కళ్ళు మిరుమిట్లుగొలిపింది. వారు భయపడిపోయారు. ఆ కాంతి పుంజం మధ్య ఒక దేవదూత సాక్షాత్కరించింది. "భయపడకండి. నేను శుభవార్త తెచ్చాను. ఏసు ప్రభువు మానవుడుగా అవతరించాడు. బెత్లెహేం వెళ్ళండి. ఒక పశువుల కొలలో గుడ్డ పొత్తిళ్ళ మధ్య ఒక కుడిలి




తొట్టెలో ఉన్నాడు. వెళ్లి చూడండి'' అని చెప్పి దేవదూత మాయం అయిపోయింది.

2. వెంటనే, ఆ గొర్రెల కాపరులు సంభ్రమంతో, ఆశ్చర్యంతో లేచి బెత్లెహేం వెళ్లారు. అక్కడ పశువుల శాలలో—దేవదూత చెప్పిన ప్రకారం, మెత్తని కాంతులు ప్రసరిస్తున్న శిశువు కనుపించాడు. భగవంతుడిని గర్భాన ధరించి ధన్యురాలైన మాత మేరి, ఆ శిశువును గుడ్డపొత్తిళ్లలో చుట్టి, కుదిరి తొట్టెలో పడుకోబెట్టింది. గొర్రెల కాపరులు దేవదూత సందేశాన్ని ఆమెకు తెలిపారు. ప్రభువును దర్శించారు. ఆనందంతో తన్మయులు అయిపోయారు.

3. అంతలోనే, తూరుపు ఖండపువారలు—ముగ్గురు జ్ఞానులు, ప్రభువును అన్వేషిస్తూ అక్కడికి వచ్చారు. వారికి, వారిదేశంలో ఒక ఉజ్వలమైన నక్షత్రం గోచరించింది. 'యూదుల ప్రభువు' ఉదయించాడని గ్రహించి, వారూ, ఆ దివ్యజ్యోతిని మార్గదర్శకంగా అనుసరించారు. బెత్లెహేం చేరారు. ఆ జ్యోతి ఏసు ప్రభువు జన్మించిన పశువుల శాలపైకి వచ్చి అక్కడ ఆగింది. ప్రాగ్దేశాల జ్ఞానులు ముగ్గురూ ప్రభువును దర్శించి, అర్చించారు. ఆయనకై తాము కొనితెచ్చిన కానుకలను భక్తితో సమర్పించారు.



చిరకాలపు సుచిర స్వప్నం సత్యమై అవతరించిందని, లోక కల్యాణానికి, మానవులలో శాంతి సౌహార్దాలు చిరంజీవాలుగా వర్ధిల్లడానికి ఆ కరుణాకరుడు ఉదయించిన క్షణాన శుభఘడియలు ఆరంభం అయినాయని లోకం సంతోషించింది.





కొట్టు తలుపులు మూసి, తాళం పెట్టి—మళ్లీ దాన్ని ఒక్కసారి లాగి చూశాడు చలమయ్య. అది కఠినుడి హృదయంలాగా బిగించుకుని ఉంది .. పిదప, బీగాల గుత్తిని చొక్కా జేబులో పడేసుకుని తిరిగాడు. కొట్టులో పనిచేసే కుర్రాడు—రంగడు—పేవ్‌మెంటుమీద నిల్చున్నవాడల్లా చలమయ్యను సమీపించి "వెళ్లొస్తానండీ!" అన్నాడు విధేయతతో.

"ఊ! ...." అని ఊకొట్టిన పిదప తన జేబునుండి చిల్లర డబ్బులు తీసి, అందులో ఓ పావలా బిళ్లను రంగడి కందిచ్చాడు చలమయ్య. ఆ పావలాను అందుకున్న కుర్రవాడు—చేతులు కట్టుకు నిల్చున్నాడు మౌనంగా.

"నే నిచ్చిన జీతం డబ్బులు జాగ్రత్తగా ఉంచుకున్నావుగదూ ?" అని ప్రశ్నించాడు చలమయ్య.

"ఓ!—లాగు జేబులో పొట్లం కట్టి, భద్రంగా దాచుకున్నానండీ!" అన్నాడు రంగడు.

"వెళ్లే దారిలో—కుర్రతనంగా—ఎక్కడైనా పోగొట్టుకోబోయేవు జాగ్రత్త! వెళ్లు!!" అని చెప్పి, చలమయ్య తిరిగి తన నివాసంవేపు నడక సాగించాడు.

ఆ వెళ్తున్న యజమాని కేసి రెండు నిమిషాల వరకూ కన్నార్పకుండా చూచి, పిదప చేతిలోని పావలాను ఒక్కసారి ముద్దుకుని, ఉత్సాహంగా నవ్వుకుని—తన ఇంటివేపు నడక ప్రారంభించాడు రంగడు.

కొట్టునుండి కొంతదూరం వెళ్లిన తర్వాత చలమయ్య వెనుదిరిగి, ఒక్కసారి తనకొట్టు కేసి చూపులు పోనిచ్చాడు. అతనికి అలా చూడడం రోజూ అలవాటయిపోయింది .... ఇప్పుడా కొట్టు వద్ద రంగడు లేడు!—కొట్టు ముందరఉన్న కార్పొరేషన్ దీపం ఏకాంతంగా నిల్చుని వెలుగుతున్నట్టు అనిపించింది.

పట్టుమని పన్నెండేళ్లు నిండని రంగడు, తన దగ్గర ఎంత నమ్మకంగా, వినయ విధేయతలతో పనిచేస్తున్నాడూ ? వాడి కంటే మరో మంచి కుర్రాడు—అదీ అంత తక్కువ జీతానికి—తనకు లభించడు! ఏదో, వాడి దురదృష్టంకొద్దీ నౌకరీ చేస్తున్నాడు కానీ, కష్టాలెరుగని విద్యార్థి జీవితం గడపవలసిన వయస్సులోనివాడు గదా! లేమితనం కారణంగా లేత వయస్సులో నౌకరీ చేయుగలుగుతున్నాడు! పాపం! పేదవాడు! తను వాడికిస్తున్న పదిహేను రూపాయిలూ, నేటి రోజులున్న స్థితిలో చాలనేమో! తల్లిదండ్రులు లేని, ఒక్కగానొక్క అక్కగారితో, అదీ పెళ్లి కెదిగిన పడుచుతో—జీవితం గడుపుతున్నాడు! పాపం! తమ్ముడి సంపాదనతో కాలం వెళ్లబోస్తున్న వాళ్ల అక్కయ్యకు, ఈ కాలంలో పెళ్లి జరగగలదనే నమ్మకం ఏమాత్రం ఉంటుందీ ? అయినా, వాళ్లకు తను మాత్రం ఏం సహాయం చేయగలడు ? పోనీ, వచ్చే మాసంనుండీ రంగడికి మరో అయిదు రూపాయలు జీతంతో కలిపి ఇవ్వాలి! వాడి కిచ్చినంతలో తనకు వచ్చే లాభమేం తరిగిపోదుగదూ ?!—

"చలమయ్యా!" అనే పిలుపు విని వూహా ప్రపంచంనుండి తెప్పరిల్లుకుని తిరిగి చూశాడు చలమయ్య. తనింటికి పక్కింట్లో ఉంటున్న భద్రయ్య, తనను వెన్నంటి వస్తున్నాడు .... ఆయన వెంబడి—ఆయన శ్రీమతి, ఇద్దరు మగపిల్లలూ వస్తున్నారు.

"ఇంతవేళలో ఎక్కడికి వెళ్లి, తిరిగి వస్తున్నట్టు? .... సినిమా కేమేనా వెళ్లారా, భద్రయ్యా" అని ప్రశ్నించాడు చలమయ్య.

"సినిమాకు కాదు లేవయ్యా, ఎగ్జిబిషన్ వెళ్లొస్తున్నాం .... పిల్లలు చూడాలని పేక్కుతింటూంటే, అలా తీసుకు వెళ్లాను .... దానికి ప్రతిఫలం—అంటే నష్టం—పది రూపాయలు ..." అని చిరునవ్వు నవ్వాడు భద్రయ్య.

"నీ ఒక్కడికే అంత ఖర్చు కాలేదు గదా! .... మీ కుటుంబం, పిల్లల ఆనందం కోసం ఖర్చు పెట్టారు .... అదేం దండుగ కాదు!"


"వాస్తవమేలే! .... కాని, ఆ పది రూపాయలతో అయిదు రోజులు వస్తువు లేకుండా గడుపవచ్చునని .... "

" .... అలా అయితే—లోకంలో వినోద, విహారాల గురించిన అవసరమే లేదు కదయ్యా! భద్రయ్యా! నీ కెప్పుడూ డబ్బుమీద కన్నే గాని—కుటుంబం, జీవితం గురించిన మాటే లేదు!"

"అహ్హ!—గంపెడు సంసారాన్ని నెత్తిన పెట్టుకున్నట్టు మరీ చెప్పొచ్చావు లేవోయ్!—బాగు! నువ్వా ఒక కుటుంబీకుడ వయితే, అలా చెప్పేవాడివేనా!?" అని మాటగా, అవహేళనగా, చిలిపిగా ప్రశ్నించడంతో—భద్రయ్య మాటలను ఎదుర్కొనలేక మౌనం వహించాడు చలమయ్య.

ఇళ్లు సమీపించాయి .... భద్రయ్య కుటుంబం

65-వ పేజీ చూడండి



లివరు: దాని నిర్మితి, ధర్మములు


లివరు శరీరంలోవున్న గ్లాండు లన్నింటిలోకీ పెద్దది. శరీర కార్యక్రమంలో అది నిర్వహించవలసిన ధర్మములు అనేకములూ, అతి ముఖ్యములు. అందుకు అనుగుణంగానే దాని నిర్మితి ఏర్పడి వుంటుంది.


అనేక జ్వరాది వ్యాధుల్లో లివరు పెద్దదవుతూ వుంటుంది. లివరు పెరిగిందీ లేనిదీ తెలుసుకోడం చాలా తేలిక. చిన్నలలోనూ, పెద్దలలోనూ లివరు జబ్బు తరుచు మన దేశంలో యేర్పడుతూ వుంటుంది. ఆ జబ్బులో ప్రథమస్థితి లివరు పెద్దది కావడం. లివరు వ్యాధిగ్రస్తం కాంగానే కుడివైపున ప్రక్క ఎముకలవద్ద యేదో బరువుగా భారంగా తెలుస్తోంది. లివరు పెరిగిన మేరకు ఉదరంలో ఘన ప్రదేశం తగ్గినందున కొంచెం అన్నం తినంగానే కడుపునిండినట్లు తోస్తుంది. జీర్ణశక్తి తగ్గినట్లు తోస్తుంది. ఈ లక్షణాలు కనుపించగానే లివరు పెద్ద దయిందేమో చూస్తే సాధారణంగా పెద్దదయివుంటుంది. ఈ స్థితిలోనే తగిన చికిత్స పొందితే ముదిరిపోయిన తరవాత, అనివార్యమయిన లివరు వ్యాధులెన్నో నివారింపదగినవిగా వుంటవి. పటంలో ఆరోగ్యస్థితిలో లివరువుండేస్థితి చూపబడింది కుడిస్తనాగ్రం క్రిందనుంచి,పదవ ప్రక్క ఎముకకు కొంచెం క్రిందివరకు లివరు అంచు కనుపిస్తుంది. కాండమును వర్ణిస్తున్నప్పుడు ప్రక్క ఎముకలు ముందు స్టెర్నంనుంచి ఆరంభించి గుండ్రంగా తిరిగి వెనక వెన్నెపూసలను అంటివుంటవని చెప్పాను రెండు వైపులా 12 ప్రక్క ఎముకలు వుంటవనీ, అందులో చివరి రెండు ముందు వైపున వూరికే వ్రేళ్లాడుతూ వుంటవనీ చెప్పేను 10 వ ప్రక్క ఎముక 9 వ దానికీ, 9 వది 8 వ దానితోనూ అంటివుంటుంవి. అంటే ముందు వైపున స్టెర్నంలో మొదటి ఎనిమిది ఎముకలు మాత్రమే అంటివుంటవి. క్రిందివైపున ఆఖరు ప్రక్క ఎముక అంచు, సన్నకారు మనుష్యుల్లో కంటికి తెలుస్తూనే వుంటుంది. లివరులో రెండు, భాగములున్నవి. అందులో కుడివైపుభాగం క్రింది అంచు. పదవ ప్రక్క ఎముకకు క్రిందుగాగాని అరంగుళం క్రిందికిగాని ఆరోగ్యస్థితిలో వుంటుంది. అంటోదరుతో ప్రక్క ఎముక అంచుకంటికి కనిపించదు. చేతితో తడిమితేనేగాని తెలియదు. మనిషిని వెలికిలగా పడుకోబెట్టి, కాళ్లు, తొడలు మడచివుంచితే ఉదరంముందువైపు కండరములు సడలినిచ్చి కడుపునొక్కి చూడటానికి వీలుంటుంది. చూపుడువేలు ప్రక్క ఎముకకు ప్రక్కగా అదే దిశలోవుంచి "మృదువుగా" నొక్కుతూవస్తే, వ్యక్తి గాలిలోపలికి పీల్చినప్పుడు లివరు అంచు వ్రేలికి తాకుతుంది. గాలి వదలినప్పుడు ప్రక్క ఎముకకు లోపలివైపున లివరు అంచు వుండవచ్చును. కాని గాలి పీల్చినప్పుడు పదవప్రక్క ఎముకకు అరంగుళం క్రిందుగా లివరు అంచు వ్రేలికి తాకుతుంది. ఈ స్థితిదాటి లివరు అంచు క్రిందికి దిగినదంటే, ఏదో కారణంచేత లివరు వ్యాధిగ్రస్తమైనదన్నమాట లివరు వ్యాధులను చర్చించేటప్పుడు యీ విషయం ఇంకా వివరంగా చర్చిస్తాను. కుడివైపున పైనుంచి లెక్కపెట్టగా 5 వ ప్రక్క ఎముక క్రిందుగా లివరు పై అంచు వుంటుది. కాని, దాని స్థితిని నిర్ణయించడం చాలా కష్టం. అది వైద్యుల పని. దానికి చాలా శరీర పరిజ్ఞానమూ, అనుభవమూ కావాలి

లివరు రంగు అరటి పువ్వు రంగు. లివరును మనవారు పిత్తాశయము అన్నారు ఇది అతి రక్తపుష్కలత్వంగల ఉపాంగము. ఉదరం లోపలి భాగమును, క్రమ్మివుండే పెరిటోనియం అనే పొర లివరు పై భాగమునంతా క్రమ్మి వుంటుంది. లివరు చాలా మృదువైన ఉపాంగము. అందుచేత ఏమాత్రం ఒత్తిడి తగిలినా, ఇది పగిలి పోతుంది. కడుపుమీద నవ్వులాటకు గుద్దితే లివరు పగిలి చని పోయినవారున్నారు అందుచేత కుస్తీ పట్టేటప్పుడు కూడా కడుపుమీద గుద్దడమును, తన్నడమునూ నిషేధించారు. లివరు చూడడానికి నునుపుగావున్నా, శ్రద్ధగా చూస్తే దాని పైభాగం పంపరపనసకాయ చర్మంలాగా గరగరలాడుతూ వుంటుంది లివరు నిర్మితి రొట్టెలో పిండివంటిదికాదు. దాని నిర్మితిని ఒక లడ్డుతో పోల్చవచ్చును. లడ్డులో అనేక "బూందీ"లను, పంచదారపాకం కలిపి వుంచినట్లే అసంఖ్యాకములయిన లివరు ఖండములను, ఉన్నిలాగా వదులుగావుంటే ఒక ధాతు విశేషము కలిపి వుంచుతుంది. లివరులో కుడిభాగము, ఎడమ భాగము అని రెండు భాగములున్నవని యిదివరకే చెప్పేను. ఈ ప్రధాన ఖండములను 'లోబు'లు అంటారు. ప్రతి 'లోబు' (Lobe) అనేక చిన్న లోబుల కలయికతో ఏర్పడ్డది ఈ చిన్న ఖండికలను 'లోబ్యూలు' (Lobule) అంటారు. ప్రతి లోబ్యూలు ఒక చిన్న లివరు. అనేక సైనికులుచేరి సైన్యమైనట్లే అనేక ఖండికలుచేరి లివరు తయారైనది.

వయస్సులో యావచ్ఛరీర భారంలో 1/30 వ వంతు లివరు భారము. బిడ్డకు ఆరు సంవత్సరములు వచ్చే వరకు ఉదరంలోవుండే అనేక ఉపాంగములకు ఉదరంలో కిందిభాగం పూర్తిగా వృద్ధి కానందున, అక్కడ ఉండవలసిన ఉపాంగములు పైననే వుంటవి. నాభికీ, లింగమూల స్థానానికీవున్న ప్రదేశమును మనవారు 'వస్తి' అన్నారు. దానికి క్రిందవున్న "పెల్విస్" అనే ప్రదేశానికి పేరు దొరకలేదు. దానిని మూలాశయము అనవచ్చును. చిన్న బిడ్డలో లివరు అందులో ముఖ్యంగా ఎడమ ఖండము చాలా పెద్దదిగా వుంటుంది. ఈ కారణంచేత శిశువు శరీర భాగంలో ఒక్క లివరు మాత్రమే 1/20 వ వంతుగా వుంటుంది. శిశువుకు 6 సంవత్సరములు వచ్చే

53 వ పేజీ చూడండి





మడి, గుమ్మడి



పాత్ర'—'పాత్రధారి' ఈ రెండు పదాలకు ఎడతెగని సన్నిహిత్యం ఉంది ఏ రంగంలోనైనా సరే పాత్రకు పాత్రత కల్గించేవాడు గనుకనే అతణ్ని పాత్రధారి అనియుండవచ్చు బిచ్చగాడిని చినిగిన వస్త్రాలతో అలంకరించి బంగారు కిరీటం పెట్టినా రాజాధిరాజును కుచేలాలతో గద్దె నెక్కించినా అది అపాత్రత అవుతుంది అందుకే ఆఖరికి బిచ్చానికి బయల్దేరినా మోయగల పాత్రనే తెచ్చుకోవా లన్నారు కళారంగంలో ముఖ్యంగా చిత్రనాటకరంగంలోనూ ఇంతే ఊహించి కవి వర్ణించిన భూమికకు రూపకల్పనం చేసేవాడు నటుడు లేక పాత్రధారి పాత్రధారుల్లో కూడా పలురకాలు బరువైన భూమికను ఆశించి నిర్వహించలేక బోర్లపడే బలహీనులు మూడు తులాల వస్తువుకు ముప్పయి మణుగుల బరువు ఉపయోగించినట్లు దుర్బల పాత్రలు ధరించే భారీ విగ్రహాలు కవి వూహించిన పాత్రకు కాలదోషం పట్టించి, కవి చేతనే "ఇదా నే ననుకొన్నదీ !" అని ముక్కుమీద వేలేయించ గల ధీశాలులూను వీరుకాక ఇంకో ప్రత్యేక తరగతి కూడా ఉంది ఈ పాత్రధారుల్లోనే కవి కల్పితపరిధిలో లీనమవుతూనే తమ సహజ ప్రతిభతో పాత్రకు వినూత్న సోయగాన్ని కల్పించి కవిచేత "నాకన్న మూడాకులెక్కువే చదివాడు" అని మెప్పు పొందేవారు కొందరు ఈ తరగతికి చెందినవాడే చిత్రరంగపు పంట పొలాలలో తన విశిష్ట నటనపు విరిబంతిపూలతో, క్రొత్త భావాల కొత్తిమెర మళ్ళ కమ్మనిగంధం గుబాళింపజేసేసుమ్మైన కమ్మనాటిబిడ్డ గుమ్మడి ఈనాడు గుమ్మంటున్నా ఒకనాడు "గుమ్మ" న కూర్చున్న ఆయన నటనాచరిత్ర సింహావలోకన ప్రసహనంలో ఇది ప్రథమాధ్యాయం

* * *

"ఈనాటికి 11 ఏళ్లకు పూర్వం తమిళనాడ్ టాకీస్ పేరిట సౌందరరాజన్ 'అదృష్టదీపుడు' "నవ్వితే నవరత్నాలు" చిత్రాలు నిర్మించారు నవ్వితే నవరత్నాల్లో ఒంటికంటి రాక్షస పాత్రను, ధరించి తరువాత వచ్చిన పేరంటాలు చిత్రంలోను శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు నటించారు ఆయనకు అదృష్టదీపం పట్టనూ లేదు నవ్వితే నవరత్నాల పేరంటాలు లభించనూ లేదు ఒక ఏడాదిపాటు గుమ్మడికి ప్రేక్షకులకు మధ్య కాలావనికి అడ్డు నిల్చింది ఆ కాలంలో ఆయన స్వగ్రామంలో (గుంటూరుజిల్లా తెనాలితాలూకా రావిపాటిలో జననం 1926 విద్యాభ్యాసం గుంటూరు హిందూ కళాశాలలో) హాలసాయంలో 'గుమ్మడి' పాదులు చేసి వ్యవసాయం చేస్తూ ఉండిఉంటారు

ఎన్ ఎ టి సహకారంతో గుమ్మడి నటన వింతశోభను పుంజుకుంది ఆ సంస్థ తరపున రాయలసీమ క్షామ నివారణకోసం తారక రామారావు ప్రభృతులతో పాల్గొని ప్రశంసలు పొందారు ఆ సంస్థ నిర్మించిన పిచ్చి పుల్లయ్యలో ప్రాధాన్యం గల పాత్ర లభించటం, 'ప్రతిజ్ఞ' చిత్రంలో దుష్టపాత్ర నిర్వహించి మన్ననలు పొందటం, తోడు దొంగలు ప్రభుత్వ ప్రశంసాపత్రం పొందటం గుమ్మడిని చిత్రరంగంలో నిలబెట్టాయి ఆ తరువాత గుమ్మడి 'వదిన', 'ఏది నిజం', 'వీరకంకణం' ఎం ఎల్ ఎ, ఎత్తుకు పైఎత్తు, రాజమకుటం ఎన్నో చిత్రాలలో దుష్ట భూమికలు నిర్వహించారు ఏది నిజంలోని మునసబ్ పాత్రను గ్రామాధికార్ల దర్ప దౌర్జన్యాలకు ప్రతిబింబంగా తయారుచేసిన ఘనత గుమ్మడికి దక్కింది

ఒక వ్యక్తి అభ్యున్నతికి కొందరు కారణభూతు లౌతుంటారు సరిగా గుమ్మడి విషయంలోనూ అలానే జరిగింది దుష్టపాత్రలనిర్వహణ నేర్పిన గుమ్మడి ఆ ఎన్ ఎ టి సంస్థలోనే గంభీర పాత్ర నిర్వహణకు అక్షరాభ్యాసం జరిగింది ఆ సంస్థ నిర్మించిన "జయసింహ" లో సౌమ్యమైన రాజ్‌సింగ్ పాత్రను గుమ్మడి నిర్వహించాడు అర్ధాంగిలో జమీందారు పాత్రను అతిప్రశంసనీయంగా నటించి గుమ్మడి, ఇల్లరికం, భార్యాభర్తలు ఇంకా పలు సాంఘిక చిత్రాలలో పేరు పొందారు

పాత్రకు పాత్రత కల్గించేవాడు పాత్రధారి ఇది గుమ్మడి అక్షరాల నిజం మనకు తెలిసిన కథకైనా కలాని పాత్ర స్వరూపం ఇది అని నిరూపించటానికి అవయవసౌష్టవం గుమ్మడికి తోడ్పడ్డంతగా మిగిలినవారికి లేదు సహాయ నటుడుగా మెలగిన గుమ్మడి "మా యింటి మహాలక్ష్మి" చిత్రంలో ప్లీడరు పాత్రను అతిరసవంతంగా పోషించి ఆ పాత్రకు రూపకల్పనం చేశాడంటే కారణం ఆ నటునకున్న అవయవసౌష్టవం పాత్ర స్వరూప స్వభావాలతో మూసపోసినట్లు తయారు కావటమే ఒకనాటి సనాతన బ్రాహ్మణత్వానికి నిదర్శనంగా 'జయభేరి' లో ఉన్న కాశీ అన్న పాత్రను తన ఆంగికాది అభినయంతో మేళవించి సద్బ్రాహ్మణస్వరూపానికి ప్రతిబింబంగా ఆ పాత్రను మెరుగులు దిద్దిన మేటి గుమ్మడి ఇటీవలి చిత్రాల్లో గుమ్మడికి లభించిన పాత్రా కవికల్పితపరిధిల్లోనే వర్తిస్తూ నట ప్రతిభతో జతకలిసి పాత్రలకు సజీవప్రతిబింబాలుగా తయారవుతున్నాయి భార్యాభర్తలు, తండ్రులు—కొడుకులు చిత్రాల్లో అలాంటి విశిష్టమైన పాత్రల ఆయన ధరించారు

కర్తవ్యసాంప్రదాయపరతంత్రుడు, ముప్పై ఏళ్లకు పైబడ్డ కథానాయకుడు, ఈ పాత్రలకు కావా

50-వ పేజీ చూడండి



నాగేశ్వరరావు, గుమ్మడి

ఈ వారం సినీ విహారం

మధు మూర్తి

"ఇద్దరు మిత్రులు" ట్రయలర్

అన్నపూర్ణా ఎక్చర్స్ చిత్రం "ఇద్దరు మిత్రులు" ఈ నెలాఖరులోగానే విడుదల కావచ్చునని వారి షూటింగ్ కార్యక్రమాల జోరు తెలియజేస్తోంది ఒక వారం రోజుల వ్యవధిలో వారు దాశరధి రచించిన కవాలీ "నవ్వాలీ నవ్వాలీ నీ నవ్వులు నాకే ఇవ్వాలీ" చిత్రీకరణను, "ఉన్నమాటంటేనే ఇంత ఉలుకా" అనే మరొక నృత్య చిత్రీకరణను పూర్తి చేశారు కవాలీ పాటలో జ్యోతి, రెండవ పాటలో ఇ వి సరోజ నృత్యం చేశారు నృత్య దర్శకుడు హీరాలాల్ యిచ్చిన సరసమైన హావభావాలను కామెరామన్ సెల్వరాజ్, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు విలువైన కోణాలలో వెండితెరకు అందింది వారు ఈ రెండు పాటలకు సుశీల మధురస్వరం, రాజేశ్వరరావు ఇంపైన బాణీలు అందినవి డిసెంబరు 11 వ తేదీతో చిత్రం షూటింగ్ పూర్తి అయింది

మరొకవైపు నిర్మాత డి మధుసూదనరావు రీ రికార్డింగును జరుపుతూ ఒక కొత్తరకం ట్రయలర్‌ను కూడా తయారు చేశారు ఇది ఆంధ్ర దేశంలో 12 వ తేదీ నుంచి ప్రదర్శింపబడుతూంది "ఇద్దరు మిత్రులు" చిత్రం 15 వ తేదీనే సెన్సారయింది


ఈ చిత్రం ఈ నెలాఖరులోనే విడుదల అయే పక్షంలో అన్నపూర్ణా పిక్చర్స్ చిత్రాల 1961 లో రెండు విడుదలైనట్లవుతుంది

కవాలీ పాటలగిరాకీ

ఈమధ్య తెలుగుచిత్రాలలో కవాలీ పాటలు జోరుగా చొరబడుతున్నవి డిసెంబర్ 10 వ తేదీన రేవతీ సౌండ్ స్టూడియోస్ (ప్రకాశ్ స్టూడియో) లోంచి " నా మనసంతా తీసుకో— అది ఏమైనా మవు చేసుకో" అనే కవాలీ గానా బజానా సరంజామాతో వినబడుతోంది

రంగేలివై శృంగారముతో
రాతిరి కలలో కలుసుకో
కనులతో మాటాడే జానా
నా కొన చూపులే కోటి పరపాల నజరానా
తీయని కానుక తీసుకవస్తే
ఎందుకు నీకు నిరాదరణ
నవనవలాడే నా వయసంతా
చేసే నీకు బహూకరణ
మనసు గెలవాడే విజమైన మనిషి
మమత తెలియించుకొటే దిల్‌కుషీ

ఇది ఆరుద్ర కవనం పాట పాడుతున్న తార జిక్కి కృష్ణవేణి బాణీ కుదిర్చిన సంగీత దర్శకుడు వేణు



శేఖర ఫిలిమ్స్ వారి 'చిన్ననాటి శపథం'లో జెమినీ గణేశన్.

ఈ పాటతో నడిచే వాయిద్యాలలో దిల్‌రుబా కూడా వాయించాడు ఇది కళాప్రపూర్ణ థియేటర్స్ తొలి చిత్రం "ఇరుగు పొరుగు" కు చెందినది ఆ చిత్రంలో పరిచయం కానున్న ఒక కొత్త తార శ్రీమతి గౌరి నోట వినబడుతుంది ఆమె గానా బజానా బాణీలో అభినయం అందిస్తుంది ఈ చిత్రానికి నిర్మాత పి విజయసారధి, దర్శకుడు సీతారామ కళ్యాణం చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన బి ఎస్ మూర్తి, "అభిమనోయ్" అనే బెంగాలీ చిత్రగాధకు ఆధారంగా తయారవుతున్న ఈ చిత్రానికి మాటలు కొండేపూడి లక్ష్మీనారాయణ ప్రాశారు కామిరా ఆదీ, మల్లి ఇరావిలు.

ఈ చిత్రంలో ఎన్ టి రామారావు, బాలయ్య, శోభన్‌బాబు, గుమ్మడి, పి ఎస్ ఆర్, బాలకృష్ణ, రామకోటి, కృష్ణకుమారి, గిరిజ, సంధ్య, నిర్మలా కొత్త నటి గౌరి నటిస్తున్నారు



విక్రమ ప్రొడక్షన్స్ వారి 'పెళ్ళితాంబూలం'లో జమున.

బిడ్డతెచ్చిన ఆపద

ఒక అబ్బాయి చలి చప్పుడూ కాకుండా, ప్రియురాలితో చెప్పకుండా చల్లగా వూరికి వెళ్దామనుకుని పెట్టె బేడా చంకను బెట్టి మేడ మీంచి దిగుతూంటే చురుకైన అమ్మాయి తన చలాకీతనం చూపుతూ అతన్ని పట్టుకుంది "ఏమీ కాలివేళ ఎక్కడారు వెడతారండీ శ్రీవారూ!" అంటూ అతనితో చమత్కారంగా సరసమాడింది

"మీకంత నవ్వులాటగా ఉందన్నమాట" అన్నాడు అబ్బాయి

"ఏం? మీ కెలా ఉందేం?" అని ఎదురు ప్రశ్న వేసింది అమ్మాయి

"బాధగా ఉంది" న్నాడు

"ఎందుకు?"

49-వ పేజీ చూడండి

చదువుల్రావు


ఒరేయ్ సినిమాలకి వెళ్ళొద్దని ఎన్నిసార్లు చెప్పేను మళ్ళీ మేట్నీకెళ్ళావా.
అసలునేను సినిమాకే వెళ్ళలేదు నాన్నా కావస్తే నా బుర్రా వాసన చూడు సిగరెట్లుపొగవాసన వేస్తుందేమో?
సిగరెట్లుపొగ వాసన ఎందుకు వేస్తాం డాడీ_ అసలు సినిమా హాల్లో సిగరెట్లు కాల్చనీయటంలేదుగా
ఆఁ ఎందుకు కాల్చటం లేదు ఈవేళ బోల్డుమంది కాల్చారు
అరెరె ఇలా చెప్పేసేనేమిటో?



*



పాలవెన్నెల పరవశంగా నవ్వుతోంది.

తమలపాకుల చిలక భర్తకి అందించి "ఏమిటి ఆలోచిస్తున్నారు ?" అన్నది సుభద్ర. చక్రపాణి మందహాసంతో "దేవిగారు చెప్పిన సంగతే" అన్నాడు.

"ఏదయినా నిశ్చయానికి వచ్చారా ?"

"దేవిగారి ఆనతి మీరగలమా ?"

"గొప్ప ! అక్కడికి అంతా నా యిష్టప్రకారమే జరుగుతున్నట్లు ?"

"కాక ?"

"అవున్లెండి ! మీ అంతటి భార్యావిధేయులు యీలోకంలో ఉన్నారా ?"

"అదేం ప్రశ్న ? భార్యావిధేయు డయితేనేగాని ఆమె కోర్కెలు తీర్చడా మగవాడు ?"

"ఉహూఁ."


సుభద్ర స్వరంలోని కొంటెతనం చక్కిలిగింతలు పెట్టింది చక్రపాణికి. పరవశవదనంతో ఆమెవంక చూసి "నీకు విధేయుడనేగా సుభా ?" అన్నాడు.

"థాంక్స్" అన్నది సుభద్ర కొంటెగా.

"ఈవాదన కేంగాని, ఆడపిల్లంటే అమిత దూరాన ఉండే మన రాజాగాడు అమాంతం ఈ ఇందిరా ప్రణయంలో తలమున్కలై పోవడానికి కారణం ఏమిటంటావు?"

45-వ పేజీ చూడండి

*



పువ్వులు

శ్రీమతి శాంతాశామస్‌గారు రాసిన "పువ్వులు" అన్న వ్యాసం చాలా బాగుంది. ఆవిడ చెప్పినట్లు ఉత్తరాదిన ఎవ్వరూ పూలు పెట్టుకోరు పెట్టుకున్నా, రెండు జడలు వేసుకున్నవాళ్ళు ఒక జెడలో ఒక పువ్వు, లేకపోతే కొప్పు పెట్టుకున్నవాళ్ళు సగం మాల కొప్పుమీద, సగం భుజంమీద పడేటట్లు పెట్టుకుంటారు.

మీనాక్షీమూర్తి (కలకత్తా)

* * *

పువ్వులు పెట్టుకోవడము కూడ ఒక తప్పు అని నాకు యిదివరకు తెలియదు. స్త్రీ అందాన్ని రెట్టింపుచేసి, కేశములకు అలంకారాన్ని యిచ్చేవి పువ్వులు అందులోనూ తెల్లని మల్లెల మాట చెప్ప నవసరమే లేదు మా యింటిముందు మల్లె తీగలు అల్లుకొన్నాయి నల్లని ఆకాశంలో తెల్లని చుక్కల్లా పూలు పూసివుంటాయి సాయంత్రానికల్లా. వీధిన పోయే ప్రతివారి దృష్టి ఆ తీగమీదే వుంటుంది చూడగానే మనస్సును ఆకర్షించే పూలను పెట్టుకోవడం దోషమని అనుకునే వారున్నారంటే విచిత్రంగా వుంది.

సరోజా నాగలక్ష్మి (అనంతపురం)

* * *

అసలు ఆడపిల్లలకి తలనిండా పువ్వులు పెట్టుకుంటేనే అందము. మేము మా యింటిముట్టూ కాంపౌండులో ఎన్నో రకాల పూల మొక్కలను ఎంతో శ్రద్ధగా పెంచుతాము. ఎవరన్నా మా యింటికి వచ్చినవాళ్ళు, "మీరు చెట్లు ఎంత శ్రద్ధగా పెంచుతారండీ" అని అంటారు.

బి. కన్యాకుమారి (పెరంబూర్)

* * *

సాయం సమయాన ఒడిలో సన్నజాజులు పోసుకొని మాల కడ్తూ ఉంటే మనసుకి ఎంతో ఆనందంగా వుంటుంది పువ్వును చూడగానే అది గులాబి కానీండి, గడ్డిపువ్వు కానీండి జడలో అలంకరించుకోవాలని అనుకోని స్త్రీ వుండదు. స్త్రీలు నిత్య జీవితంలో మృదువైన పుష్పాలతో సన్నిహిత సంబంధం కల్గివుంటారు అందువల్లనేకావచ్చు స్త్రీలు మృదుహృదయం కలవారనిపిస్తుంది సన్నజాజులపరిమళం, గులాబీల అందం, బంతిపూల బంగారు కాంతులు, సంపెంగల సువాసన స్త్రీలని ఆకర్షించి వారి సున్నిత మనసుల్ని వశపర్చుకుంటాయి. పూలపై వ్యామోహం స్త్రీలకు ప్రకృతి సహజంగా వచ్చినది. స్త్రీ పువ్వులకి యిచ్చే విలువ అమూల్యమైనది.

కట్టిప్రోలు లక్ష్మీనరంగ (అనకాపల్లి)

పేర్లూ-పిలవడాలూ

ఆయన్ని, నేను, పేరుపెట్టి పిలవండి, అని, ప్రతి మాటుకొంటే, కాంతా అని ఓమాటు ఎలాగో అనేసి "ఏమ్", "ఒసేయ్" అని మొదలు పెడతారు. అలా పిలుస్తే తలకాలని ఉండదుకాని, ఎంతసేపు పూరు కోగలం. [illegible] చనువు పేరుపెట్టి పిలవడముతో వుండదంటారు.

ఎస్. కాంత (జంషెడ్‌పూర్)


* * *

భర్త ఒసే, ఏమే అని పిలిచినా, భార్య సిగ్గుపడ వలసిన అవసరం లేదనుకొంటాను. భర్తలు భార్యల గుర్తెరిగి పేరుకి షార్టుకట్‌చేసి పిలవాలని, వలుగురికి బాగుండేలా పిలవాలని అనడం స్త్రీ సంప్రదాయానికే విరుద్ధం. ఏమయినా భర్త తన మనసుకు నచ్చిన విధంగా పిలచుటకన్న భార్యకు వేరే ఆనంద మేముంటుంది! అలా పిలచుటవల్ల ఏ విధమైనటువంటి వైషమ్యాలు చెలరేగవు. నన్ను మా ఆయన ఒసే, ఏమే అని పిలుస్తూవుంటారు. నాకు చాలా ఆనందంగా వుంటుంది. ఏది ఎలావున్నా భార్యాభర్తలు ఒకరి నొకరు అర్థం చేసుకొంటే ఈ పేర్లూ—పిలవడాలు అన్న ప్రశ్నే రాదు. ఇది నా అభిప్రాయం మాత్రమే.

రమణీమణీశర్మ (విశాఖపట్టణం)

★

ఎప్పుడూ ఇంతే—112 శంకర్



కుటుంబ నియంత్రణం

శకుంతలా పరంజపే

మన దేశంలో జనాభా విపరీతంగా పెరిగిపోతున్నట్లు అంచనాలవల్ల తెలుస్తోంది ఈ పెరుగుదలను అరికట్టేందుకు ఏవో కొన్ని కృత్రిమోపాయాలను కూడా సూచించటం జరిగింది కాని ప్రస్తుత జీవన పరిస్థితుల దృష్ట్యా, సరైన ఆరోగ్య సదుపాయాలు లేకపోవటంవల్ల, అశేష ప్రజానీకానికి అతిచౌకగా, సులువైన నివారణోపాయం లభిస్తే తప్ప, రాబోయే 10—20 సంవత్సరాల్లో ఏర్పడే సమస్యకు, ముగ్గురు పిల్లలకు మించివున్న తల్లిదండ్రులు (ఎవరో ఒకరు) శస్త్రచికిత్స ద్వారా కుటుంబ నియంత్రణం అమలు జరపటం వినా పరిష్కారమార్గంలేదనేది స్పష్టమౌతోంది. ఈ విషయంలో మహారాష్ట్రం ఒక్కటే తగినంతగా ముందడుగు వేసింది

శస్త్రచికిత్సద్వారా కుటుంబ నియంత్రణం పట్ల పామరజనానికి సర్వ సాధారణమైన, సహజమైన, అపోహాలు, ఆందోళనలు, ప్రబలుతున్నాయి. ఈ అనుమానాలను పారద్రోలేందుకు, ఈ శస్త్ర చికిత్స ద్వారా లాభం పొందిన సామాన్య కుటుంబీకుల అభిప్రాయాలు, చికిత్సకు పూర్వం, అనంతరం వారి వారి అనుభవాలను తెలియజేయుటంకన్న ఉత్తమ సాధనంలేదు ఈ పద్ధతినే మహారాష్ట్రంలో కొంత వరకు అనుసరించటం జరిగింది ఈ విధానం మూలంగా 1960 సం. లో 25,000 శస్త్ర చికిత్సలు జరిగాయి ఈసంవత్సరం ఇంకా40,000 మంది శస్త్ర చికిత్స ద్వారా నియంత్రణకు పూనుకునే అవకాశాలున్నాయి

నేను వివిధ సమావేశాల్లో కలుసుకున్న పలువురు స్త్రీ, పురుషుల అభిప్రాయాలను ఇందులో ఇస్తున్నాను. వీరంతా నియంత్రణాన్ని తలోక దృక్పథంలో ఆలోచించినవాళ్లే ఈ ప్రకటనలవల్ల ఇందలి వ్యక్తులు కూడా తమలాగే శ్రామికులేనని, అతి నిర్మలంగా, స్పష్టంగావున్న ఈ సంభాషణలు, నేతలు, సంఘ సేవకుల ఉపన్యాసాలకన్న ఎక్కువగా పని చేస్తాయని చదువరులు తప్పక గ్రహించగలుగుతారు

మహారాష్ట్రంలోవున్న ప్రతి కమీషనరు డివిజనుకు, కుటుంబ నియంత్రణకుగాను సంచార శస్త్ర చికిత్సాదళం ఏర్పాటు చేయుటం జరిగింది బొంబాయి జట్ను గ్రామీణ ప్రాంతాల్లో గత కొన్ని మాసాలుగా పురుషులకు నియంత్రణ శస్త్ర చికిత్స జరుపుతున్నది. ఈ చికిత్సకులోనయ్యే వ్యక్తి నెలసరి ఆదాయం రు 150—కి తక్కువైతే ఆ వ్యక్తికి చికిత్సాకాలంలో నష్టమైన రోజులకు రు. 20లు ప్రత్యామ్నాయభృతి ఇస్తున్నారు ఈరోజు మహారాష్ట్రంలో ప్రతి జిల్లా తనకు ఒక సంచార వైద్య దళం కావాలన్నదంటే కుటుంబ నియంత్రణం పట్ల పురుషులు ఎంత మొగ్గు జూపుతున్నారో తెలుస్తుంది

ప్రతి రాష్ట్రంలోనూ ఈ సంచార శస్త్ర చికిత్సాబృందం ఏర్పాటు చేయటమేగాక, ప్రతి దళంలోను, శస్త్ర చికిత్సపొందిన వ్యక్తి నొకరిని ఈ నియంత్రణ ప్రచారంలో తోడ్పడేందుకు నియమించాల్సి వుంటుంది. శస్త్ర చికిత్స ద్వారా జరిగే కుటుంబ నియంత్రణంవల్ల వచ్చే లాభాలను వివరించేందుకు ఇలాటివారిని ప్రతి సమాజాభివృద్ధి కేంద్రంలోను నియమించాలి. అలాంటివారు తప్పకుండా 35 ఏళ్ళపైవారే అవుతారు గనుక వయో విద్యల నిబంధనలను వారి విషయంలో సడలించాలి. విద్య అనేది నిజానికి లేకపోవటమే ఒక విధంగా ప్రజలు తమలో తాము సన్నిహితం కావటానికి తోడ్పడుతుందనేది నే నీయబోయే ఉదాహరణలవల్ల స్పష్టమవుతుంది

నే నీ సంతాన నిరోధ రంగంలో 20 ఏళ్ళకు పైగా పని చేస్తున్నాను. అవసరమైతే ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా గ్రామీణ, పారిశ్రామిక ప్రాంతాలలో పనిచేసే సంఘ సేవకులకు కుటుంబ నియంత్రణ విషయంలో నా విధానాలను వివరించేందుకు కూడా నేను సిద్ధమే !

శస్త్ర చికిత్స ద్వారా నియంత్రణం సాంసారిక జీవనానికి ప్రతిబంధకమా?

గుంబార్— రాష్ట్ర రవాణా శాఖలో పనిచేస్తుండే వాడిని. నా భార్య పురిటికి వెళ్ళినప్పుడల్లా నాకు రు. 100— అప్పు చేయాల్సి వచ్చేది అయితే నాలో నిజాయితీ అంటూ, కొంత ఉండటంవల్ల ఈ అప్పును ఏవో కొన్ని నెలసరి వాయిదాల్లో తీర్చి వేస్తుండేవాణ్ణి. కాని నే నీ అప్పు తీర్చేలోపలనే నా భార్య మళ్ళీ ప్రసవానికి సిద్ధమయ్యేది మళ్ళీ అప్పు చేయాల్సి వచ్చేది. ఈ అప్పుల్లో మునిగి తేలుతూనే నేను ఆరుగురు బిడ్డల తండ్రి నయ్యాను. జీతం రు. 90 — మించి పెరక్కపోగా అప్పు బాధ ఎక్కువ కాసాగింది. నా పరిస్థితి గమనించి నా పై అధికారి శస్త్ర చికిత్స చేయించుకుని కుటుంబ నియంత్రణ అమలు జరపవలసిందని, ముగ్గురు పిల్లల తరువాత తాను గూడా ఆపనే చేశానని నాకు నచ్చచెప్పాడు నేనూ నిశ్చయించుకున్నాను. నా కష్టాల్లో ఆదుకుంటున్న నా మిత్రులు కొంతరికి నా నిశ్చయం చెప్పాను అది వారందరికీ నచ్చక పోగా, "నీకేమన్నా పిచ్చెక్కిందా ఏం? నిక్షేపంలాంటి బతుకు పాడుచేసుకోవాలనే బుద్ధి పుట్టిందేం? కొజ్జా బతుకు కావాలనివుందా?" అంటూ హేళన చేశారు. అంతటితో వూరుకోక మా అమ్మగారికి చెప్పి తల్లి కొడుకుల మధ్య కలతలు రేపారు. మా అమ్మను నమ్మించేటప్పటికి నా తల ప్రాణం తోకకు వచ్చింది. నా భార్య కూడా వెంటనే అనుమతించింది

శస్త్ర చికిత్స నిమిత్తం సాసూన్ ఆస్పత్రికి వెళ్ళాను. చికిత్స 15 నిమిషాలసేపులో జరిగిపోయింది. చీమ కుట్టిందానికన్నా ఎక్కువ బాధనిపించలేదు.

రెండు గంటల తర్వాత రెండు మైళ్ళ దూరాన వున్న మా యింటికి నడిచి వెళ్ళాను. ఇంట్లో రెండ్రోజులపాటున్నాను అటూ ఇటూ తిరుగుతూనే వున్నానేగాని, స్థిమితంగా ఒకేచోట కూర్చోలేదు. ఒకవారం తర్వాత కుట్లు విప్పారు.

ఒక రెండు నెల్ల తరువాత మళ్ళీ మామూలుగా నేను సాంసారిక జీవనం సాగించేందుకు వైద్యులు అనుమతించారు నా జీవితం నా స్నేహితులనుకున్న విధానాలేమి జరక్కుండా, ఎంతో సంతోషంగా గడచిపోతోంది నన్ను మొదట అభ్యంతరపెట్టిన స్నేహితుల్లో ఇద్దరు తాము కూడా తర్వాత శస్త్ర చికిత్స చేయించుకున్నారని తెలిసింది."

సంతాన నిరోధక సాధనాలు ఎప్పు డుపయోగించాలి?

జాగ్‌దళే : పూనా మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగిని జీతం బత్తెం పెరక్కపోయినా, ఇంటి ఖర్చులు మాత్రం పెరిగాయి. ఆర్థికస్తోమతు రోజు రోజుకు క్షీణించసాగింది. కొత్త చొక్కా కావాలని ఒకడు, పాంటు చినిగిపోయిందని ఇంకొకడు, పలక పగిలిపోయిందని, పుస్తకాలు చినిగిపోయాయని గోల చేస్తుండేవాళ్ళు

మా ఆఫీసులో కొంతమంది శస్త్ర చికిత్స ద్వారా కుటుంబ నియంత్రణం అమలు జరిపిన వారున్నారు కాని నేను మాత్రం ధైర్యం చేయలేకపోయాను. మా ఆవిడ ఆరోకాన్పుకు సిద్ధమైంది. ఏదోకటి చేయాలని నిశ్చయించుకుని ఆమెను లేడీ డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాను. ఆవిడ

44-వ పేజీ చూడండి

ఈ వ్యాసరచయిత్రి బొంబాయి శాసన పరిషత్తు సభ్యురాలు, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఎం. ఏ. పట్టభద్రురాలు, 'కేంద్ర కుటుంబ నియంత్రణ మండలి', 'రాష్ట్ర కుటుంబనియంత్రణ మండలు'లలో సభ్యురాలు.

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి

లౌడ్ స్పీకర్లు

ఇదివరకు ఏవరింట్లోనైనా ఒక శుభ కార్యము జరిగిందంటే ఆయింట్లో ఆరోజు రాత్రి పాటకచ్చేరియో, లేక హరికథా కాలక్షేపమో ఏర్పాటు చేయబడేది ఆ తర్వాత కొంతకాలం మార్పుతో పాటు ఈ వినోదకాలక్షేపాలలో కూడా మార్పు జరిగింది. ఆ శుభ కార్యం మూడురోజులో, రెండురోజులో గ్రామఫోను పెట్టుకోవడం ఆరంభమయ్యింది. అప్పట్లో, అంటే గ్రామఫోనులు క్రొత్తగా ఉపయోగించబడే రోజుల్లో ఫలానా పెండ్లివారింట్లో గ్రామఫోను పెడ్తున్నారంట అని తెలుసుకొంటే పల్లెంతా విడ్డూరంగా చెప్పుకొని, ఆ పాటలు పాడే పెట్టె చుట్టూ మూగి విచిత్రంగా చూసేవారు. కాలంతోపాటు శాస్త్రవిజ్ఞానం, దానితోపాటు మనం, మన ఆచారాలు అన్నీ మారిపోయాయి. అదే ఈనాడు పెండ్లివాళ్లింట్లో పాటలుపాడే పెట్టె చుట్టూ ప్రజలు చేరడంలేదు ఆవే మరికొంత మార్పుతోటి చాలామందికి విన్పించేటట్టుగా లౌడ్ స్పీకర్లు (మైక్రోఫోను) గా మారాయి. రెండింటిలోనూ మూలసూత్రము గ్రామఫోనూ, రికార్డులే. కానీ కావాలని దగ్గర కూర్చొనేవాళ్లకు పాటలు పాడి వినిపించేది గ్రామఫోన్లైతే, వద్దని చెవులు మూసుకున్నా హోరెత్తించేవి లౌడ్‌స్పీకర్లు. తేడా యింతే !

లౌడ్‌స్పీకర్లు ప్రచారంలోనికి వచ్చిన క్రొత్తల్లో అవి సామాన్య ప్రజల ఆర్థికస్థాయికి అందుబాటు లేనందున శ్రీమంతుల గృహాల్లోని శుభకార్యక్రమాల్లో, గొప్ప సభలలో మాత్రమే ఉపయోగించబడేవి కానీ రాను రాను యివి మధ్య తరగతి ప్రజలు భరించగలిగినంత ధరకు బాడుగకు లభించడంవల్ల, నేడు బహుళ ప్రచారంలో ఉన్నాయి.

చివరకు మారుమూలల్లోని కుగ్రామాల్లో కూడా బ్యాటరీ ద్వారా ఈ లౌడ్‌స్పీకర్లు వాడబడుతున్నాయి.

పాతకాలపు గ్రామఫోనులతోనే తృప్తిపడాలా ? అని అంటారేమో మానవునిలో దినదిన ప్రవర్ధమాన్నమౌతున్న శాస్త్రపరిజ్ఞానానికి మన మందరం జోహారు లర్పించాల్సిందే. ఆ విజ్ఞానం మానవుడి ఉల్లాసానికి, ఆనందానికి, సుఖానికి ఉపయోగపడాల్సిందే కాదనగలవా రెవరు ? కానీ ఆ యంత్రాలవల్ల తోటి మానవులకు యిబ్బంది కలుగరాదు.

చిన్న గ్రామాల్లో అయితే అర్నెల్లకో, ఏడాదికో ఎవరింట్లో పెండ్లో, పుట్టేంటికలో జరుగుతాయి. రెండు రోజులపాటు పూరిచివరిదాకా విన్పించే యీ సంగీతానికి పల్లె ప్రజలంతా ఆనందిస్తారు. పట్నాల్లో, ప్రత్యేకంగా సిటీలలో, పట్టణాలలో, తాలూకా ముఖ్య కేంద్రాలు మొదలైన ఊర్లలో. ఊరు పెద్దదవడంచేత ఎవరింట్లోనో ఒకరింట్లో, ఏ వీధిలోనో ఒక వీధిలో ఏదో కార్యం జరుగుతూనే ఉంటుంది. ఇక ఈ లౌడ్ స్పీకర్లమోతకు తల దిమ్మెక్కిపోతుంది. మా వీధిలో మా యింటికి మూడో యింట్లో పెండ్లి. ముహూర్తం 28 వ తేదీ తెల్లవారుఝామున అనుకోండి. ఇక రికార్డులు 26 వ తేదీ ఉదయం ప్రొద్దుపొడిచి పొడవకముందే మొదలుపెట్టారు. నిమిషమున్నా విరామం లేకుండా ముహూర్తం వరకూ మోత మ్రోగించారు. ఆ ముహూర్తం 20 నిమిషాలు కాస్త ఊపిరి తిరిగింది. ఇక మళ్లా మొదలుపెట్టారు. రాత్రి 10 గంటల వరకూ వేసిన పాటే పదిసార్లు వేసి మా అందరి ప్రాణాలు తీశారు. అంటే 26 వ తేదీ ఉదయం ప్రారంభమయిన పాటలు 27 వ తేదీ రాత్రి 10 గంటలకు ముగిసాయి. ఇంకొక్క రోజు గాని వాళ్ళు రికార్డులు పెట్టివుంటే ఆ వీధిలో వాళ్లకు సగం మందికైనా పిచ్చి పట్టివుండేది. మా యింట్లో ఒకరి మాట ఒకరికి వినిపించక సైగలతో చెవిలో చెప్పుకొని కాలం గడిపాము ఆ రెండు రోజులు. ఒక రాత్రంతా జాగారం చేశాము.


అతిశయోక్తి అనుకుంటారేమో మీలో చాలా మందికి ఇటువంటివి స్వానుభవమై ఉంటుందని నా అభిప్రాయం నిశితంగా ఆలోచిస్తే వారి తప్పు కూడా లేదనిపిస్తుంది. మన కింత సందడిగా ఉందే. ఇంత సంతోషంగా ఉన్నామే. అందరు మాత్రం ఈ సంగీతం విని ఆనందించరా అని అనుకుంటారు. మరికొందరు మనింట్లో ఘనంగా కార్యం జరుగుతున్నందుకు ముచ్చటగా మూడు రోజులపాటైనా మైక్ పెట్టుకోకపోతే ఎలా ? అందరికీ తెలిసే దెలా అని అనుకుంటారు. కానీ ఆ వీధి వీధంతా చెవులు దిమ్మెత్తి పోతున్నాయని తెలుసుకోలేరు. పైగా ఎవరన్నా కలుగజేసుకొని “బాబూ రెండు రోజులుగా మెదడు పనిచేయనని మొండికేస్తున్నది. కాస్త ఆ పాటలేవో మీ యింటి వరకు విన్పించేలాగా పెట్టుకోండి” అంటే నా యిష్టం వచ్చినట్లుగా నేను పాటలు పెట్టుకుంటాను నీ దిక్కున్నచోటు కెళ్లి చెప్పుకోమంటాడు ఇదీ వరస కాబట్టి ప్రతి చిన్న కార్యానికీ రోజుల తరబడి యిలా మోత మోగించే దాని కన్నా వాళ్లింటివరకూ విన్పించేలాగ చక్కగా రేడియోనో, గ్రామఫోనో పెట్టుకుంటే బాగుంటుంది. అట్టహాసంగా, ఘనంగా చేయదల్చుకున్న వారు సాయంకాలం ఘన సంగీత విద్వాంసులచే పాట కచ్చేరో లేక ప్రఖ్యాత నాట్యతారలచేత నృత్య ప్రదర్శనమో, లేక మంచి నాటకమో పెట్టిస్తే అందరూ ఓ రెండు మూడు గంటలసేపు చూసి విని ఆనందిస్తారు. అంత ఆర్థిక స్థోమతు లేని వారు ఆ కార్యంనాడు ఓ రెండు గంటలసేపు మైక్ పెట్టుకుంటే బాగుంటుంది. అంతేకానీ వరసబెట్టి మూడు రోజులు విధి విరామం లేకుండా ఈ రికార్డులతో హోరెత్తించడం చాలా శోచనీయం.

ఒకసారి మా వీధిలో అటు చివర యింట్లో ఒక పెళ్లి, ఇటు చివర యింట్లో ఒక పెళ్లి ఒకే రోజు జరుగుతున్నాయి. ఇద్దరూ మైక్‌ల ద్వారా సంగీతం అందించసాగారు. ఇక చూసుకోండి మా బాధ వర్ణనాతీతం ! రెండు పాటలు కలిసి వినిటో గందరగోళంగా విన్పించసాగింది. ఎట్లాగయినా సహించాల్సిందే గానీ యిల్లు వదిలి పోలేముకదా. ఆ రోజుల్లో చెవుల్లో వేళ్లు పెట్టుకొని తిరిగాము. ఒక్కరైనా వరే వీధిలోని కాపురస్థులు ఎంత బాధపడుతున్నారో ఆలోచించలేదు. ఆలోచిస్తే ఆవిధంగా రికార్డులు వేసిఉండరు.


పోయిన సంవత్సరం సరిగ్గా పరీక్షల సమయంలో తెల్లవారుఝామునుండి పరీక్షలు మొదలు. మా ఎదురింట్లో కర్మమంత్రాలు. ఈరోజు ఉదయాన్నించే మైక్ ఏర్పాటుచేసి మంత్రపఠనం రికార్డులు వేయసాగారు. మా శ్రీ యూనివర్శిటీ పరీక్ష బాబోయ్ అని తమ్ముడు, చెల్లాయి అవతల వీధిలో ఉండే మా మేనత్త యిల్లు చేరుకున్నారు చదువుకొనేందుకని. అలా మంత్రాలు చదివించడం ఆ తెగవాళ్లకు ఆచారం అట. కానీ వాళ్ళ వాళ్ళ యింట్లోని మంత్రపఠనం వీధిలోవాళ్లందరూ వినాలని మైక్ పెట్టడం బాధ కల్గించింది ఇలా ఉన్నాయి ఈ లౌడ్‌స్పీకర్ల ఉపయోగాలు. పెద్ద సిటీస్‌లో రాత్రి 9 గం. దాటితే న్యూసెన్సు క్రింద కేసు పెడ్తారని రాత్రిళ్లు ఈ గోల ఉండదేమో కానీ అటు పల్లె, ఇటు పట్నంగాని పోట్ల యివి వివరీతంగా పాడుతుంటాయి. వాళ్లింట్లో వాళ్ళు వినాలని ఉబలాటపడేవాళ్ళు యితరులను బాధపెట్టడం బాగాలేదు. పైగా ఇంతచేసి ఆ పాటలు ఆ పెండ్లింటివాళ్ళు వినలేరు, వినరు, వినేంత తీరుబడి ఉండదు. అదీ తమాషా. వీథులలోవాళ్ళు వినాలని ఏర్పాటు చేస్తారు

అందరూ వినాల్సిన కార్యక్రమాల్లో ఈ లౌడ్ స్పీకర్ల ఆవశ్యకత ఎంతైనా ఉంది. గొప్ప నాయకులు, కవులు, పాటకచ్చేరీలు, సభలు, సన్మానాలు యిలాంటప్పుడు ప్రేక్షకులకు వినిపించేందుకని ఈ మైక్‌లు ఏర్పాటు చేయవలసిందే అప్పుడవి అవసరం కానీ మనింట్లో కార్యాలకని యిరుగుపొరుగు వారిని, రోగులను, విద్యార్థులను కష్టపెట్టడం భావ్యంకాదు.

★




పిల్లలందరికీ ఇష్టం
బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి బ్లామాంజి



బ్రౌన్ అండ్ పాల్సన్
సువాసనగల కార్న్‌ఫ్లవర్

బ్లామాంజి నోట్లో వేయగానే కరిగిపోయే అద్భుతమైన ఫలహారము. దీనిని పైన బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి సువాసనగల కార్న్‌ఫ్లవర్‌తో చేస్తే తప్పక శ్రేష్ఠమైన ఫలం సిద్ధం. ఎందుచేత నంటే బ్రౌన్ అండ్ పాల్సన్ వారి కార్న్‌ఫ్లవర్ మెత్తని సమాన చిక్కదనముగా మిశ్రమ మగును. ఏమాత్రమూ ముద్దగా కట్టదు. అది 6 రుచికరమైన సువాసనలలో లభించుచున్నది. వనిల్లా, రాస్‌బెర్రీ, కారమెల్, స్ట్రాబెర్రీ, పైనాపిల్



బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి ఇతర వివిధ రకములు, పేటెంట్ కార్న్‌ఫ్లవర్, రైస్లీ వెరైటీ కస్టర్డ్స్, కస్టర్డు పౌడరు.

బ్రౌన్ అండ్ పాల్సన్
ఫ్లేవర్డ్ కార్న్‌ఫ్లవర్

కార్న్ ప్రాడక్ట్స్ కొ., (ఇండియా) ప్రయివేట్ లి.,

ఉచితం: ఉపయోగకరమైన కొత్త వంటకాల పుస్తకము కోసం ఈ కూపన్, పూరించి పంపండి. ఇంగ్లీషు, హిందీ, తమిళం, తెలుగు గుజరాతీ, మలయాళం, మరాఠీ, ఉరుదు లేక బెంగాలీభాషలలో లభించును (అక్కర్లేని భాషను కొట్టివేయండి.)

తపాలా ఖర్చుల నిమిత్తం 25 న. పై. తపాలా బిళ్లలను నేను ఇందులో పంపితిని

శ్రీ.శ్రీమతి, కుమారి ....

....

చిరునామా ....

....

చిహ్న. నం._ APW—10

కార్న్ ప్రాడక్ట్స్ కొ. (ఇండియా)
ప్రైవేట్ లిమిటెడ్.
పోస్టుబాక్సు నం 994, బొంబాయి 1
ఈ బహుమతి భారతదేశంలో మాత్రమే

దక్షిణ ఇండియాలో ఏజెంట్లు: హ్యారి & కం

కవి సార్వభౌముడు

నోరి నరసింహ శాస్త్రి



జరిగిన కథ

సర్వజ్ఞ చక్రవర్తి బిరుదాంచితుడగు కొండ వీటి ప్రభువు పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథభట్టును కవిసార్వభౌమ బిరుదు పట్టముతో అలంకరించి, సర్వవిద్యానిలయ మైన శ్రీ విద్యానగరమునకు విద్యావిజయ ప్రస్థానము చేయవలసిందని అర్థిస్తాడు. కార్యసిద్ధికై దైవజ్ఞులుసూచించిన పౌష్టిక క్రియలు ఆదరించి శ్రీనాథుడు యాత్రకు సంసిద్ధుడవుతాడు. సింగన ప్రధానితోను, కామనభట్ట బాణునితోను ముచ్చటించి, డిండిముని శాస్త్ర పాటవము, లోపాలు తెలుసుకుంటాడు. వేమభూపాలుడు అయ నకు ఉచితమైన వీడ్కోలు ఇచ్చి పంపు తాడు. విద్యానగరం చేరినతరువాత శ్రీనాథుడు ముమ్మకవి ఆతిథ్యం స్వీక రిస్తాడు. డిండిమభట్టును జయించేందుకు శ్రీనాథుడు వచ్చాడన్నవార్త వ్యాపి స్తుంది. డిండిమునకు ఆవిషయం శిష్యుల ద్వారా తెలిసి, శ్రీనాథుని బెదరగొట్ట డానికి, లింగనసోమయాజి క్రతువు చూచేమిషతో యజ్ఞశాలకు వెడతాడు.

వసంతఋతువు ప్రవేశించినది.


ఫాల్గుణ పూర్ణిమనుండియే శ్రీ విద్యానగరములో వసంతోత్సవములకు పూర్వాంగ మారంభమైనది. ఆనాడు హోలికోత్సవము, మన్మథ పూజాదికములు జరుగును. హోలికోత్సవాదులు ముఖ్యముగా కొత్త రాహుతే జరుపుట యాచారము. వసంతఋతు వుతో దాక్షిణాత్యులుకూడ ఆ ఉత్సవములో కలసి నందున ఉత్సవకోలాహలముతో విద్యానగరము హోరుపెట్టుచున్నది.


సంవత్సరాదిపాడ్యమినాడు హోలికకు వందన మాచరించి చందనముతో కలిపి మామిడిపువ్వును ప్రాశనముచేయుట విధి విహితమగుటచే కొండవీడివిజదిలో కందరు నట్టు కావించిరి.

మావు లప్పటికే పూర్వమే కొన్ని పూసి కాయలు కాసి పండునుగూడ పండినవి. ఇప్పుడు మావు లన్నియు చిగిర్చి, పూచి, కాయలు కాసినవి. కోయి లల కూతలు గిరికందరములలో వనాంతరము లలో ప్రతిధ్వనించుచున్నవి

అన్ని దేవాయతనములలో ఉత్సవములు జరుగు చున్నవి. ఆ నగరమునకు అధిష్ఠానదైవతము శ్రీ విరూపాక్షేశ్వరస్వామి యగుటచే, ఆస్వామి వసంతో త్సవ మన్నిటికంటె అతిశయశోభతో జరుగు చున్నది. ఆ వసంతోత్సవమును పురస్కరించుకొని ఎందరెందరో భాషాకవులు కన్నడములో అరవ ములో మలయాళములో ఆరెమరాటీభాషలో,

42-వ పేజీ చూడండి


ఎత్తుకి రెండెత్తులు నటించే ఘట్టాలో
బాలయ్యా!
'ఎందుకూ, సగంబాలన్నట్టు నటిస్తావు
ఏలయ్యా?



జరిగిన కథ

హాంబర్గ్ నగర నివాసి ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్ ఒక పాత గ్రంథం సంపాదిస్తాడు దానిలో దొరికిన ఒకత్వక్పత్రంలో రహస్య సందేశం ఏదో ఉంటుంది కాని అది ఆయన తమ్ముడు కొడుకైన ఆక్సెల్ మాత్రం తెలుసుకుని భయవిహ్వలుడవుతాడు

అయినా తన పెదనాన్న దాని విషయమై పడుతున్న బాధ చూడలేక, రహస్యం చెప్పేస్తాడు 'ఆర్నె సాక్నుస్సెమ్' అనే ప్రాచీన ఐస్‌లాండిక్ శాస్త్రజ్ఞుడు, యాత్రికుడు భూగర్భంలోనికి వెళ్లినట్లు వ్రాసి ఉంటుంది ఐస్‌లాండ్‌లో ఆరిపోయిన ఒక అగ్నిపర్వతం ముఖద్వారంలో నుంచి వెళ్లినట్లు ఉంటుంది ఆక్సెల్ ఇది నిజంకాదని వాదించినా వినిపించుకోనకుండా ప్రొ॥ లిడెన్‌బ్రోక్ డెన్మార్క్ మీదుగా ఐస్‌లాండ్ ప్రయాణం కడ్తాడు

8

హాంబర్గ్ అంచున ఉన్న అల్టోనాలో కీల్ రైల్వే చివరి స్టేషన్ ఉన్నది ఈ స్టేషన్ చేరుకునేసరికి ఆరున్నర అయింది సామాను దింపించి రైలుబండి లోనికి చేర్పించాము ఏడు గంటలకు ఇంజన్ 'కూత' వినిపించింది రైలుబండి కదిలింది

ఆ కంపార్ట్‌మెంటులో మేమిద్దరమే ఉన్నాము కాని మాట్లాడుకోలేదు మా పెద్దనాన్న జేబులో ఉన్న కాగితాలు, చేతి సంచీ, వీటిని జాగ్రత్తగా తనిఖీ చేసుకున్నాడు ప్రయాణానికి కావలసిన 'పత్రా' లన్నీ సిద్ధంగా ఉన్నాయని గ్రహించాను

హాంబర్గ్‌లో డెన్మార్క్ ప్రతినిధి హెర్ (శ్రీ) క్రిస్టియాన్‌సన్ మా పెద్దనాన్న స్నేహితులలో ఒకరు ఈయన దగ్గర నుంచి ఒక ఉత్తరం తీసుకున్నాడు మా పెద్దనాన్న దీని సహాయంతో మళ్లీ కోపెన్‌హాగన్‌లో ఐస్‌లాండ్ గవర్నర్‌కి మమ్మల్ని పరిచయం చేసే లేఖలు సంపాదించుకోవచ్చు

దానిని చూడగానే వాటి కోసం ముంచుకొచ్చింది. మనస్సులోనే తిట్టుకున్నాను. చివరకు కిటికీలో నుంచి నేను ప్రయాణం చేసే ప్రదేశాన్ని చూడటం మొదలుపెట్టాను. ఎటు చూసినా పొలాలే కనుపించాయి నేల బాగా నుండి, రైలు పట్టాలు వేయటానికి సౌకర్యంగా ఉంటుందేమో కాని, కొంతసేపు చూసేసరికి విసుగు పుట్టింది

మూడు గంటలు ఇంతలో గడిచిపోయాయి సముద్ర తీరం దగ్గరే ఉన్న 'కీల్' పట్టణం చేరుకున్నాము.

మా సామాను కోపెన్‌హాగన్‌కి 'బుక్' చేశాము కనుక వాటి విషయం పట్టించుకునే అవసరం లేకపోయినా, ప్రొఫెసర్‌గారు వాటిమీద ఒక కన్ను ఉంచాడు స్టీమర్‌లోకి దించుతున్నంతసేపూ ఒక కంట కనిపెడ్తూనే ఉన్నాడు

అనవసరంగా త్వరిత మా పెదనాన్న అందువల్ల స్టీమర్ బయలుదేరటానికి ఒకరోజు ముందే వచ్చేశాము 'ఎల్లినోరా' స్టీమర్ రాత్రి వరకూ బయలుదేరదు ఈ తొమ్మిది గంటల వ్యవధిలో మా ప్రయాణీకులు, స్టీమర్ కంపెనీ వారిని, రైలు వారిని, వాటిని చూసి పూరుకునే ప్రతి త్యాగాన్నా తిట్టి తిట్టి వదిలిపెట్టాడు 'ఎల్లినోరా' కాప్టెన్‌తో ఈ సంగతి చర్చించాము క్షణాల

మిగతా పేజీ చూడండి



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

22-12-1961 శుక్రవారము మొదలు
28-12-1961 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఒకరి సహాయంమీద ఆధారపడకుండా మీ మార్గాన్ని మీరు చూచుకొంటారు. ఇంతకుముందు మిమ్ములను భయపెట్టేవారు తగ్గిగా ప్రక్కకు తప్పుకుంటారు. శుభం నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. వృత్తిలో స్వయం కృషితో అందరి ఆదరాభిమానాలను పొందగలరు. దూరపు ప్రయాణాలు చేయవలసి వస్తుంది. అనుకోకుండా మీ స్నేహితులతో దూరంకావలసి వస్తుంది. ఆత్యాశకుపోయి తెలియని పనులలో మీ డబ్బును వినియోగించవద్దు. మాటలు పెరగకుండా పని జరుపుకోదగిన సమయం. వ్యవహారవిషయాలలో అవకాశం జరుగదు. కాని, ధనవ్యయము, ఆలస్యము వీటివల్ల చిరుగుడు తోస్తుంది. అధికారులవల్ల ఎక్కడ పొరపాటు వస్తుందోనని భయం పట్టుకుంటుంది. 24, 25 తేదీలలో బంధుమిత్రుల రాక, స్థిరాస్తులవల్ల ఆదాయం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఒకసమయంలో ఉన్న ఉత్సాహం మరొక [illegible] ఉపకారం పొందినవారే మిమ్ములను బెదిరించటానికి ఆరంభిస్తారు. ఆదాయం మామూలుగానే ఉన్నా అకస్మాత్తుగా పెరిగే ఖర్చులు మిమ్ములను చికాకు పరుస్తవి. అప్పటికీ నిబ్బరంతో బయటపడకుండా జరుపుకుంటారు. కుటుంబంలో తలపెట్టిన పనులు పరస్పరసహకారంతో జరుగుతవి. సాధ్యమైనంతవరకు నిరాడంబరంతో ఉండటం అవసరం. వృత్తిలో శ్రమ అధికంగా ఉంటుంది. కాని, మీరు అనుకొనే కష్టనష్టాలు ఏమీ ఉండవు. భూములు, వస్తువులు మొదలయినవి కొందామనే ఆలోచనలు ప్రస్తుతానికి సాగవు. మీరు కోరకుండా సలహా చెప్పటానికి తయారయ్యే మనుష్యులతో జాగ్రత్తగా ఉండండి. 22, 23 లలో శుభకార్యాలు, ఆదాయ వృద్ధి.

* * *

గ్రహస్థితి

కర్కాటకంలో రాహువు, వృశ్చిక ధనుస్సులలో శుక్రుడు, ధనుస్సులో సూర్య అంగారక బుధులు, మకరంలో గురు శని కేతువులు, మిథున, కటక, సింహాలలో చంద్రుడు.

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

స్వవిషయం ఎలా ఉన్నా పదిమందికీ సంబంధించినకార్యక్రమాలలో ప్రవేశించక తప్పదు. ఒకప్రక్క మిమ్ములను ఆక్షేపించేవారు ఉన్నా ధైర్యంతో మీ మాటను, ఆధిపత్యాన్ని నిలుపుకొంటారు. మాటలలో గాని, క్రియలలో గాని దురుసుతనం కనబడకుండా చూచుకోనండి. వ్యాపారాలలో మీకు అనుభవంలేని పనులలో ప్రవేశించవలసివస్తుంది. దూరమందున్న మిత్రులు మీరు అనుకున్నంత విశేషంగా సహాయం చేయలేకపోతారు. ఏమి చేసినా దైవానుగ్రహంవల్ల చివరకు కొనసాగించగలుగుతారు. విద్యా, వినోద విషయాలలో అనుకూలమైన సమయంకాదు. వెంటవెంటనే పనుల బాధ్యతలు పెరుగుతూ ఉంటవి. ఆదాయ వ్యయాలలో మీరు అనుకొనే మార్పులు ఏమాత్రము కనిపించవు. 26, 27 లలో ధనలాభం, మంచి స్నేహం.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)

మీరు తలచినదల్లా అవుతుందనే ఆశ కాని, కాలేదనే విచారం కాని పెట్టుకోదగిన సమయం కాదు. మీకు సహాయం చేయవలసినవారు అశక్తులు కావటంవల్ల మీ మార్గాన్ని మార్చుకోవలసి వస్తుంది. ఏది ఎలా ఉన్నా మీ గౌరవ ప్రతిష్ఠలు యథాప్రకారంగా ఉంటవి. కలహ ప్రసంగాలు వచ్చే సూచన లున్నవి. దూరంగా ఉండటానికి ప్రయత్నం చేయండి. కుటుంబంలో అలజడి, అశాంతి కలిగేటట్లు ముందు కనిపించినా దైవికంగా పరిస్థితులు చల్లబడుతవి. ఒకరి తరఫున మాట్లాడటంవల్ల మరొకరితో విరోధం వస్తుంది. అధికారులు ఈ సమయంలో కొంతవరకు అనుకూలంగా ఉంటారు. మనుష్యుల స్వభావాన్ని తెలుసుకోకుండా స్నేహం చేయటంవల్ల అపవాదులు పడవలసి వస్తుంది. శ్రమ కాలం.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

సంఘంలో మీ పేరు పైకి రావాలంటే ముందుగా కొంత ధనవ్యయం, శరీర శ్రమ తప్పవు. అయితే ప్రయోజనం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో అభివృద్ధిని సాధించటానికి కావలసిన మార్గాలను తెలుసుకో గలుగుతారు. ముందు సంగతి సందర్భాలు తెలుసుకోకుండా చేసిన పనులు ఈ సమయంలో మిమ్ములను చికాకు పెట్టి ఏదో విధంగా [illegible] ఒకప్రక్క

ఆదాయం పెరుగుతూ ఉంటుంది. కాని, అందుకు తగినట్లు మీవద్ద నుంచి సహాయం కోరేవారు ఎక్కువ అవుతారు. బాహ్య విషయాలలో పేరు ప్రసిద్ధులు బాగుంటవి. కుటుంబంలో ప్రత్యేకంగా ఇబ్బందులు కనిపించవు కాని, మనస్సులో తీరని ఆందోళన, కొరత తోస్తూ ఉంటవి. సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణంవల్ల అన్నివిధాలా క్షేమలాభాలు పొందగలుగుతారు. శత్రుబాధ తొలగుతుంది.

* * * *

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

కాలం చాలా ప్రశాంతంగా ఉంటుంది మీరు ఏపనిలో ప్రవేశించినా పదిమందినీ మెప్పించి మీ ప్రయోజనాన్ని సాధించుకుంటారు పెద్దగా ప్రయత్నాలు,పట్టుదలలు లేకుండా చాలా సుఖంగా ధన గౌరవాలు సంపాదించుకొంటారు మిమ్మలను గురించి అసమర్థులు అని అనుకొనేవారు ఉండవచ్చు. అయినా మీకు ఏవిధంగానూ లోపం రాదు నూతన వ్యాపారవ్యవహారాలలో పెట్టుబడి పెట్టి గొప్పగా పైకి రాతగిన అవకాశా లున్నవి దైవ కార్యాలు అనుకున్న ప్రకారం నెరవేరుతవి నీచులతో తెలియకుండా చేరటంవల్ల మీ అంతస్తుకు, ఆలోచనలకు అంతరాయం రాకుండా చూచుకొనవలసిన బాధ్యత పెరుగుతుంది. ఆస్తి వృద్ధి ప్రయత్నాలు లాభిస్తవి శుభ కార్యాలలో ఆటంకాలు వస్తవి 22, 23 లలో సంఘ కార్యాలు, అధికారుల ఆదరణ.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

మీ మానసికంగా వచ్చినటువంటి మార్పువల్ల ప్రతి విషయంలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించుకోగలుగుతారు. పదిమందికీ మీ మాటలో ఉన్న నిజమ్ము, న్యాయము బాగా అర్థం అవుతుంది. మీ వృత్తి ఉద్యోగాలలో స్వశక్తివల్ల పైకి రాగలుగుతారు. మిమ్మలను స్తోత్రం చేస్తూ చుట్టుకొనే మనుష్యులలో ఈర్ష్యాభావం కలవారు కొందరు ఉన్నారనే విషయం మరచిపోవద్దు. మీరు ముఖ్యంగా సాధించవలయు ననుకొన్న పనులలో చాలావరకు పూర్తిచేయ గలుగుతారు. కొన్ని సమయాలలో సుఖాన్ని మరచి శ్రమ చేయవలసి వస్తుంది. ధన సంబంధమైన లావాదేవీలలో రానున్న చిక్కులను ముందుగా తెలుసుకొని సకాలంలో పరిష్కరించుకోగలుగుతారు. 24, 25 లలో మనశ్శాంతి, సభా గౌరవం.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

గౌరవప్రదమైన కాలం అనవసర విషయాలలో జోక్యం పెట్టుకోకుండా మీ ధర్మాన్ని సక్రమంగా నెరవేర్చుకోగలుగుతారు. ఇంతకుముందు తీరని సమస్యలు సులభంగా తీరిపోతవి. బంధువుల వల్ల అనుకూలత లభిస్తుంది. శుభకార్య బాధ్యతలు సకాలంలో నెరవేర్చుకుంటారు. మీ ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. మనస్సులో అనవసరమైన సందేహాలకు అవకాశం లేకుండా చేసుకొనటం అవసరం. అందువల్ల ధన గౌరవాలతో పాటు సుఖం కూడా పొందగలుగుతారు. నౌకరులతో వచ్చే తగాదాలను పెంచుకొనటం మంచిది కాదు ప్రయాణాలు చేయవలసి రావచ్చు. వారాంతంలో ఆశ్చర్యకరమైన వార్తలు తెలుస్తవి. 23, 24 తేదులలో వ్యవహార జయం, బంధుదర్శనం.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఎన్ని ఆలోచనలు చేసినా కార్యరంగంలో ప్రవేశించటానికి అవకాశం దొరకక పోవచ్చు. స్నేహితులు ప్రోత్సాహకరమైన మాటలు చెబుతారే కాని, మీ కష్టసుఖాలను గురించి ఆలోచించేవారు తక్కువ. మీ డబ్బు యితరుల చేతిలో నిలిచిపోవటంవల్ల మాటలతో గౌరవాన్ని కాపాడుకోవలసి వస్తుంది వృత్తి ఉద్యోగాలలో అట్టహాసాన్ని తగ్గించుకొని, తోటివారి మనస్సుకు అసంతృప్తి కలగకుండా చూచుకొనటం అవసరం ప్రయాణాలు సుఖప్రదంగా కనుపించవు. కోర్టు కచేరీలలో గౌరవం మాత్రం దక్కుతుంది. అగ్ని, ఆయుధాలు మొదలయిన వాటితో జాగ్రత్తగా ఉండండి. 24, 25 లలో శుభవార్తలు, సాధారణ ఫలితం, శ్రమ.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

"క్షణం తీరికలేదు, పైసా ఆదాయం లేదు" అనే సామెత అనుభవంలోకి వస్తుంది. బాధ్యత పెట్టుకోకుండా ప్రశాంతంగా ఉందా మనుకుంటారు కాని, వీలుకాదు. కుటుంబంలో సుఖంగానే ఉంటుంది. మీ ఆరోగ్యం కూడా సంతృప్తికరంగా ఉంటుంది. ధన విషయంలో మీరు ఎదురు చూస్తున్న సహాయం లభిస్తుంది. కాని, ఆలస్యం అవుతుంది. రాజకీయాలలో ప్రోత్సాహకరమైన సమయం కాదు ముందు పోటీని ఎదుర్కొంటూ చివరకు ఏదోవిధంగా ఫలితం సాధించగలుగుతారు. క్రొత్త మార్గాలలో ఆదాయం లభిస్తుంది. ఈ సమయంలో శుభ పుణ్యకార్యాలు సులభంగా జరిగే

ఈ వారము ధరలు

ఈవారంలో బంగారు ధర మొదట లేచిలో ఉండి క్రమంగా తగ్గుతుంది. వెండి ధర లేచే లోనే ఉంటుంది. పసుపు ధర పెరిగేటట్లు కనుపిస్తుంది. కాని పెరగదు. ధాన్యం ధర బాగా పెరుగుతుంది.కందులకు మంచి వస్తుంది. కర్పూరంధర విశేషంగా పెరుగుతుంది ప్రత్తి ధర మంచి అవుతుంది. మాషుల ధరలో మంచి వస్తుంది. మాపులహాని మామూలుగానే ఉంటుంది.

అవకాశాలు తక్కువ. 27, 28 లలో ప్రయత్న కార్యసిద్ధి, గౌరవం, ధనలాభం.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

దైవానుగ్రహం బాగున్నది. మీరు ఆలోచించిన ప్రతి పని సుఖంగా జరుగుతుంది. వ్యాపార విషయాలలో ఒడుదుడుకులు లేకుండా మీ ప్రయత్నాలు ప్రశాంతంగా సాగిపోతవి సొమ్మును గూర్చి ఆందోళన పడవలసిన అవసరం ఉండదు. ఇతరుల వ్యవహారాలలో మధ్యవర్తిత్వం వంటి బాధ్యతలు నిర్వర్తించగలుగుతారు. పిల్లల ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్తగా ఉండటం అవసరం. స్నేహితులలో కొందరు మిమ్మలను అనుమానిస్తారు. కాని, యథార్థం తెలుసుకొని పశ్చాత్తాప పడతారు. సాహిత్య కృషి మొదలయిన వాటికి అనుకూలమైన కాలం. సంతాన స్నేహం లభిస్తుంది.

* * *


మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

మీ తొందర స్వభావంవల్ల దొరికిన అవకాశాన్ని వదులుకోవలసి వస్తుంది. మంచి మనుష్యుల స్నేహం లభిస్తుంది. కీర్తి, ధనలాభం, ముఖ్యంగా కొత్త అనుభవాలు పొందగలుగుతారు. విద్యా వినోదరంగాలలో మీరు ప్రకాశించ గలుగుతారు అనుభవంలేనివారి ఆలోచనలు మిమ్మలను మార్గం తప్పేటట్లు చేయగల అవకాశా లున్నవి. దైవానుగ్రహంవల్ల మీ పేరుకు భంగం రాకుండా కాపాడుకో గలుగుతారు. క్రొత్తగా వ్యవహార కార్యాలలో ప్రవేశించటం మంచిదికాదు. వారం రెండవ భాగంలో మీకు రావలసిన ధనం వస్తుంది. నిష్కపటంగా మీకు సహాయం చేసే మిత్రులు లభిస్తారు. 22, 23 లలో సంతోషవార్తలు, సభా గౌరవం. ★



క్లియర్‌టోన్ ల్యాంపులు, ఫ్లోరెసెంట్ ట్యూబులు మరియు ఫిక్చర్లు
క్లియర్‌టోన్...
క్లియర్‌టోన్
టేబిలు మరియు సీలింగ్ పంకాలు
జెనరల్ రేడియో & అప్లయన్సెస్ లిమిటెడ్




మీ కుటుంబమునకు...
ప్రత్యేకమైన బహూమానము
ఒక
నేషనల్ ఎక్కో
రేడియో
పండుగ రోజులు దగ్గరపడుతున్నాయి. మీ కుటుంబమునకు ఒక ప్రత్యేకమైన కానుక ఇవ్వదలుచుకొంటే. ఒక నేషనల్-ఎక్కో రేడియోను వారికి కొనిపెట్టండి!
ధర రు. 330.75
ధర రు. 125.00
ధర రు. 574.25
ధర రు. 351.00
JWT-GRA 2866
నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి...అవి 'మాన్‌సూనైజ్' చేయబడినవి
జెనరల్ రేడియో & అప్లయన్సెస్ లిమిటెడ్

డాక్టర్ రాజు

బొమ్మల కథ

దేవిక 4





ఎన్నెల్ల రేత్రిళ్లు

పినమాకం నువ్వెల్లి పీకంలో కూకుంటె
ఎన్నెల్ల రేత్రిళ్లు ఎల్లార గడిపేది!
సేలోన సెరుకల్లె నాలోన తియ్యని
ఆలోసెనలు మొలిసి బలిసి నిలుసున్నాయి!
సెరువులో కలువల్లా సిత్తాన మరులేయా
కోటిరేకులిప్పి ఆటాడుతున్నాయి!

* * *

కొండల్లో వాగుల్లా గుండెల్లో కోరికలు
వరవుంలకు గండ్లేసి ఉరకలేస్తున్నాయి!
మిణుగురుపురుగుల్లా మనసులేవోనాలా
మాటిమాటికి మెరిసి లోటునూపుతున్నాయి!

* * *

ఏగు సుక్కలాగ ఏవో తియ్యని కలలు
తెల్లారిగట్లొచ్చి ఎల్లిపోతున్నాయి!
ఎత్తిలేనిరాయి! ఈ ఎన్నెలరేయి!
ఊతగానీ సెయ్యి ఓమావా! ఒచ్చి ఎయ్యి!!

యం. రమణమూర్తి (విద్యానగర్)

* * *

శ్రీమతి సలహా

"ఎప్పుడు యింతే" చదువుట
తప్ప మరేం పనిలేదా? పిల్లల పార్కుల్
త్రిప్పగరాదో? కాదేన్
పప్పన్నము చేయరాదో? భర్తోత్తముడా!

కామమోహన్ (కడప)

* * *

సర్వాంతర్యామి

ఇందుగలదందు లేదని
సందేహములేదు నల్లి సర్వోపగతం
బెందెందు వెదకిజూచిన
నందం గలదు మానవాగ్రణి వింటే.

నల్లకల్లోలాయిత
యుల్లంబుల చల్లదనము కల్లగమారున్
భల్లున తెల్లగ వాలును
కొల్లలుగా నల్లులల్ల గుట్టగ నధిపా!

నల్లి లేని యట్టి యిల్లొక్కటియు లేదు
నల్లి బారిబడని నరుడు లేడు
నల్లద్రావుడు గూడ నల్లికి సరిరాదు
నల్లి పిల్లకైన నరుడు జంకు.

నడిపాలసంద్రాన, నాగశయ్యను గూడ
నల్లులు తీరు నంచు నమను
సౌఖశాయనిఖలుంగ, చయ్యనసను దెంత్రు
నారదాదిమునులు కౌరి కడను.

పుస్తకాలలోన బస్తసంచులలోన
పెట్టెలందు బల్లపీటలందు
రైలులందు చిత్రశాలలందును, పూట
కూటియిండ్ల నివ్వి కోట్లు కోట్లు

శ్రీనివాసాచార్య (జమ్మికుంట)

* * *

వినర సోమ!

పుస్తకమ్ము తెరువ పుట్టుకొచ్చునునిద్ర
బుక్కు మూసివేయ దొక్క చిరుగు
నాన్న ఉరితెత్తె నాకెంత హాయిరా
విశ్వదాభిరామ-వినర సోమ!

* * *

బడికి పోవుదమన్న బద్ధకము వేస్తోంది
యింటికాడ నుండ వీపు చిరుగు
బడులు లేకున్న బల్ బాగుండునురా
విశ్వదాభిరామ వినరసోమ!

* * *

సినిమాకు పోవగ రూకయిమ్మంటేను
బన్సు మంచు అమ్మ కర్రదీసె
సినిమాల కెంతటి రేష నొచ్చిందిరా
విశ్వదాభిరామ వినరసోమ!

అట్లూరి నాగేశ్వరరావు (పెదతుమ్మిడి)

* * *

వెనుకటి చింతలు

కం ధనమున్న రోజు లెల్లను
మననయి నీ ముక్కుపుడక మార్పింపమనవ్
వినినాడు కాడు నీ పతి
వెనుకటి నీ చింతలెన్నొ వెంకాయమ్మా.

కం పనసన్న నీకు ప్రియమని
తన మనసున ఎరిగియుండి, తప్పనిసరిగా
తినుమంచు చీర తెచ్చెను
వెనుకటి నీ చింతలెన్నొ వెంకాయమ్మా.

కం వెనరేమి చూపకున్నను
వినతిగ నీ చెప్పునట్టి వేడుక మాటల్
తన చెవిని పెట్ట నేరడు
వెనుకటి నీ చింతలెన్నొ వెంకాయమ్మా

కం వినడుగదా నీ మాటలు
తినడు గదా నీవు చేయు తినుబండారాల్
కనడు కదా నీ సౌఖ్యము
వెనుకటి నీ చింతలెన్నొ వెంకాయమ్మా.

కం మునుపొక్కసారి నాటక
మని సింగారించి నీవు మనసుగ బోవన్
పనిదీర జుట్టు పట్టుక
వెనుకకు లాక్కొచ్చె మగడు వెంకాయమ్మా.

'భావం' (న్యూఢిల్లీ)





వలయం

గౌరి హాస్పిటల్లో [illegible] ట్టగానే గడియారం మూడు కొట్టింది. పరుగు పరుగున రావటం మూలాన ఆమె ముఖంనిండా అక్కడక్కడ ముత్యాల్లా చిటి బిందువులు నిలిచి, శీతంకాలంనాటి ఉదయం నిద్రలేచి అప్పుడిప్పుడే విచ్చుకుంటున్న గులాబీని జ్ఞప్తికి తెచ్చాయి. అనుమానం కలిగి తన చేతి గడియారం చూసుకుంది. రెండు మూడు నిముషాల వ్యత్యాసంతో రెండూ ఒకే కాలాన్ని సూచించాయి. త్వర త్వరగా మందు సీసాలున్న బల్లదగ్గరకు వచ్చింది.

"ఆలస్యమైందికదూ ? . . . .ఇందాకా సర్జన్ వచ్చి పోయాడు నీ గురించి అడిగాడు కూడా" అని పలకరించింది దేవకి.

"అవును. ఏదో డెలివరీ కేసుంటే వెళ్ళక తప్పిందికాదు" అంటూ తన పనిలో మునిగి పోయింది.

సర్జన్ వచ్చిపోతే తనకేం ? వయ్యారంగా నిలబడి ఒక్క చిరునవ్వు నవ్వితే అతను మంచులా కరగిపోయి తనెందుకు వచ్చింది మర్చిపోతాడు. ఈ రహస్యం ఇద్దరికీ తెలిసినా, ఒకరికి తెలియనట్లు మరొకరు నటించాలి. ఆ హాల్లో ఇవతలవైపు మంచాలు రెండు వరుసలుగా అమర్చబడివున్నాయి. రక రకాల మనస్తత్వాలలో చిక్కు సమస్యలు సృష్టిస్తున్న ఆ రోగులందరికీ అనుగుణంగా నడచుకోగలిగిన తను ఈ ఒక్క సర్జన్‌ను సమ్మోహించలేదా ఏమిటి ?

పక్కనేవున్న మంచంమీద రోగి మూలుగు విన బడగానే గౌరి ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చూసింది.

"దేవకీ ! . . . .ఇది కొత్త పేషంటా ?" అనడిగింది.


'అవును — పాత పేషంటుకు బాగా నయమైందిగా ! అందుకని ఒంటిగంటకు డిస్చార్జి చేశారు. రెండు గంటలకు కొత్త పేషంటు రెడీ" అని నవ్వింది దేవకి.

గౌరి ఆమెకేసి చూసింది. తలకు, చేతులకు కట్లు — నుదుటిమీద, గెడ్డంకింద చిన్న చిన్న బాండేజీలు — ఆమెకు దరిదాపు అరవై ఏళ్ళుంటాయి. మధ్య మధ్య సన్నగా మూలుగుతోంది. గౌరి దేవకికేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"లారీ ప్రమాదం — వెంట్రుకవాసిలో తప్పింది. ప్రాణాలో పూర్తి కావలసిన కథ ఈ ఘట్టంలో ఆగింది. . . .' అంది దేవకి.

గౌరి ఆ ముసలావిడకేసి మరోమారు పరీక్షగా చూసింది. వీరు విశ్రాంతిగా కదలకుండావుంటే

బొంబాయి ఆంధ్ర మహాసభవారు జరిపిన పోటీలో రెండవ బహుమతి పొందిన కథ.



అట్టడుగునవున్న వస్తువులు స్పష్టంగా కని పిస్తాయి. కాని చిన్న చిన్న కెరటాలు కదలితే ఏది వస్తువుందని తెలిసినా 'ఫలానా' అని నిర్ణ యించలేము. అలాగే గౌరి మెదడులో అలలు కది లాయి కాని, ఆ ముసలావిడను గుర్తు పట్టలేక పోయింది.

"ఈమెకు బంధువు లెవరూ లేరా ?.... ఎవరు తీసుకొచ్చా రిక్కడకు ?'

దేవకి ఆశ్చర్యంతో చూసి కనురెప్పలు రెండు సార్లు పైకి, కిందకు కదిపింది.

"అలా గుచ్చి గుచ్చి అడుగుతున్నావు... ఆమె నీకు తెలుసా ?'

"ఎక్కడో చూసిన జ్ఞాపకం — అది భ్రమ కావచ్చు—'

'ఎవరో దారినపోయే బాటసారి మహారాజు కనిక రించి కారులో తీసుకొచ్చాడు. ఆ లారీ డ్రైవర్ని పోలీసులు విందుకు తీసుకుపోయారు—"

ఆ తరువాత అయిదునిమిషాలు నిశ్శబ్దం—

వెను వెంటనే అడుగుల చప్పుడు—

"మా అమ్మ ఏ బెడ్‌లోవుంది ?" అనడుగుతూ వచ్చా డా యువకుడు.

"గట్టిగా అరవకండి—అక్కడే !' అంది దేవకి.

అతను మంచం దగ్గర కూర్చుని ఆ వృద్ధు రాల్ని ఆపాదమస్తకం ఆప్యాయంగా చూశాడు. చేతులు అందుకుని ప్రేమతో చెంపలకు చేర్చు కున్నాడు. అతని కళ్ళల్లో నీరు నిలిచింది.

గౌరి శిలాప్రతిమలా నిలబడిపోయింది. మన సులో చెలరేగుతున్న అలలు అలసి నిద్రపోయాయి. నీటికి నిశ్చలత చేకూరింది....

"అవును....సందేహంలేదు....అతను రఘు!' అని నిర్ణయించుకుంది గౌరి.

"సిస్టర్ ! ప్రమాదమేమీలేదుకదా !..... నేను ఇంటికి వచ్చేసరికి ఈ సంగతి తెలిసింది. పరుగు పరుగున వచ్చాను...."

గౌరి భయంతో పారిపోతున్న చిరునవ్వును పెది మలమీదికి తెచ్చుకుంది.

"మరేం భయంలేదు....వృథాగా కంగారు పడకండి—ఇందాకా డాక్టరువచ్చి పూర్తిగా పరీక్షించి చూశారు. అదృష్టంకొలది బతికింది.

"అసలీ ప్రమాదం ఎలా జరిగింది ? అమ్మ బయటకు రానేరాదే!"

దేవకి తెలిసినంతవరకు వివరించింది.

'ఆ లారీ డ్రైవర్ని తప్పకుండా శిక్షిస్తారు. మీరు బాధ పడకండి—'

ఆక్షణంలో మనిషికి కావలసింది ఆత్మబలం. ఎదురుగా తల్లి గాయాలతో స్పృహ లేకుండా పడి వుంది. ఆమె కాస్తైతే లేకుండాపోతే బాగుండు ననుకుంటాడు కొడుకు. అంతటితో ఆగడు. ఈ ప్రమాదానికి కారకుడైన వ్యక్తిమీద పగ తీర్చుకో వాలన్న కోరిక అదుపు లేకుండా కలుగుతుంది. అతన్ని హతమార్చాలనుకుంటాడు....కాని నిజా నికి ఏమీ చేయలేడు. ఈ మనస్తత్వపు మార్పుల్ని అనుభవంమీద అర్థం చేసుకున్న దేవకి లారీ డ్రైవర్ని తప్పకుండా శిక్షిస్తారని ధైర్యం చెప్పింది.

రఘు నవ్వాడు.

"పాపం ! అతన్ని ఏం బాధమంది ? అతను మాత్రం అమ్మను చంపాలనుకున్నాడా ? పొరపాటు జరిగిపోయింది. దన్నడిగితే అతన్ని దండించి లాభం లేదు. అంతకంటె క్షమించి వదిలేస్తే అతనిలో మానవత్వం నశించు కాకుండా నిలిచివుంటుంది."

నర్సు లిద్దరూ అతని మాటలు ఆశ్చర్యంతో విన్నారు.

మరో అరగంట అక్కడే కూర్చుని తల్లి కళ్ళు తెరుస్తుందేమోనని చూశాడు. ఫలితం లేకపోయింది.

"సిస్టర్ !....నేను ఓ పనిమీద త్వరగా వెళ్ళాలి. మీరు దయవుంచి అమ్మను బాగా కని పెట్టుకునుండండి.... నాగురించి అడిగితే వచ్చిపోయానని, తిరిగి ఏడుగంటలకు వస్తానని చెప్పండి....అన్నట్టు నా పేరు రఘు— ఆ పేరు తోనే అమ్మ కలవరిస్తోంది—'

అతను గబగబ నడచి వెళ్ళిపోతుంటే రాతి బొమ్మలా చూస్తూ నిలబడింది రాధ.

దేవకి భుజంమీద చేయివేసి కదలించింది.

"పెళ్ళికాలేదనుకుంటాను... [illegible] ?... భగ్నప్రేమికుడు కావచ్చు—' అని విరగబడి నవ్వింది.

"ఆ అనుమానం నీకెలా కలిగింది ?' అనడిగింది గౌరి.

నీ ముఖంలో మార్పులు చూశాక—'

గౌరి ఆమె నిర్ణయాన్ని ఖండించలేదు.

అహంకారం—అసహ్యత—పశ్చాత్తాపం అన్నీ కొండాలుపట్టుకుని గెలుపు మాదే !" నని అట్ట హాసంగా నవ్వాయి.

"అతని పేరు రఘుట ! . . . .ఆ సంగతి నాకు తెలియదు గామోలు !" అని పళ్ళు పటపట కొరికింది.

* * *

ఆరేళ్ళ క్రితం గౌరి శ్రీమంతుడి ముద్దుకూతురు. చీకూ, చింతా లేకుండా, భావి జీవితం గురించి వ్యూహాగానాలు చేస్తూ, ఇంటరు చదువుతోంది.

విజయపురి కొండలు అక్కడికి మూడు మైళ్ళ దూరంలో వున్నాయి. చిన్న చిన్న శిఖరాలగుండా పోయే సరళరేఖ గీస్తే, భూమికి సమాంతరంగా వుంటుంది కొన్నివందలసంవత్సరాలక్రితం ఆ కొండల్లో గుహలు దొలిచి బౌద్ధ భిక్షవులు నివసించేవారు ఆ చుట్టుపక్కల పల్లెజాతిప్రజలు నివాసం ఏర్పరచుకున్నారు. కొండమీద కురిసే వాన క్రమంగా కిందకుప్రాకి, నిర్మలాకాశాన్ని ఆవరించుకునే మబ్బుల్లా, నేలను ఆక్రమించి పిల్ల కాలవలా పారుతోంది—అరుగురు విద్యార్థినులు కలిసి ఈ దృశ్యాన్ని చూసేందుకు "పిక్‌నిక్" బయలు దేరారు.

కొండ దిగువున కారు నిలిపి పైకి వెళ్ళారు. కొన్నివందల సంవత్సరాలనాటి సంస్కృతి — ఆచార వ్యవహారాలు—సర్వారిష్టాలకు మూలకారణం "కోరిక"న్న బౌద్ధమత సూత్రం—రాతి తలగడలు అన్నీ చూస్తూ, చాలా దూరం వెళ్ళారు అందులో ఐదుగురికి చరిత్రకు సంబంధించిన ఏ విషయమైనా అమితాసక్తి—ఒక్క గౌరి మాత్రం 'ఈ చీకటి గుహల్లో చూసేందు కేముంది ?" అని విసుక్కుంది కొంతదూరం వెళ్ళాక కాళ్ళు సత్యాగ్రహంచేసి కదలటం మానుకున్నాయి

"ఇంక ఒక్కడుగు కూడా నేను ముందుకు వేయలేను. మీరు వెళ్ళిరండి — ఇక్కడ మీ కోసం వెయిట్ చేస్తాను' అని ఓ బండరాతిమీద చతికిలబడింది.

"పిల్లేదు—ఏ పెద్దపులో ఎత్తుకుపోతుంది ? అప్పుడు మీవాళ్ళకి మేం ఏంజవాబు చెప్పగలం ?" అన్నారు ఐదుగురూ ఒక్కసారిగా

"నేను గౌరిని. అంటే పార్వతి నన్నమాట పులి నన్నేంచేయదు నా వాహనం ! ' పిడుగు పడ్డా అక్కణ్ణుంచి కదలనన్నభావం ఆమె కంఠంలో ధ్వనించింది. మిత్రబృందం కొంతసేపు వాదించి విసుక్కుని పైకి కదలిపోయింది. అరగంట గడచింది — కాళ్ళను తడుపుతూ పోతున్న ఓ సన్నటి సెలయేరుదల్ని చూస్తూ కూర్చుంది — కాని ఎంత కాలం అలా . . . .?

గంట గడచింది.

మిత్రబృందం తిరిగి రాలేదు.

గౌరి కంగారుపడింది. నిజంగా, ఏ గుహలోనో నక్కివున్న క్రూరజంతువు మీదపడి అందర్నీ తినేసిందేమో ! ఆ తలపు రాగానే ఆమె గడగడలాడింది. ఏం చేయటానికి పాలుపోలేదు. నెమ్మదిగా

వెలుగు

పైకి నడవ సాగింది ఇరవై నిమిషాలు తిరిగాక బయలుదేరినచోటికే వచ్చింది

ఇరువైపులా అగాధమైన లోయలు ఎడతెరిపి లేకుండా ప్రవహిస్తున్న జలప్రవాహపు ధ్వని తప్పించి అంతా నిశ్శబ్దంగావుంది భయంతో గుండెలు గబగబ కొట్టుకున్నాయి చరచర కిందకు దిగి రాసాగింది పదినిమిషాలు గడిచాక బయలుదేరిన చోటికే వచ్చేసరికి సహనం నశించింది

ఆనాటికి ఇల్లుచేరుకోటం కల్లనిపించింది.

ఆ సమయంలో రఘు కనిపించాడు

అతను బి ఏ సీనియర్ చదువుతున్నాడు.

కాలేజీలో గౌరిని ఎరుగనివారుండరు.

గుండ్రటి ముఖం, చిలిపిగా, అమాయకంగా నవ్వే కళ్ళు వెన్నెల అద్దుకున్న చెంపలు — సౌందర్యాన్ని రాసుకుని మెరసిపోతున్న శరీరం — గట్టిగా

ఒకకుర్రాడు తనస్నేహితుని ఇంటికి పోయినప్పుడల్లా అతని నాయనమ్మ భగవద్గీతను విడవకుండా చదువడం చూసి స్నేహితునితో:—

ఒరే! రోజూ మీ నాయనమ్మ ఎందుకురా, అలా పుస్తకం విడువకుండా చదువుతుంది.

రెండవ:— మా నాయనమ్మ తన "ఫైనల్" పరీక్షలకు ప్రిపేర్ అవుతోందిరా.

పి. రామజోగారావు (బొబ్బిలి)

గాలి వీస్తే కందిపోయే మృదుహస్తాలు. చెవుల్ని కప్పేసి చెంపలవరకూ వ్యాపించిన జుత్తు — నిండుగా అమరిన అర్ధచంద్రాకారపు బొట్టు — ఓ చిన్న కెరటంలా నడక — బ్రహ్మ ఆమెను సృష్టించేందుకు ఎంతకాలం వ్యయం చేశాడో మరి!

పరిమళంబరువుతో వికసించిన గులాబి.

స్వచ్ఛతతో నవ్వుతున్న మల్లెపువ్వు.

అలాంటి గౌరిని ఎరగనివారుండరు.

"మరిలా ఎక్కడకు వచ్చారు ?' అనడిగాడు రఘు.

గౌరి ఏడుపు దిగమ్రింగి జరిగినదంతా వివరించింది

రఘు ఫక్కున నవ్వాడు.

'మీరేం భయంలేదు. ఈ కొండలు నేను లక్షసార్లు ఎక్కి దిగాను. నావెంట రండి. మీ స్నేహితురాళ్ళు కింద గుమిగూడి మీగురించేగామోలు కంగారు పడుతున్నారు. భలేవారే!' అంటూ ముందు నడిచాడు. గౌరి అతన్ని వెంబడించింది. నడవగా, నడవగా ఆమె తనతప్పిదం తెలుసుకుంది కుడివేపు తిరిగేందుకు మారుగా ఎడమవేపు తిరిగినందున భూమి గుండ్రంగా ఉందని, ఎవరూ అడక్కుండానే, రుజువు చేయవలసి వచ్చింది. ఒక చోట, కాలుమోపిన కటికరాయి ఆమెను నేల పడద్రోయటానికి ప్రయత్నిస్తే, రఘు చేయి అందించి ఆదుకున్నాడు

బృందాన్ని కలుసుకుని గండం గడిచి బయటపడ్డందుకు అందర్నీ కావలించుకుంది. రఘుకేసి కృతజ్ఞత నిండిన కళ్ళతో చూసి కారులో కదలింది.

అందంగా ఉన్నంత మాత్రాన అబ్బాయికి, అమ్మాయికి మధ్య అనురాగం జనించదు పరస్పరాకర్షణ పుట్టదు అందు కేదైనా చిన్న సంఘటన నాందీ ప్రస్తావన చేస్తుంది దాని ఔచిత్యం—పర్యవసానంలో దానికున్నబాధ్యత ఇవేమీ ప్రశ్నించదగ్గవి కావు అదొక మహా ప్రవాహం లాంటిది. మానవుడు మేధస్సుతో నిర్మించిన ఆనకట్టలు — ప్రకృతి అడ్డంగా నిలిపిన వృక్షాల వరుసలు, రాతిగుట్టలు— మిట్టపల్లాలు— ఏవీ దాని కడ్డు రాలేవు. పృథివి చేతులు బారచాపి ఆపలేదు. అలా ప్రవహించి ప్రవహించి, శాంతించి సముద్రంలో కలిసిపోతుంది

ఒకే కాలేజీలో రఘు, గౌరి చదువుతున్నారు. తరుచు కాకపోయినా, అప్పుడప్పుడు ఒకరినొకరు చూసుకోటం జరిగేది అతని రూపు రేఖలు, గంభీరత్వం పొదిగిన కళ్ళు చూసి ఆమె ఓ క్షణం ఆశ్చర్యపడి, మరో నిముషందాకా ఆ రూపాన్ని కళ్ళముందు చూడగలిగి ఉండవచ్చు మరుక్షణం అతను స్మృతిపథంనుండి తొలగిపోతాడు మరో సారి అతను కనిపించేవరకూ తలపు రాదు అంటే వ్యూహాచిత్రం నిర్జీవమైంది అలాగే అతను కూడా పాలరాతి విగ్రహంలా ఉన్న గౌరిని చూసి మనసుపడి ఉంటాడు. కాని ఆమె దృష్టిపథం నుండి దూరమయ్యేసరికి మర్చిపోతాడు అంటే నీటిలో కృత్రిమంగా కదలిక కలుగలేదన్నమాట

ఈ భిన్న ధృవాలను ఒకానొక సంఘటన దగ్గరకు తీసుకొచ్చి కొన్ని నిముషాలు ఒకరితో మరొకర్ని మాట్లాడించి, మనసులో ఉన్న అభిప్రాయాల్ని, మబ్బుల ముసుగుతో చందమామలా కాక, స్పష్టంగా తెలుసుకోమంది నిశ్చల జలంలో సహజమైన కదలిక కలిగింది నీరు పొర వారం భించింది వేగాన్ని అందుకుంది

గౌరి, రఘులు తరువాత ఎన్నోసార్లు కలుసుకున్నారు మాట్లాడుకున్నారు. అభిరుచులు చర్చించుకున్నారు. మనసులు విప్పి కవిత్వం చెప్పుకున్నారు

అలా రెండు నెలలు గడిచాయి.

'ఈ నా ప్రవర్తనకు—నాలో కలుగుతున్న మార్పుకు అంతరార్థం ఏమిటి ?' అని ప్రశ్నించుకుంది గౌరి. ఆత్మ పరిశీలన చేసుకుంది చివరకు రఘును తను ప్రేమిస్తోందని నిర్ధారణ చేసుకుంది. అతని స్థితిగతులు, వంశ మర్యాదలు గురించి ఆమె ఆలోచించలేదు. ఎలాగైనా తండ్రిని ఒప్పించి అతన్ని వివాహం చేసుకోవా లనుకుంది.

ఓనాడు గౌరి లాబరేటరీ వదలి బయటకు

తప్పేసరికి పేడు కావచ్చింది. ఫిజిక్సు ప్రాక్టికల్సు అంటే ఆమెకు వల్లమాలిన భయం. ఆ భయంతో సగం సగం సరిగ్గా వచ్చే ప్రయోగాల్ని కూడా పూర్తిగా తగలేసేది ఆమె లెక్క ప్రకారం నీటి తారతమ్య సాంద్రత ఒకటి కాదు మూడు! .. బోయిలు సిద్ధాంత ప్రకారం వాయుపీడన శక్తి, ఘనపరిమాణం సమానంగా ఉంటాయి .... అనాడు డిమాన్‌స్ట్రేటరు విసుక్కుని, కోపంతో సరైన ఫలితం వచ్చేదాకా ఇంటికి వెళ్లకూడ దన్నాడు. ఎలాగో ఒకలాగ ముగించి బయట పడింది.

కాంపౌండు దాటి వచ్చి ఆకాశంకేసి చూసింది మబ్బులు త్వర త్వరగా బిందెల్తో, కడవల్తో నీరు తెచ్చి గంగాళాన్ని నింపుతున్నాయి నిద్రమత్తుతో, నెమ్మదిగా నడుస్తున్న మేఘాల్ని భయపెట్టేందు కెవరో కత్తిని తళుక్కు మనిపిస్తున్నారు చలి గాలి హాయిగా వీచింది. గౌరి గబగబ అడుగులు వేయసాగింది. అకాలవర్షం కావటం మూలాన రక్షణ సాధనా లేవీ తెచ్చుకోలేదు. వాన తరుము కొచ్చింది అనాడే కొత్తగా కట్టుకున్న కాశ్మీర్ సిల్కు ఎక్కడ తడిసిపోతుందో నన్న భయం ఓవంక .... గంగాళం నిండగానే మబ్బులన్నీ కలిసి దానికి చిల్లులు పొడిచేసి అట్టహాసంగా పిడుగులు పడ్డట్టు నవ్వసాగాయి.

టపటపమని వాన మొదలైంది.

పూర్తిగా తడిసేముందు ఓ యింటి అరు గెక్కి నిలబడింది. పది నిమిషాల్లో, ఎలా వచ్చిన వాన అలాగే పోతుందని ఆమె అనుకుంటే అది పొరపాటు. మరింత ఉధృతమైంది. నీటి బిందువులు శైత్యాన్ని పోగుచేసుకుని ప్రవాహంగా మారి తెలియని గమ్యస్థానంవేపు కదలిపోతున్నాయి. గౌరి కూడా తోడై ఆమెను వేధించింది. ఇంక ఆ అరుగుమీద నిలబడి లాభంలేదు. నెమ్మదిగా తలుపు తట్టింది. తెరుచుకున్నాయి.

'ఓ! .... మీరా ? .... రండి! .... రండి! .... అన్నాడు రఘు

గౌరి విస్తుపోయింది. ఎదురుగా అజానుబాహువుగా నిలబడ్డ అతన్ని చూసి సిగ్గుపడుతూ లోపలి కొచ్చింది.

'చాలాసేపట్నుంచి అరుగుమీద నిలబడున్నాను. వర్షం తగ్గాక వెళ్లిపోదా మనుకున్నాను కాని, తగ్గే సూచనలు లేవు. మీ ఇల్లని తెలిస్తే సరాసరి ఇంట్లోకి వచ్చేద్దును' అంది కుర్చీలో కూర్చుంటూ.

'మనుషులు ఒకటైనప్పుడు కలుసుకుందుకు అవకాశాలు వాటంతటవే వచ్చిపడతాయి .... ప్రాక్టికల్సు ముగించుకుని వస్తున్నా రనుకుంటాను.'

గౌరి ఆశ్చర్యంతో 'ఆ సంగతి మీ కెలా తెలుసు?' అనడిగింది.

'అంతేకాదు. మీరు ఒక్క ప్రాక్టికలు కూడా సరిగ్గా చేయరని తెలుసు. రిజల్టు వచ్చే సూచనలు కనపడగానే కంగారుపడి సున్నా చుట్టేస్తారు'

ఇద్దరూ నవ్వుకున్నారు

ఎన్నో మాట్లాడుకోవాలనున్నా, ఎలా మాట్లాడాలో, ఎలా ప్రారంభించాలో ఇద్దరికీ తెలియ లేదు

'అన్నయ్యా! .... ఎవరది?' అంటూ ఓ పది హారేళ్ల అమ్మాయి అక్కడకు వచ్చింది ఆమె చేతి కర్ర సాయంతో, అడ్డంకు లెక్కడున్నవి తెలుసు కుంటూ, జాగ్రత్తగా వచ్చి రఘు పక్కన కూర్చుంది ఆ అమ్మాయి ఎంతో అందంగా ఉంది అవయవాలన్నీ ఖచ్చితంగా అమరాయి. ప్రతి కణంలోంచి యవ్వనం తొంగిచూసి చిరునవ్వు నవ్వుతోంది గౌరి అర్థం చేసుకుంది. ఆమెకు కళ్లు లేవు.

'గౌరి! .... ఈమె నా చెల్లెలు .... ఈమె గౌరి! ఇద్దరం ఒకే కాలేజీవాళ్లం!' అని పరిచయం చేశాడు రఘు

రఘు చెల్లెలు 'నమస్తే!' అని చేతులు జోడించింది గౌరి కూడా నమస్కరించింది.

'గౌరి! .... చెల్లాయికి కళ్లు లేవు నువ్వు నోటితో 'నమస్తే' అంటేనే కాని ఆమెకు తెలియదు.

గౌరి పొరపాటుకు నాలిక కొరుక్కుంది.

అయిదు నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు.

రఘు చెల్లెలు నెమ్మదిగా అక్కణ్నుంచి వెళ్లి పోయింది.

వచ్చేవారం

సబల

మధురాంతకం రాజారాం

'చెల్లాయి ఎంత అందంగా ఉందో చూశావా గౌరి? .... కాని, పాపం, కళ్లు లేవు! ప్రపంచంలో ఉండే సౌందర్యాన్ని చూసి ఆనందించే అదృష్టం ఆమెకు లేదు. నలుగురూ వర్ణిస్తే విని 'అలా ఉంటుంది గామోలు!' అని వూహించుకుని తృప్తిపడవలసిందే! .... పన్నెండేళ్లప్పుడు మెరపుకు దృష్టి పోయింది. అనాటినుండి నాకు మరీ సన్నిహితురాలైంది కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్నా ఆమె భవిష్యత్తును ఏవిధంగా నిర్ణయించాలో నాకు తెలియటంలేదు. కళ్లు ఉంటే పెళ్లి చేయొచ్చు .... గుడ్డిదాన్ని ఎవరు చేసుకుంటారు? అథవా అందానికి డబ్బుకు ఆశపడి చేసుకున్నా, మనస్ఫూర్తిగా ఏ మగవాడూ ప్రేమించలేడు అంతేకాదు .... అలా కళ్లులేని పిల్లను పెళ్లిచేసుకుంటానని ముందంజ వేసే వాడిలో ఏదో లోపం ఉండి తీరుతుందని నమ్మకం'

రఘు ఆగి గౌరి కళ్లల్లోకి చూశాడు.

రఘు తల్లి రెండుకప్పుల్తో కాఫీ తీసు కొచ్చింది.

'అమ్మా! చెల్లాయి ఏం చేస్తోంది? .... దాన్ని కూడా రమ్మను.'

'ఏమోరా! .... అది రానంటోంది.'

'ఎందుకని?' అనడిగింది గౌరి.

'నువ్వేమీ అనుకోకు. దాని తత్వమే అంత. నువ్వు తిరుగు నమస్కారం పెట్టలేదన్న కోపం కావచ్చు' అని నవ్వసాగాడు రఘు

గౌరి ముఖం చిట్లించి 'ఈ గుడ్డిదాని కింత గీర్వాణమా?' అనుకుంది

మొదటిసారిగా ఆమె ఆ కుటుంబాన్ని అసహ్యించుకుంది. రఘు ఆమె ముఖంలో కదులుతూన్న భావాల్ని చూస్తూ ఏవేవో నిర్ణయాలు చేసుకుంటున్నాడు.

బయట వర్షం కురుస్తూనే ఉంది

'కాని ఆమెను ఎంతకాలం ఇలా సంరక్షించగలరు? మీ సుఖానికి ఆమె అడ్డు వస్తూనే ఉంటుంది. మనం మానవులుగా జన్మించినందుకు కొంతైనా సుఖపడవద్దా?' అనడిగింది గౌరి.

'అందుకని? ....'—రఘు.

'నాకో మార్గం కనిపిస్తోంది. ఆమె నేదైనా ఆశ్రమంలో చేర్పించండి అంగవైకల్యం ఉన్నవా రందరికీ ఈనాడు ఆశ్రమా లున్నాయి ప్రభుత్వం వారి కోసం ఎన్నో ప్రణాళికల్ని అమలు పెడుతోంది. వారి అభివృద్ధికి దోహదం చేస్తోంది.' గౌరి అంతా అనేసి అతనికేసి భయంగా చూసింది. మాటల ముసుగులో నిజాన్ని దాచటానికి ప్రయత్నించినా రఘు గ్రహించకపోడని ఆమెకు బాగా తెలుసు. అతను నవ్వాడు

'నువ్వు అమాయకురాలివి గౌరి! ఆశ్రమాలు మనశ్శాంతి నీయలేవు. ఓ గుడ్డివా డున్నా డనుకో—అతనిక్కావలసింది తిండి—బట్ట—కాదు. శాశ్వతంగా ఓ లోపం నిలిచిపోయింది. దాన్ని సరి దిద్దుకోలేడు అందరికీ మల్లే జీవించలేడన్న భయం, నిరుత్సాహం, నిర్జీవత్వం వేధిస్తాయి. అతనిలో ఆశాజ్యోతిని వెలిగించాలి కళ్లు లేనంత మాత్రాన జీవించటం అతననుకున్నంత దుర్భరం కాదని నమ్మించాలి. అలా ఆశ్రమాలు చేయగలవా? .... ఎన్నటికీ చేయలేవు. నిర్వాహకులు కూడా వార్ని అసహ్యించుకుని హీనంగా చూస్తారు. అందంగా ఉండే స్త్రీలు వస్తే నిర్భయంగా సర్వనాశనం చేస్తారు. చెల్లాయిని ఆ నరకాని కెన్నడూ పంపను'

రఘు ఆగాడు.

'గౌరి! .... నువ్వు నా భాగస్వామినివి కాబోతున్నావు. ఆమె బరువు మనమీదే ఉంటుంది ఒక్కసారైనా విసుక్కోకూడదు. అలా జరిగితే మన మధ్య అనురాగం నిలవదు' అన్న భావన అతని మాటల్లో కనిపించింది గౌరి దా న్నర్థం చేసుకుంది కూడా.

గౌరి ఆ విషయంగురించి ప్రస్తావించటం మానుకుని ఏవో కాలేజీ విషయాలు మాట్లాడి వర్షం తగ్గాక ఇంటికి బయలుదేరింది మెదడు నిండా ఆలోచనలు — రఘును ప్రేమించే ముందు అతని కుటుంబం గురించి తెలుసుకోనందుకు తన్ను తాను నిందించుకుంది అతనితో తన భావి జీవితంగురించి ఆలోచించేసరికి ఆమెకు భయం వేసింది. అతని ప్రేమంతా చెల్లాయి కోసం దాచి ఉంచాడు. ఆ ప్రేమను రుజువు చేసేందుకు తను

వెలుగు

కేవలం తీయపడాలి. అంతవరకే తన స్థానమన్న మాట. రఘును చేసుకుని తను నిజంగా సుఖపడుతుందా ? ... తనకు డబ్బు, సంస్కారం, చదువు, హోదా — అన్నీ ఉన్నాయి. ఒకరికోసం తన సుఖాన్నెందుకు త్యాగం చేయాలి ? అనుభవం లేని తన నిర్ణయాలు కరగిపోయాయి

రెండు నెలల్లో అల్లుకున్న ప్రేమలత తెగిపోయింది. గట్టిగా నిట్టూర్చి గబగబ ఇల్లు చేరుకుంది.

ఆ మర్నాటినుండి ఆమె రఘుకేసి చూడలేదు. అతన్నిగురించి ఆలోచించలేదు నీటి ప్రవాహం తిరిగి సమాధిలో మునిగిపోయింది.

* * *

గౌరి తండ్రి ఉన్నట్టుండి, గుండె ఆగి చనిపోయాడు. అతను పైకి బాగా డబ్బున్నట్టు కనిపించి, విలాసంగా బతికినా, చుట్టూ అప్పులే. ఆ సంగతి ఎవరికీ — ఆఖరుకు భార్యకు కూడా తెలియనివ్వకుండా దాచివుంచాడు. మానవుడు 'మరణం', తనదాకా రాదన్న నమ్మకంతో ఉంటాడు. ఆ ధైర్యంతో ఎన్నో కోటలు కట్టి పథకాలు వేస్తాడు. ఆఖరుమెట్టు చేరుకునేసరికి అన్నీ వస్తుకుంటా ననుకుంటాడు. చడీచప్పుడు లేకుండా వచ్చి మృత్యుదేవత తన్నుకుపోతుంది. అలాగే, గౌరి తండ్రి నిర్మించిన హర్మ్యాలు సగం సగం పునాదిలో ఉండి అతని చావుతో, పూర్తిగా పూడుకున్నాయి.

ఇల్లు, వాకిలీ, ఆస్తి అంతా అయిపోయింది. గౌరి—తల్లి, ఆమె తమ్ముడు—వెయ్యి రూపాయలు, ఆఖరుకు మిగిలింది—కాలేజీ మానేసింది భావి జీవితం గురించి ఎందరో సలహా లిచ్చారు ఏక్ హోస్టెస్, స్కూలు టీచరు, ఆఫీసులో టైపిస్టు హాస్పిటల్ నర్సు

గౌరి ట్రెయినింగ్కై వచ్చింది.

ఆవూరు వదిలింది

గతాన్ని మరిచి కొవిధంగా జీవితంలో స్థిరపడింది రఘు ఏమయ్యాడో ఆమెకు తెలియదు. ఏమవుతాడు ? .... బి ఏ పూర్తిచేసి ఎక్కడైనా ఉద్యోగంలో చేరివుంటాడు అతన్ని ప్రేమించి, రెండు నెలల్లో విదలించివేసిన ఉదంతం జ్ఞప్తికొచ్చేసరికి నవ్వుకునేది. ఆనాటికి అభిప్రాయాలు వేరు మంచి చెడుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలుసుకోలేని రోజులు. అన్నీ సందేహాలే—అనుమానాలే, అసంతృప్తి, ద్వేషం, అనురాగం, అహంకారం అన్నీ నీటిలో చేపల్లా మనసులో పడి కొట్టుకునేవి

అనుభవంమీద జీవిత విధానం నిశ్చితమైంది. రోగులకు సేవచేస్తూ, దిగజారిపోతున్నవారి మనో ధైర్యాన్ని నిలబెడుతూ మనసులో చీకటిని తరిమివేసింది తమ్ముడు స్కూలుఫైనలు చదువుతున్నాడు. నాలుగేళ్ళు గడిస్తే అతను ఓ తీరం చేరుకుంటాడు తల్లి అప్పుడప్పుడు తన పెళ్లి గురించి ప్రస్తావన తీసుకొచ్చినా, పెడచెవిని పెట్టేది. దాని అవసరం దాటిపోయింది.

కాని—

ఆడదై పుట్టాక అవివాహితగా ఉండిపోతే సంఘం పూరుకోదు. పేరుకోసం ఎవర్నో ఒకర్ని చేసుకుని తరువాత విరమించివేసినా సరే ఫరవాలేదు దానికి మనిషి మంచి చెడ్డలు, సుఖదుఃఖాలు అక్కర్లేదు. ఏళ్ల తరబడి అమలులో ఉన్న సూత్రాలకు, ఆచారాలకు కట్టుబడి నడవమంటుంది. దారంమీద నడుస్తూ ఏమాత్రం యిటు ఒరిగినా అఘాతంలో పడాల్సిందే !

'ఆకర్షణ, అనుభూతి, అనురాగం, ఇవన్నీ అందరిలోనూ సమానంగా ఉంటాయికదా? ఈ అమ్మాయి మాత్రం ఇరవై దాటినా పెళ్ళీ పెడాకులూ లేకుండా ఎలా ఉంటోంది' . . అయినా నర్సు కదూ ! తెర వెనక కథ మన కెందుకు బాబూ ! ... ఏ రామాయణమో చదువుకుని ముక్తి సాధిద్దాం' అని పగలు ప్రచారం చేసి, రాత్రిళ్ళు ముసుగు వేసుకుని చప్పుడు కాకుండా అడుగుమీద అడుగు వేస్తూ రహస్యశోధన సాగిస్తుంది. అణువంత అవకాశం దొరికితే కొండంత చేసి ప్రచారం చేస్తుంది.

గౌరి ఎదుర్కొన్న మొదటి ప్రశ్న ఇది.

ఓనాడు మధ్యాన్నం వెంటనే ఇంటికి రమ్మని గౌరికి కబురు వచ్చింది.

ఆమె ఇల్లు చేరుకునేసరికి తమ్ముడు పడుకున్నాడు. అతని కాళ్లకు కట్లు.

'సైకిలుమీద వెడుతూ లారీని ఢీకొన్నాడట.... కాలు విరిగింది' అంది అమ్మ.

గౌరి ఏడవలేదు. విఘాతాన్ని తట్టుకునే మనస్థైర్యాన్ని ఆమె ఎప్పుడో అలవర్చుకుంది.

తమ్ముణ్ణి హాస్పిటల్లో జాయిన్ చేశారు. గౌరి స్వయంగా శుశ్రూష చేసింది. ఎముక విరిగినందున ఆపరేషన్ జరిగింది. ఓ కాలు తీసేసి కొయ్య కాలు తగిలించారు. అతను కుంటివాడై పోయాడు. స్కూలుఫైనలు పూర్తికాగానే, ఎక్కడికి బయటకు వెళ్లకుండా ఇంటోనే కూర్చున్నాడు కాలేజీలో చేరి చదవమంది గౌరి.

'అక్కయ్యా ! ... నేను చదవను. అందరూ నన్ను చూసి నవ్వుతారు. నేను కుంటివాణ్ణి. ఇలా ఎంతకాలం బతకను ? నా కెక్కడా ఉద్యోగం కూడా దొరకదు.. రైలుక్రింద పడి చచ్చిపోతాను' అని గట్టిగా ఏడ్చాడు

గౌరి సమాధానం చెప్పలేదు. పువ్వులు పూసే సమయంలో అందమైన పూలమొక్కను మొదలంట నరికివేసినట్టయింది అతని భవిష్యత్తు గురించి ఆలోచించి ఒడ్డు చేరుకోలేక పోయింది. అంతరించిన విషాదం మళ్లీ తలెత్తింది

ఎవరో కవ పక నవ్వారు.

గౌరి ఉలిక్కిపడి చుట్టూ చూసింది. . . . ఎవరూలేరు. . అంతా తన భ్రమ . . కాదు, మళ్ళీ అట్టహాసంగా అదే నవ్వు. ఈసారి రఘు ఎదురుగా కనిపించాడు చేతులు రెండూ వెనక్కు కట్టుకుని విరగబడి నవ్వుతున్నాడు.

"గౌరి ! . . . .ఎందుకలా బాధ పడతావ్? నువ్వుండగా నీ తమ్ముడికి ఏ లోపమూ వుండదు." అన్నాడతను.

"కాదు. . . .అతను మనసు విరిగి ప్రాణాలు తీసుకుంటాడని భయంగావుంది."

"మరేం భయంలేదు. అతన్నేదైనా ఆశ్రమంలో చేర్పించు. అంగవైకల్యంవున్నవారందరికీ ఈనాడు ఆశ్రమా లున్నాయి. ప్రభుత్వంవారికోసం

ఎన్నో ప్రణాళికల్ని అమలు పెడుతోంది. వారి అభివృద్ధికి దోహదం చేస్తోంది."

గౌరి నవ్వింది.

"మీకు తెలియదు రఘు!... ఆశ్రమాలు మనశ్శాంతి నీయలేవు. ఓ కుంటివాడున్నాడనుకోండి. అతని క్కావలసింది తిండి—బట్ట—కాదు. శాశ్వతంగా అతనికాలుకుంటిదైంది—దాన్నిసరిదిద్దుకోలేడు. అందరికీ మల్లే జీవించలేడన్న భయం, నిరుత్సాహం, నిర్జీవత్వం వేధిస్తాయి. అతనిలో ఆశాజ్యోతిని వెలిగించాలి. కాళ్ళు లేనంత మాత్రాన జీవించటం అత ననుకున్నంత దుర్భరంకాదని నమ్మించాలి. అలా ఆశ్రమాలు చేయగలవా?...ఎన్నిన్నటికీ చేయలేవు....తమ్ముణ్ణి ఆ నరకాని కెన్నడూ పంపను."

"అలాగా!... ఈ నాటికి నిజం తెలుసుకున్నావు...మరి ఏళ్ళాయినిమాత్రం ఆశ్రమానికి పంపమన్నావు కదూ?" అని గద్దించాడు రఘు.

గౌరి చేతుల్తో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. తెలియక అమాయకత్వంతో చేసిన పొరపాటుకు ఈనాడు తనకు లభించిన శిక్ష!...

ఆమెజీవితం యాంత్రికంగా నడచిపోతోంది. రఘును కలుసుకుని తన తప్పిదానికి క్షమాపణ చెప్పుకోవాలనిపించేది. తల్లి మాత్రం ఆమె పెళ్ళి గురించి ప్రస్తావిస్తూనే వుంది.

"నేను నా సుఖం చూసుకుంటే, తమ్ముడి మాటేమిటి?...అతను నాతో ఎప్పుడూ వుండవలసిందే! అతనికోసం నేను ఏ త్యాగమైనా చేస్తాను' అంది గౌరి.

"అంటే, నిన్ను చేసుకునేవాడు తమ్ముణ్ణి కూడా తనతో వుంచుకోవాలన్నమాట. బాగానే వుంది!" అని మధనపడేది తల్లి..

"అవును...నా అభిప్రాయం అంతే! ఓనాడు రఘు కూడా అలాగే అన్నాడు' అనుకుంది గౌరి.

* * *

ఏడు గంటలైంది.

గౌరి దుస్తులు మార్చుకుని ఇంటికి బయలుదేరింది.

"నీ భగ్న ప్రేమికుడు వస్తాడేమో!....కాస్త ఆగు—" అని నవ్వింది దేవకి.

గౌరి విషాదంగా నవ్వి మెట్లు దిగసాగింది... ఆఖరిమెట్టుమీదవుండగా రఘు ఎదురుపడ్డాడు. ఆమె గుండెలు గుబగుబ కొట్టుకున్నాయి.

"సిస్టర్....మా అమ్మకెలావుంది?.... క్షమించండి! మీరు డ్యూటీ ముగించుకుని వెడుతున్నారు గామోలు!" అన్నాడు.

"మరేం భయంలేదని చెప్పానుగా!.... రెండుసార్లు మీ గురించి అడిగింది. అన్నట్టు తరిగ్గా ఏడింటికి వచ్చేశారే!... .వెళ్ళి చూడండి'"

ఇద్దరూ కదలక మౌనంగా నిలబడ్డారు. సన్నిహితంగావున్న ఇద్దరు వ్యక్తులు పూర్తిగా అపరిచితులైనట్టు ఎంతకాలం నటించగలరు?

"రఘు!....నేను మీకు గుర్తున్నానా?..... అడిగింది ఆతృతతో గౌరి.

"గౌరి!... నిన్ను మరచిపోవటమనేది వీలౌతుందా? ... మనుష్యులలోని జీవితంపట్ల మనదృష్టి కోణాలు వేరయ్యాయి. ఒకానొక విషయంలో అభిప్రాయభేదం ఏర్పడింది. అంత మాత్రంచేత మనం ఒకర్నొకరు ద్వేషించుకో నవుసరంలేదు. నీ కిష్టంలేని పని చేయమని నే నెన్నడూ అనలేదు. నువ్వే నన్ను తప్పుగా అర్థం చేసుకుని స్నేహలతను తుంచివేశావు... నువ్వనుకున్నంత సంకుచిత మనస్తత్వం కాదు నాది.

"మీ నాన్నగారు పోయాక నువ్వు నర్సయ్యావని తెలుసు....ఎన్నోసార్లు నిన్ను కలుసుకుని పూరడిద్దామనుకున్నానుకాని, నీలో పరిపూర్ణత్వం కోసం ఎదురు చూశాను...మీ అమ్మ, తమ్ముడు కులాసాయేనా?"

గౌరి ఆశ్చర్యపోయింది. సిగ్గుపడింది. మంచితనం అతనిలో వెన్నముద్ద. ఏమాత్రం వేడి తగిలినా కరిగిపోతుంది. అతన్నిగురించి తన అభిప్రాయాలన్నీ మార్చుకోవాలి. అతను గంభీరమైన పెద్ద పర్వతమైతే, అతనిముందు తనొక యిసుక రేణువు....

'నన్ను క్షమించండి....చేసిన పొరపాటుకు నేను పశ్చాత్తాపపడుతూనే వున్నాను. నా జీవితాన్ని చేతులార నేనే ధ్వంసం చేసుకున్నాను.

'అదేమిటి గౌరి?....అలా దిగజారిపోతావెందుకు? ధైర్యంగావుండు. నీలో నిండుతనం నిలిచిందనుకున్నానుగాని....జీవితంలో సుఖం కంటే దుఃఖమే ఎక్కువ. ఎదురుగాలుల్ని ఎదుర్కొని నిలవటంలోనే తృప్తి, ఆనందం, గర్వం వున్నాయి. బతికి, సాధించాలి సాధించాలి... మీ తమ్ముడు పాపం!...

పెళ్ళిళ్ల పేరయ్యను వెంట పెట్టుకొని పెళ్ళి కూతుర్ని చూడ్డానికి బయలుదేరాడు ఒక పెళ్ళికొడుకు. పెళ్ళి కూతుర్ని చూచిన తర్వాత పెళ్ళిళ్ళ పేరయ్య చెవిలో మెల్లగా ఇలా అన్నాడు

పె. కొడుకు:—ఇంత లావుగా ఉందేమయ్యా! కాళ్లు దెయ్యపు కాళ్ళు. పొట్ట బాన పొట్ట. మొఖం అంత భయంకరంగా వుంది.

పె. పేరయ్య:—చూడు నాయనా! నీవు చెప్పదల్చుకున్నదేదో గట్టిగానే చెప్పు. ఎందుకనగా ఆమెకు చెముడు కూడానూ.

కె. అప్పారావు (రంగూన్)

"ఇంక నన్ను బాధ పెట్టకండి—నాకు తగిన శిక్ష దొరికింది—" అంటూ గబగబ కదలిపోయింది.

పొంగి పొరలి వస్తున్న ఏడుపును అతి కష్టంమీద ఆపుకుంది. ఆవేదనలో కళ్ళు రెండూ ఎరుపెక్కాయి. అంతా శూన్యంగా కనపడింది గాఢాంధకారం—మిణుకు మిణుకు మంటున్న దీపం పట్టుకుని రఘు మాత్రం ఎక్కడో దూరంగా కనిపించి రమ్మంటున్నాడు. వెళ్ళవచ్చునో కూడదో తెలియదు..... కాంపౌండుదాటి బయటకు రాగానే డాక్టరు నరసింహం బంట్రోతు కనిపించాడు.

'మిమ్మల్ని డాక్టరుగారు వెంటనే రమ్మన్నారు. చాలా అర్జంటు' అన్నాడు.

'ఎందుకు?....' అని విసుకుంది గౌరి.

'ఏమో!....నాకేం తెలుసండి?' అని మరీ విసుక్కున్నాడతను.

"సరే!....నువ్వు పో!...నేను వస్తాను' అతన్ని పంపివేసి నెమ్మదిగా నడవసాగింది.

మనసంతా బరువుగా వుంది. తమ్ముడు కుంటివాడు కావటంతో నరసింహం దగ్గర నర్సుగా చేరింది. అదనంగా యాభై రూపాయలు వచ్చేవి. మనసుకు, శరీరానికి విశ్రాంతి లేకపోయినా, యంత్రంలా పనిచేసి బాధల్ని మర్చిపోవటంలో ఓ కొత్త రకం ఆనందం కనిపించింది. నరసింహం ఇల్లు చేరుకునేసరికి ఎనిమిదైంది.

"కాలింగ్‌బెల్" నొక్కబోయి, సంభాషణవిని ఆగింది.

"మీ రిప్పుడు బయటికి వెళ్ళటానికి వీల్లేదు. ఒంట్లో బాగా లేదని డిస్పెన్సరికి వెళ్ళటం మానుకున్నారు. ఇంట్లో కుదురుగా కూర్చోక ఆ నర్సు ముండతో షికారెందుకు?

నా కళ్లెదుట ఇదంతా జరుగుతుంటే, నేను చూస్తూ వూరుకోలేను. ముందు నా కేదైనా విషమిచ్చి చంపి, మీ యిష్టం వచ్చినట్టు తందనాలాడండి....నేను బతికుండగాకాదు!" అనరిచింది నరసింహం భార్య.

"నువ్వు పొరబడుతున్నావు...ఏదో అర్జంటు కేసుంది. అందుకని వెడుతున్నా"

'మీరు ఒక్కరే వెళ్ళక, పని కట్టుకుని దాన్ని కూడా ఎందుకు తీసికెళ్ళాలి?'

'ఆ పేషంటు ఆడది....అందుకని'

అలా ఇద్దరు వాదించుకున్నారు.

ఎవరిదో చెంప ఛెళ్ళుమంది

'నా యిష్టం వచ్చినవారితో తిరుగుతాను. వందమంది నర్సుల్ని వెంటబెట్టుకుని శ్రీ కృష్ణమూర్తిలా సుఖిస్తాను......నీకు విడాకు లిస్తాను దాన్నే పెళ్ళి చేసుకుంటాను. దిక్కున్నచోట చెప్పుకో" అన్నాడు ఆఖరు వాక్యంగా నరసింహం

గౌరి గడగడలాడింది. నరసింహం మంచివాడు. అతని మాటల్లో నిజంలేదని ఆమెకు బాగా తెలుసు. జంతువుతో 'లాజిక్' పనికిరాదని సహనాన్ని కోల్పోయి అన్నమాటలివి....అయినా ఆమె ప్రచారం ప్రారంభిస్తే తన బతుకేంగాను?....అంతేకాదు. నరసింహానికే చెడు బుద్ధి ఎందుకు కలగకూడదు?

తలుపు తటాలున తెరచుకుని నరసింహం బయటకు వచ్చాడు.

గౌరిని చూసి విస్మితోయి ఆగిపోయాడు.

"డాక్టరుగారూ ! . . . నా కివాళ వంట్లో బాగా లేదు. . . .నేను ఇంటికి వెడుతున్నా—' అంది గౌరి

"అయ్యయ్యో ! . . అలాంటప్పుడు ఇంత దూరం ఎందుకు నడచి వచ్చావ్ ? . . .బంట్రోతుతో చెబితే చాలుగా !" అని జాలిపడ్డాడు నరసింహం.

గౌరి ఇల్లు చేరుకునేసరికి తొమ్మిది కావస్తోంది. ఇంటిముందు కారు నిలబడివుంది. మొదట్లో ఆశ్చర్యపోయినా, దగ్గరకు వచ్చాక అది చలపతి కారని తెలిసింది. అతను శ్రీమంతుడు. విలాస పురుషుడు.

'హలో గౌరి ! . . . .నీ కోసం ఎంత సేపట్నుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా ? ...... త్వరగా అన్నం తినిరా. అలా ఓమారు షికారు వెడదాం—"

గౌరి చలపతి కళ్ళలోకి చూసింది. అతని కారులో రెండుసార్లు హాస్పిటలుకు వెళ్ళినందకు ఫలితం ! . . . .క్రమంగా తనకు దగ్గరై అందాన్ని నమిలి మింగివేయాలన్న ఆకాంక్ష కళ్ళనిండా కదలింది. హాస్పిటల్లో నర్సుగా కుదిర్చింది అతనే—నరసింహంతో పరిచయం చేసింది అతనే—అందుకు ప్రతిఫలంగా అతన్ని ఆనందింప జేయాలిగామోలు! చేతి వేళ్ళకు తళతళమనే వుంగరాలు—సిల్కు చొక్కా మెడలో బంగారు గొలుసు—చేతికి బంగారు చెయినున్న రిస్టువాచీ—అతన్ని ప్రతి యువతి ప్రేమిస్తుందన్న భ్రమ కామోలు . . .

"నాకు వంట్లో బాగా లేదండి . . . మీరు వెళ్ళచ్చు' అనేసి చరచర ఇంట్లోకి పోయింది.

"ఆయన పిలుస్తుంటే వెళ్ళకూడదటే ?...... ఒకనాడు షుష్టై కట్టినా కట్టవచ్చు—"

గౌరి తల్లికేసి చురచుర చూసింది అమ్మ కూడా ఆశ—

తమ్ముడు కిటికీ దగ్గర కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు బయట కారు కదలిపోతున్న చప్పుడు వినిపించింది.

ఆకలి లేదంటూ పడుకుంది గౌరి ఆవేదన తీరేవరకూ వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె చుట్టూ తోలేదు సమస్యలు—దుష్ట శక్తుల విలయ తాండవం—తన అందం తనకు శత్రువు!

సర్జన్ ఆశగా చూసి నవ్వుతాడు. నరసింహం భార్య తనమీద కక్ష కట్టి భస్మం చేస్తుంది చలపతి వంకర నవ్వుతో తన్ను వశపర్చుకోటానికి యత్నిస్తాడు. వీళ్ళందర్నీ ఎదిరించలేని అబల తను! అందరితోనూ నవ్వుతూ, మంచిగా వుండాలి. వీటిలో వున్నంతవరకూ మొసళ్ళతో పోరాడి గెలవటం ఎలాగూ సాధ్యంకాదు కనక, కపీనం తప్పించుకోటమ్మైనా అలవర్చుకోవాలి—కాని ఆ మొసళ్ళు మౌనం గ్రహిస్తాయి. నమిలి మింగివేస్తాయి.

వెలుగు

ఇలా ఎంతకాలం గడప గలుగుతుంది ? . . . .

తమ్ముడి కొయ్యకాళ్ళు 'టక్కు—టక్కు' మని నడచిపోయాయి

గౌరి గుండెలు గడగడ లాడాయి. తమ్ముడి భవిష్యత్తును ఎలా చిత్రించటం?

అతనికి విడుదల ఎప్పుడు? తనకు రఘు కావాలి కాని, అతని గుడ్డి చెల్లెలు అక్కర్లేదు—అలాగే అందరికీ తను కావాలికాని, కుంటి తమ్ముడక్కర్లేదు . . . .పెద్ద మేడ—కారు—సిరిసంపదలు—షికార్లు — ఎప్పుడూ గిలిగింతలు పెడుతూ, చిలిపిగా కబుర్లు చెబుతూ దగ్గరగావుండేభర్త!.. ఇవన్నీ తెలువు నలువులు తెలియనికాలంలో కోరుకున్న కోరికలు.

ఆఫీసరుగారు అప్పటికి రెండు రోజుల క్రితం చేరిన క్రొత్త గుమాస్తాను పిలిచి:

మిస్టర్, ఈ కాగితంలో ఉన్న రిఫరెన్సు 1950 సంవత్సరం ఫైలులో ఉంటుంది. అది స్టడీ చేసి "డ్రాఫ్టు పుటప్" చేయ్.

గుమాస్తా:- అప్పటికి నేను ఉద్యోగంలో లేను సార్!

కొల్లా సాంబశివరావు (గుంటూరు)

ఈనాడు వాటిమీద తన కాశలేదు అర్థం చేసుకోగల హృదయం కావాలి తనకు— అంతే.

ఏదో ఆవేశం ఆమె నావరించింది.

గబగబ లేచి టేబులుముందు కూర్చుని ఉత్తరం రాయసాగింది.

"నేను జీవితాన్ని అర్థం చేసుకున్నా—అంటే పూర్తిగాకాదు—కొంతవరకే — మానవుడి అభిప్రాయాలు ఏనాడూ స్థిరంగా వుండవని బాహ్య శక్తులకులోనై మారతాయని. అనురాగం ద్వేషానికిలోనై ఎక్కడో దాక్కున్నా, తన దీన స్థితికి పరితపిస్తూనే వుంటుంది. పొరపాటు తెలిసిరాగానే ద్వేషానికి స్థానం వుండదు—అంతటా అనురాగం అలుముకుంటుంది . . . నా తప్పిదాన్ని తెలుసుకున్నా. మీ మనసు బాధ పెట్టినందుకు క్షమించండి. . . వెలుగుకోసం మీమీదే ఆధారపడుతున్నా—"

ఆవేశం తగ్గింది. అంతకంటే వివరించి రాయాలో అమె కర్థం కాలేదు ప్రశాంతంగా ఓసారి తను రాసిన ఉత్తరం చదువుకుంది. మడిచి కవర్లో వుంచింది. గుండెలమీద వుంచుకుని తృప్తిగా నిద్రపోయింది

ఆ మర్నాడు నరసింహం డిస్పెన్సరీకి వెళ్ళలేదు. హాస్పిటలుకు వెళ్ళి వుత్తరం దేవకి కిచ్చింది

'ఆ ముసిలావిడ కొడుకువస్తే మర్చిపోకుండా ఇవ్వాలి. జవాబు రాసిస్తే పుచ్చుకో ఇవాళ్టికి నేను డ్యూటీకిరాను రేపుదయం కలుసుకుంటా!

దేవకి కొంటెగా నవ్వుతూ, "భగ్న ప్రేమికుణ్ణి సామాన్య వ్యక్తిగా మార్చ దల్చుకున్నావన్న మాట!" అంది గౌరి జవాబు చెప్పలేదు.

* * *

ఉదయం గౌరి రాగానే దేవకి రఘు ఉత్తరం అందించింది.

ఆసక్తితో విప్పి చదువుకుంది.

"నీ ఉత్తరం చదువుకుని ఎంతో ఆనందిస్తున్నా! ఈనాటికి నీలో పరిపూర్ణత్వం కలిగింది. స్వతంత్రంగా బతికే శక్తి నీలో పరుగెడుతోంది . .

మన ప్రేమను తియ్యటి జ్ఞాపకంగా వుంచుకుందాం. మన జీవితాలు బాధ్యతలతో పెనవేసుకుపోయాయి. నీకు నీ తమ్ముడు—నాకు నా చెల్లెలు. వాళ్ళకు శుశ్రూషచేస్తూ, కనిపెట్టుకునుండటంలో ఆనందంలేదూ?. . . .ఒక వ్యక్తి రెండు లక్ష్యాలతో జీవించలేడు నీ మూలంగా ఎందరో రోగులు మనోధైర్యాన్ని నిలబెట్టుకో గలుగుతున్నారు సంసారంలో మునిగితే వచ్చేదేముంది? జీవితపు లక్ష్యం అదొక్కటేకాదు. అహంకారం—అసహ్యత—అసూయ—ప్రతీకారం — అన్నింటికీ దూరంగావుండే జీవితాన్నేమనం ఎన్నుకోవాలి.

నీ చుట్టూ విషపు మొక్కలు మొలుస్తున్నాయని నాకు తెలుసు. భయంతో ఈ లోకాన్ని, ఈ మనుష్యుల్ని వదలి ఎక్కడకు పారిపోలేవు. మంచిగా, తెలివిగా నడుచుకుంటే ఆ మొక్కలే గులాబీలు పూస్తాయి.

నేను రాసిన విషయాలన్నీ గుర్తుంచుకుని ఆత్మ విగ్రహాన్ని అలవర్చుకుంటే నీ లక్ష్యం—మానవుడి ఒక్కటే లక్ష్యం—అదే సుఖంగా, తృప్తిగా జీవించటం—తప్పకుండా నెరవేరుతుంది—అధైర్యపడకు—!

గౌరి నిట్టూర్చింది.

ఆమెలో ఆశాభంగం లేశమ్మైనాలేదు.

దేవకి ఆమె కళ్ళలో వెలుగును చూసి ఆశ్చర్యపోయింది.

గౌరి కళ్ళముందు ప్రతి వస్తువు, ప్రతి జీవరాశి కొత్త వెలుగుతో, కొత్త రంగులో కనిపించాయి.

ఆమెలో అశాంతి మచ్చ లేదు. ★

భూగర్భంలోకి సాహసయాత్ర

25-వ పేజీ తరువాయి

ఆలస్యం లేకుండా ప్రయాణం కట్టమని బలవంతం చేశాడు మా పెదనాన్న. కాప్టెన్ ఆయన్ను ఒక సారి అలా షికారు వెళ్లి రమ్మన్నాడు.

ఆరోజు కీల్‌లో కూడా, తక్కిన చోట్లలాగే ముగిసింది. సముద్రం ఒడ్డునే నడిచాము. కొమ్మల మధ్య గూడును పోలిఉన్న 'పార్కు' చుట్టూ తిరిగాము. అక్కడ కొన్ని ఇళ్లకు చన్నీటిస్నానం కోసమని ప్రత్యేకమైన గదులు ఉన్నాయి ఇవి చిన్నవిగా చూసేందుకు చక్కగా ఉన్నాయి. పనిలేకుండా తిరిగి, తిరిగి పణిగాము. ఎలాగో 'సాయంత్రం' పది గంట లయింది.

'ఎల్లనోరా' పొగ ఆకాశం ఆక్రమించేస్తోంది. బాయిలర్ ధ్వనికి స్టీమర్ అదిరిపోతోంది. నావ కంతకీ ఒకటే 'కాబిన్' ఉన్నది. మా 'బంక్‌లు' అందులోనే ఉన్నాయి.

పదింపావుకి లంగరు ఎత్తివేసి స్టీమర్ కదిలి వెళ్లిపోయింది.

చీకటి రాత్రి. రివ్వున గాలి వీస్తోంది. సముద్రం కల్లోలంగా ఉన్నది. తీరం నుంచి ఎప్పుడైనా కొన్ని దీపాల కాంతి మసకగా కనిపించాయి. ఆ తర్వాత ఎప్పుడో సరిగ్గా జ్ఞాపకంలేదు గాని, దీపస్తంభం కాంతి అలలమీద ప్రతిజ్వలించింది. ఇంకేదీ జ్ఞాపకం రాలేదు.

కోర్సూర్‌లో పొద్దున ఏడు గంటలకు దిగాము. ఇది 'జీలాండ్' పశ్చిమ తీరాన ఉన్న చిన్న పట్నం. అక్కడ రైలుబండి ఎక్కవలసి వచ్చింది.

డెన్మార్కు ముఖ్యపట్నం చేరాలంటే మూడు గంటలు పైన ప్రయాణం చెయ్యాలి. మా పెదనాన్న రాత్రి అంతా కన్ను ముయ్యలేదు. తొందర ఆపుకోలేక కాళ్లతో రైలుబండిని 'తోద్దా' మని చూస్తున్నాడా అని నా అనుమానం.

చివరకు సముద్రం కనిపించింది.

"సౌండ్ అదిగో!" అని అరిచాడు. (సౌండ్ ఒక సముద్ర భాగం పేరు)

పెద్ద ఆస్పత్రి వంటి భవనం పక్క నుంచి వెళ్లాము.

"అదొక పిచ్చాసుపత్రి," అన్నాడు మాతోటి ప్రయాణికులలో ఒకరు.

"బావుంది!" అనుకున్నాను, "మేము కూడా ఇక్కడే ఆగిపోవాలి అసలు ఇంత పెద్దదైనా ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్‌గారి పిచ్చి ఇందులో పడుతుందా!"

పది గంటలకు కోపెన్‌హాగన్ చేరుకున్నాము వూరి బయట 'బ్రెడ్‌గాల్' లో 'ఫీనిక్స్' హోటల్ చేరుకునేసరికి అరగంట దాటింది. ఇంతలో మా పెదనాన్న అవసరంగా నన్ను వెంటబెట్టుకుని బయటకు బయలుదేరాడు. హోటల్ కూలి మనిషి (పోర్టర్) ఇంగ్లీషు, జర్మన్ రెండూ మాట్లాడగలడు. కాని బహు భాషాప్రావీణ్యం కల మా పెదనాన్న డేనిష్ భాష గలాగ్రాహిగా మాట్లాడేసి 'మ్యూసియమ్‌' కి ఎలా వెళ్లాలో కను క్కున్నాడు.

ఈ మ్యూసియం డైరెక్టర్ ప్రొఫెసర్ థామ్సన్ హాంబర్గ్‌లో డెన్మార్కు ప్రతినిధికి స్నేహితుడు.

మా పెదనాన్న దగ్గర మంచి పరిచయ పత్రమే ఉన్నది. అందుచేతనే, పండితులు సాధారణంగా పలకరించినట్లు కాకుండా ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్‌గారికి మంచి స్వాగతమే యిచ్చాడు. శ్రీ థామ్సన్. ఈ స్వాగతంలో కొంత భాగం నాకూ లభించింది. మా రహస్యం ఆయనకు తెలియనివ్వలేదని నేను వేరే చెప్పనక్కరలేదు ఐస్‌లాండ్ సరదాకి చూసి వస్తున్నామని చెప్పాము.

శ్రీ థామ్సన్‌మాకు చాలా సహాయపడ్డాడు నావ ఏదైనా బయలుదేరుతున్నదేమో నని హార్బర్ అంతా తిరిగాడు.

దొరకకుండా ఉండాలని నేను ఆశించాను కాని

ఒక వర్తకుడు అడవిలో పోతుంటే ఇద్దరు దొంగలువచ్చి

దొంగ:--(వర్తకునితో) అయ్యా! ఈ రెండు వ్రేళ్ళలో ఏదో ఒక వ్రేలు లాగండి.

వర్తకుడు:-(దొంగతో) దేనికయ్యా!

దొంగ:--(వర్తకునితో) అయ్యా! మీ పెద్ద వ్రేలునకు వున్న వుంగరము మా ఇద్దరిలో ఎవరు తీసుకోవాలా అని......

'ఫాల్కాయిరా' అని పేరు గల చిన్న డేనిశ్ నావ ఒకటి జూన్ రెండవ తారీఖున పయనమవటానికి సిద్ధంగా ఉన్నది దాని కాప్టెన్ హెర్ (శ్రీ) బ్యార్న్‌ని కలుసుకున్నాము ఆయన స్టీమర్‌లో పయనం అవబోయే ఈ ప్రయాణికుడు సంతోషం పట్టలేక 'షేక్‌హాండ్' ఇచ్చినప్పుడు చెయ్యి నలిపివేశాడు పాపం కాప్టెన్ బ్యార్న్ ఆశ్చర్యపోయాడు. ఐస్‌లాండ్ వెళ్లటం ఏమంత మహత్కార్యంగా కనిపించలేదు. అసలు అతని వృత్తే అంత మా పెదనాన్నకి మాత్రం ఇది చెప్పలేనంత గొప్ప పనిగా ఉన్నది. కాప్టెన్ మాకు సరియైనవాడే కనుక ఈ ఉత్సాహం చూసి మా దగ్గర పుచ్చుకోవలసిన దానికి రెండింతలు వసూలు చేశాడు. మేము దానిని లెక్కచేయలేదు.

"మంగళవారం పొద్దున ఏడు గంటలకల్లా నావలోకి ఎక్కి కూర్చోవాలి" అన్నాడు బ్యార్న్ బంగారు డాలర్లు జేబులో వేసుకుంటూ.

హెర్ థామ్సన్‌కి మా కృతజ్ఞత తెలిపి మా హోటల్‌కి తిరిగి వచ్చేశాము.

"బావుంది! చాలా బావుంది! ఈ నావ బయలుదేరటానికి సిద్ధంగా ఉండటం మన అదృష్టమే! భోజనం ముగించి వూరు చూసి వద్దాం రా!" అన్నాడు మా పెదనాన్న మళ్లీ మళ్లీ.

కోపెన్‌హాగెన్‌కి నైఋతి వైపున ఉన్న ఆమాక్ ద్వీపంలో ఉన్న ఒక 'చర్చి' చూసి అటు వైపు వెళ్దా మన్నాడు మా పెదనాన్న. కాలవలలో తిరిగే చిన్న స్టీమర్ ఎక్కి వెళ్లాము

కొన్ని సందులలో రక్షకభటులు కావలా కాస్తూ ఉంటే ఏవేవో పనులు చేస్తున్నారు వారు తొడుక్కున్న లాగూలకి ఒక 'కాలు' పసుపు, రెండవది బూడిదరంగు! మేము వెళ్లవలసిన చర్చి పేరు 'ఫోర్ ఫ్రెల్సిరస్ కిర్కు' దానిలో ప్రత్యేకత ఏమీ ఉన్నట్లు కనిపించలేదు కాని ఈ ఎత్తయిన 'స్టీపిల్ (గోపురం) ప్రొఫెసర్ గారిని ఆకర్షించింది.

"పైకి ఎక్కుదాం" అన్నాడు మా పెదనాన్న

"నాకు తల తిరుగుతుంది" అన్నాను.

"అందుకనే ఎక్కమన్నది ఎత్తు నుంచి కిందకి చూస్తే తల తిరక్కుండా అలవాటు చేసుకో."

"కాని—"

"రమ్మంటూంటే! కాలం వృథా చెయ్యకూడదు."

చేసేదేమీ లేక ఆయనను అనుసరించాను. చర్చికి సంబంధించిన అధికారి వద్ద తాళం చెవి ఉంటే తలుపు తీయించుకుని పైకి ఎక్కటం మొదలుపెట్టాము

మా పెదనాన్న నా ముందు చకచక మెట్లు ఎక్కి వెళ్లిపోయాడు హడలిపోతూ ఆయనను అనుసరించాను. నాకు తల తిరుగుతుంది. గ్రద్దల వలె ఎత్తు ప్రదేశాలలో చలించకుండా ఉండే దిట్టతనం నాకు లేదు

మొదటి నూటయాభై మెట్లూ చర్చి లోపలే ఉన్నాయి. ఆతర్వాత గోపురం చుట్టూ తిరిగి తిరిగి పైకి వెళ్లాయి. వెడల్పు చాలా తక్కువగా కనిపించాయి. ఎక్కేవారికి 'రక్ష' గా సన్నటి 'కడ్డీ' ఒకటి మెట్ల వెంబడే వేశారు

"నేను సాహసం చెయ్యలేను!" అని అరిచాను.

"ఏమిటిది? పిరికివాడా! పైకి వెళ్లవలసిందే!" అని శాసించాడు, నిర్దయుడైన ప్రొఫెసరుగారు.

చేసేది ఏమీ లేక ఆయన వెంటనే వెళ్లాను చుట్టూ ఉన్న 'కడ్డీ' ని గట్టిగా పట్టుకుని. చల్లటి గాలికి నా తల తిరగటం మొదలుపెట్టింది. దాని విసురుకి గోపురం అంతా వూగింది. కాళ్ళ స్వాధీనం తప్పిపోయాయి మోకాళ్లమీద ప్రాకి వెళ్లాను. కళ్ళు మూసుకున్నాను

మా పెదనాన్న నా కాలర్ పట్టుకుని పైకి ఈడ్చుకెళ్లాడు. పైకి చేరుకున్నాము

"చూడు, కిందికి చూస్తూ ఉండు! లోతుల్లోకి చూడటం అలవాటు చేసుకోవాలి!" అన్నాడు.

కళ్ళు తెరిచాను. పొగ ముసురులోనుంచి ఇళ్ళ కప్పులు కనిపించాయి. పైన ఆకాశంలో మబ్బులు తేలిపోతున్నాయి కాని ఎందుకో అవే స్థిరంగా





ఉండిపోగా చర్చితోబాటు మేమంతా వేగంగా కొట్టుకు పోతున్నామనిపించింది ఒకవైపు పచ్చటి పొలాలు, మరొకవైపు సూర్య కిరణాలలో ధగధగ లాడే సముద్రం. 'సౌండ్' విస్తృత మవటం ప్రారంభించిన చోట 'ఎల్సినోర్ పాయింట్' కని పించింది. దూరాన తెల్లటి తెరచాపలు పక్షుల రెక్కలలాగ ఉన్నాయి. తూర్పుదిక్కు పొగ మంచులో నుంచి స్వీడెన్ తీరం వంకులు స్పష్టంగా తెలుస్తున్నాయి.

మూరాము చేసినా లేచి మంచుని అన్ని వైపులా పరికించవలసి వచ్చింది. ఒక గంటసేపు తల తిర గటం మానలేదు. చివరకు దిగి వీధి గచ్చుమీద కాలు పెట్టడానికి అనుమతి లభించిన తర్వాత కూడా వళ్లంతా నొప్పులుగానే ఉన్నది.

"లేవు మళ్లీ" అన్నాడు మా ప్రొఫెసర్‌గారు.

అంతవనీ జరిగింది. ఆ తరువాతి అయిదు రోజులూ ఇష్టం ఉన్నా లేకపోయినా, ఈ 'తల తిరుగుడు వ్యాయామం' చేశాను. 'అగాధాల లోకనం' అభివృద్ధి అయింది!"

9

బయలుదేరవలసిన దినం వచ్చేసింది. అంతకు ముందురోజు హెర్ థామ్సన్ ఐస్‌లాండ్ గవర్న రయిన గ్రయిఫ్ (ఒక ఒకబిదుర్) ట్రాంప్‌కి, అక్కడ బిషప్ వద్ద ఉద్యోగం చేసే హెర్ పిక్టర్సన్‌కి, రైక్ యావిక్ మేయర్ హెర్ ఫిన్‌సెన్‌కి మమ్మల్ని పరి చయం చేసే ఉత్తరాలు యిచ్చాడు. తన కృత జ్ఞత తెలిపేందుకు మా పెదనాన్న ఆయనతో కరచాలనం చేశాడు.

జాన్ రెండవతేదీ, ప్రొద్దున ఆరు గంటలకు 'ఫాల్కయిరీ' నావలో మా సామాను ఎక్కిం చాము. కాప్టెన్ మా కాబిన్ (గది) లు చూపిం చాడు.

"వాలుగాలి ఉన్నట్లేనా ?" అని అడిగాడు మా పెదనాన్న.

"ఆహా! సౌండ్‌ని వదిలే ముందు తెరచాపలన్నీ ఎత్తెయ్యవచ్చు", అన్నాడు కాప్టెన్ బ్యార్నె

కొన్ని నిముషాలలో తెరచాపలన్నీ ఎత్తివేసి లంగరు కూడా ఎత్తివేసిన తర్వాత కదిలి వెళ్లి పోయాము.

'ఫాల్కయిరీ' మంచి పడవే బొగ్గు, చిల్లర సామాను, కుండలు, ఉన్ని బట్టలు, ధాన్యం ఇవన్నీ రవాణా చేస్తోంది. మొత్తం అయిదు గురు నావికులు మాత్రమే.

"మన ప్రయాణం ఎంతకాలం ?" అని అడి గాడు కాప్టెన్‌ని మా పెదనాన్న.

"పది పన్నెండు రోజులు పట్టవచ్చు—ఇంతలో ఏ తుఫానుగాలీ తగ్గలకుండా ఉంటే."

"అయినా కూడా మరీ ఆలస్యం అవదుగా ?"

"భయపడకండి హెర్ లిడెన్‌బ్రోక్. అక్కడికి చేరుకుంటాం."

మా యిం(త్రం డెన్మార్క్ చివర వున్న 'స్కాగెన్' చుట్టి, రాత్రి 'స్కాగె(ర్రాక్' దాటాము. నార్వే చివర వున్న 'లిండెస్నెస్' కేప్ దాటి 'నార్త్' సముద్రంలోకి వచ్చాము. రెండు రోజుల్లో 'ఫారో' ద్వీపాలను సమీపించాము.

త్వరలో అట్లాంటిక్ మహాసముద్రం అలల మీద తేలుతున్నాము. కొంచెం కష్టంలోనే ఫారో ద్వీపాలు చేరుకున్నాము. ఎనిమిదవ రోజున పీటలో 'మైగ్గాన్సన్' అనే ద్వీపం చూసి 'పోర్ట్‌లాండ్' కేప్ వంక సూటిగా వెళ్లిపోయాము

నేను ఈ సముద్రయానానికి బాగానే తట్టు కున్నాను గాని పాపం మా పెదనాన్న జబ్బు పడ్డాడు. ఆయనకు తగిన శాస్తి జరిగిందను కున్నాను.

పదకొండవ రోజున 'వెస్ట్‌మాన్' ద్వీపాలను చుట్టి మరొక రెండు దినాల తర్వాత, ఒక తుఫా నులో చిక్కుకుని, రైక్ యానిక్ పట్టణం ముందు ఉన్న 'ఫాక్సా' ఖాతంలోనికి వచ్చేశాము.

పాలిపోయి బలహీనంగా ఉన్నా ప్రొఫెసర్‌గారు ఉత్సాహంగా తన కాబిన్ వదలి బయటికి వచ్చారు.

ఆ పూరుజనం నావలో వస్తువుల కోసం వచ్చి హార్బర్‌లో గుమిగూడారు.

ఇంతకాలం ఒక ఆస్పత్రి క్రింద అయిపోయిన నావను వదలటానికి మా పెదనాన్న చాలా ఉబ లాట పడ్డాడు. నావలో నుంచి దిగేముందు ఖాతా నికి ఉత్తరం వైపున దూరంగా కనిపిస్తున్న రెండు శిఖరాలు చూపించాడు. రెండిటిమీదా మంచు కప్పుకుపోయి ఉన్నది.

"స్నాఫెల్స్ పర్వతం! స్నాఫెల్స్" అని అరి చాడు

వెంటనే రహస్యం బయటపడనివ్వక అన్నట్లు నన్ను సంజ్ఞతోనే హెచ్చరించి మమ్మల్ని తీరం మీదకు చేర్చే పడవలో కూర్చున్నాడు. కొన్ని నిమి షాల తర్వాత ఐస్‌లాండ్ భూమిమీద కాలు పెట్టాము.

ఒక్క సేనాని వేసుకోతగిన యూనిఫారమ్ తొడుక్కున్న ఒక వ్యక్తి మమ్మలను సమీపిం చాడు. కాని ఆయన ఒక సాధారణమైన 'సిటీ మాజిస్ట్రేట్', ద్వీపం గవర్నర్ కౌంట్ (గ్రైఫ్) ట్రాంప్! ప్రొఫెసర్‌గారు ఆయన నెవరో గ్రహించి కోపెన్‌హాగెన్ నుంచి తెచ్చిన ఉత్తరాలు అందిం చాడు. నాకు అర్థంకాని డానిశ్ భాషలో ఇద్దరూ మాట్లాడుకున్నారు కాని నాకు తర్వాత తెలి సింది, కౌంట్ ట్రాంప్ ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్ గారికి అన్ని విధాలా 'సేవ' చెయ్యటానికి సంసి ద్ధుడుగా ఉన్నాడని

ఆపైన మేయర్ హెర్‌ఫిన్‌సెన్ కూడా మా పెదనాన్నకు స్వాగతం చెప్పారు వేషంలో ఈయన గవర్నర్‌కి ఏమాత్రం తీసిపోకపోయినా వేషానికి మాత్రం లోటు లేదు

హెర్ పిక్టుర్‌క్సన్ పనిమీద బయటకు వెళ్లడం చేత ఆయనను కలుసుకోలేక పోయాము కాని రైక్ యానిక్ ఎకాడమీలో భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ అయిన హెర్ ఫ్రెడెక్‌సన్ పరిచయం ఏర్పడింది. ఈయన మాకు ఎంతో సహాయ పడ్డారు. ఈ పండితుడికి ఐస్‌లాండిక్ లాటిన్ భాషలు అంత వచ్చు. 'హోరేస్' (Horace) ని భాషలో నాతో మాట్లాడాడు. ఇక మా ఇద్దరికీ స్నేహం కుదిరిపోయింది. నిజానికి నాతో సంభాషించగలిగిన వ్యక్తి ఐస్‌లాండ్‌లో ఇంకెవరూ లేరు.

ఆయన ఇంట్లో మూడే గదులు. వాటిలో రెండు మాకు ఇచ్చేశాడు. మా సామానంతా తెచ్చేసుకున్నాము. అంత తీసుకువచ్చిన మమ్మల్ని చూసి రైక్ యానిక్ ప్రజలు విస్మయం చెందారు.

"ఆక్సెల్, ఇంతవరకూ అంతా సవ్యంగానే జరిగింది. కష్టాలు దాటేశాం!" అన్నాడు మా పెదనాన్న.

"కష్టాలా—దాటేశామా?" అని అరిచాను.

"తప్పకుండా అంతే ననుకో. ఇక మన క్రిందు ప్రయాణం ప్రారంభించటమేగా?"

"అలాగే ననుకోండి కాని కిందికి వెళ్లిన తర్వాత తిరిగి రావాలి కదా."

"దానికేం భయపాలేదు. రా, రా! కాలం వృథా చెయ్యక! లైబ్రరీకి వెళ్తున్నాను. అక్కడ సాక్నుస్సెమ్ వ్రాతప్రతి ఏదైనా దొరుకుతుందేమో చూస్తాను."

ముఖచిత్ర వ్యాసం

13-వ పేజీలో!

"నువ్వెక్కడికి వెళ్ళు. నే నింతట్లో పూరు చూస్తూ ఉంటాను. పోనీ నువ్వు కూడా రారాదూ?"

"నాకు చూడాలని లేదు. అయినా ఐస్‌లాండ్‌లో చూడవలసింది భూమిమీద కాదు ఉండేది, భూమికింద"

నేను బయటకు వెళ్లిపోయాను.

రైక్ యానిక్‌లో ఉండేవే రెండు వీధులు. వీటిలో తప్పిపోవటం అంత తేలిక పని కాదు. ఎవరినీ దారి అడగవలసిన అవసరం లేకపోయింది— సంజ్ఞల భాషకి చాలా చిక్కులు ఉంటాయి

ఆ పూరు కిరువైపులా రెండు కొండలు. మెత్తటి పూబినేల. సముద్రం వైపున మాత్రం కొండచరియలు లాయితో కప్పబడి ఉండటంచేత కొంత రక్షణ ఏర్పడింది ఫాక్సాఖాతం, దానికి అవ తల స్నాఫెల్స్ పర్వతం చూడవచ్చు. ఆ సమ యంలో ఫాల్కొయిరీ తప్ప వేరే పడవ కనిపించ లేదు ద్వీపానికి తూర్పు వైపున ఉన్నాయని తెలి సింది.

రైక్ యానిక్ రెండు వీధులలో పెద్దది సముద్రతీరం వెంబడే నడుస్తుంది. దాని నిండా అంగళ్ళు, దిగుమతి వ్యాపారం చేసేవారి కొట్లు ఉంటాయి. ప్రతి గదిలోనూ కప్పుకి అడ్డంగా వేసిన కొయ్య దూలాలకి ఎర్ర రంగు పూస్తారు. పడమర వైపుగా ఉన్న రెండవ వీధి ఒక చిన్న సరస్సు దగ్గరకు దారి తీస్తుంది. బిషప్, వ్యాపా రులు కానివారు—వీరి ఇళ్లన్నీ ఈ వీధిలో ఉంటాయి.

ఈ రెండు వీధులూ పూర్తిగా చూసివెయ్య టానికి నాకు అట్టే కాలం పట్టలేదు ఎక్కడా పెద్ద చెట్లు కాని, పచ్చని గడ్డి కాని చూడము. రెండవ వీధిని అనుకుని శ్మశానం ఉంటుంది. దాని చుట్టూ ఒక మట్టిగోడ. దానికి అవతల గవర్నర్‌గారి భవంతి అంత బ్రహ్మాండమైన కట్టడ మేమీ కాకపోయినా ఐస్‌లాండ్‌లో గుడిసె లతో పోలిస్తే గొప్పదే అనిపిస్తుంది.

పూరుకీ, సరస్సుకీ మధ్య చర్చి కట్టారు. మంచి రాళ్లతో కట్టినా పైకప్పు పెంకులతోనే వేశారు కాబట్టి ఒక పెద్ద గాలి వీస్తే ఎగిరి పోయేట్లున్నది.

దగ్గరే ఒక కొండమీద 'నేషనల్ ఎకాడమీ' (National Academy) చూశాను ఇక్కడ హెబ్రూ, ఇంగ్లీషు, ఫ్రెంచి, డానిశ్ భాషలు నేర్పుతారని తర్వాత విన్నాను వీటిలో ఒక్క దానిలో కూడా నాకు ఏమాత్రం ప్రవేశం లేదు. అక్కడ చదువుకుంటున్న నలభై మంది విద్యా ర్థులలో ఆఖరున వచ్చేవాడిని! అసలు నా కక్కడ స్థానమే దొరికే యోగ్యత లేదేమో!

మూడు గంటలలో పూరుతోబాటు పరిస రాలు కూడా చుట్టేశాను అంతా ఎడారిలాగ ఉన్న దనిపించింది. సరియైన చెట్టు ఒకటి లేదు. ఎక్కడ చూసినా నేలలో నుంచి పైకి పొడుచుకు వచ్చే రాళ్ళు. అక్కడ ఇళ్లు గుడిసెలే అనాలి. గోడలు మట్టివి. వాటి ఉండేట్లు నిర్మిస్తారు కనుక ఇంటి కప్పులే నేలమీద వేశారా అనిపిస్తుంది ఈ ఇంటి కప్పు ఒక్కొక్కటీ ఒక చిన్న తోటను పోలి ఉంటుంది, వాటిమీద గడ్డి మొలుస్తుంది కాబట్టి. కాని మరీ ఎక్కువగా పెరిగితే మేకలు మొదలైనవి వచ్చిమేయకుండా కోసేస్తారు

నాకు మనుష్య సంచారం అధికంగా కనుపించ లేదు అంగళ్ల వీధిలో మాత్రం కొందరు 'కాడ్' చేపలు ఎండబెట్టి, ఉప్పు చల్లి ఎగుమతికి తయారు చెయ్యటం చూశాను. మగవారు భారీగా బంగారు రంగు జుట్టు ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు కనిపించారు నల్లటి ఉన్నితో చేసిన కోటు, ఎర్రటి చారలు ఉన్న లాగూలు, 'స్లిప్పర్స్' ను పోలిఉన్న బూట్లూ—ఇవి వీరి దుస్తులు

వివాహం అయిన స్త్రీలు ఉన్ని బట్టలు వేసు కుని ఉన్నారు తల చుట్టూ రంగు రంగుల రుమాలులు చుట్టుకుని ఉన్నారు అవివాహితలు ఉన్నితో అల్లిన 'బానెట్' (Bonnet) లు (టోపీల వంటివి) తొడుక్కున్నారు.

నేను హెర్ ఫ్రిడ్‌రిక్సన్ ఇంటికి తిరిగి వచ్చే సరికి మా పెదనాన్న, ఆయనా మాట్లాడు కుంటున్నారు. (సశేషం)

తపించిరి.

శ్రీవిద్యానగరరాజ్యవిద్యాధికారియైన అరుణ గిరినాథ డిండిమభట్టు శ్రీ విరూపాక్షస్వామి వసంతోత్సవమును వర్ణించుచు, 'యోగానంద ప్రహసనము' అను దృశ్యకావ్యమును సంస్కృతములో రచించియుండెను దాని నిప్పుడు వాడవాడలందును, ఎన్నెన్నో సమాజములవారు ఒకరినొకరు మించవలెనను స్పర్థతో రాత్రింబవళ్ళు ప్రదర్శించుచున్నారు కొంతమోటు హాస్యమేయైనను అది పండిత, పామర జనములకు ఎంతో వినోదము కలిగించుచుండెను. ఆయన డిండిమనాదముకంటె నిప్పుడు యోగానందప్రహసన ప్రదర్శనములు సహస్రగుణముగా డిండిముని కీర్తిని దిగంతరాళముల చాటించుచుండెను.

ఇది శ్రీనాథబృందమునకు అత్యాశ్చర్యము కలిగించెను. ఆయన డిండిమనాట్యము చూచి పండిత పామరు లసహ్యపడుచుండిరని వారు భావించుచుండిరి. ఇప్పు డాకస్మికముగా నా ప్రహసనము సర్వజనాదరపాత్రమగుట వారి కర్థము కాలేదు.

మోటుహాస్యము పండితుల నెట్లు ఆకర్షించునని ఆశ్చర్యపడవలసిన పనిలేదు సాధారణముగా విద్వాంసులు కర్మిష్ఠులై, విద్యావ్యాసంగములతో ప్రొద్దుపుచ్చుచు, శుచిగానుండి, పవిత్రజీవితములు గడపుచుండిరి. అట్టివారి కిట్టి ప్రహసన ప్రదర్శనములు ఆటవిడుపువలెనుండి, నిశితవ్రత జీవితములకు విశ్రాంతివంటిది కలిగించుచుండెను. ఉత్సవ సమయములలోతప్ప వారట్టి మోటుహాస్యము విన నిచ్చగింపకుండిరి

డిండిముని పేరుప్రతిష్ఠ లెక్కరాకుండజేయు నుపాయ మేమాయని యాలోచించి, శ్రీనాథుడు వామనభట్టబాణుని శృంగారభూషణభాణమును దానికి ప్రతికక్షిగా ప్రదర్శింప నుద్యోగించిరి. అది కూడ శ్రీ విరూపాక్షస్వామి వసంతోత్సవములలో పుట్టిన రూపకమే

భాణములో పాత్రధారి యొకడే అది ఏకపాత్రాభినయమువంటిది. అతడు ఇతర పాత్రల వాక్యము లను, "ఓహో నీ విట్లనుచున్నావా?" అనుచు ఆవలిపాత్ర కంఠమును వైచిత్రిని అనుకరించి తన యుత్తరముకాని, భావముకాని చెప్పుకొనుచు పోవును ఆవలివారు పండితులైనచో పండితుని వలెను, పామరుడైన పామరునివలెను, స్త్రీయైన స్త్రీవలెను పలుకవలెను. నత్తి, నంగి, మాట మ్రింగుట, ముక్కుతో మాట్లాడుట, కూతలు, కేకలు, బొబ్బలు, పొట్టేళ్ల ఢీకొన్న ఘోకలు ప్రదర్శింపవలెను పాత్రధారి కెంతో నేర్పు కావలెను. వారిబృందములో గురులింగమున కానేర్పు కలదు. గురులింగ మా భాణము ప్రదర్శింపసాగెను

అందలి కథావస్తు విది. విలాసశేఖరుడు నాయకుడు అతడు విద్యానగర వేశ్యావాటికలో ఉదయమున తన భోగినియింటినుండి బయలుదేరి సాయంకాలమువరకు ఆవీథిలోనే తిరుగుచు, తుదకు కామమంజరి కూతురగు అనంగమంజరి ప్రథమ రజస్వలోత్సవమున పీటపై కూర్చుండుట నేత్రానందముగా గాంచి ధన్యుడగును దానితో భరత వాక్యము! ఈమధ్య మలయవతితో సల్లాపము

కవిసార్వభౌముడు

23-వ పేజీ తరువాయి

చేసి, ఇంటి యరుగుమీద గూర్చున్న కమలవతిని వర్ణించును. తర్వాత యింటిలోనున్న మందారకుని అగ్గించును. అతడు యజ్ఞార్థము తండ్రి దాచిన ధనము దొంగిలించి ఇక్కడ మన్మథ యాగకు దీక్ష వహించినవాడు అంతట పూర్వము తన ప్రియురాలగు రత్నావలి యొసగిన తాంబూలము గ్రహించి, కనకలతా కామందకులను ప్రోత్సాహపరచును ఇందుమతి కందుకక్రీడ తిలకించి, పిమ్మట తల్లి మేడమీద నిర్బంధించిన వాసంతికను పలుకరించి, ప్రియుని పుష్పమాలతో తాడనము చేయుచున్న కలకంఠిని మందలించును. గణదత్తునికడ నృత్యము నేర్చుచున్న బాలచంద్రికను వర్ణించును అంతట డోలోత్సవమునన్నున్న మందారికా మకరందుల గాంచి మందారిక హిందోలను శ్లాఘించును. విలాసవతి అక్షద్యూతము దర్శించి మధ్యాహ్నవేళ చంద్రవతి యుద్యానవనమున విశ్రమించును. ఆ పిమ్మట పొట్టేళ్ల పందెము, కోళ్లపోరు, మల్లయుద్ధము, ప్రియురాలికొరకై ఇద్దరు విటుల ఖడ్గయుద్ధము చేయుట దర్శించి, మంజుభాషిణి గాథను పాడగా నాలకించి ఆనందించును. చిట్టచివరకు అనంగమంజరి పీటపై కూర్చుండుట చూచి జన్మ సార్థకత గాంచును—ఇది కథావస్తువు!

గురులింగము నాట్య కుశలుడు. ముందిది కొండవీటి విడిదిలో ప్రదర్శించిరి. ప్రేక్షకులెంతో సంతోషించిరి మరునాడు పాన్పుపారీ బజారులో రత్నాలచత్వరములో తిని ప్రదర్శింపగా, దశగుణముగా జనములువచ్చి చూచి ఆనందించిరి. గురులింగమిట్లే ఎన్నో ప్రదర్శనములుచేసి, వినోదము కలిగించెను. అన్నియు జనుల నాకర్షించెనుగాని అది యోగానందప్రహసనముతో తులతూగలేకపోయెను. దానికి కారణములు రెండు ప్రహసనమును ఎన్నెన్నో నటబృందము లెన్నెన్నో చోట్ల ప్రదర్శించుచుండ, నిది యొక్కచోటే ప్రదర్శించుట ఒకటి. ఈ భాణములోని శృంగారము ప్రహసనములోని నవ్వులాటలతో పోటీచేయలేక పోవుట రెండవ కారణము.

శ్రీనాథాదు లాలోచించి పర్వతమల్లును ప్రయోగింపదలచిరి అత డిక్కడికి వచ్చినప్పటినుండియు శిష్యులతోపోయి మల్లశాల లన్నియు చూచి వచ్చెను. అతని నెవ్వరు మల్లయుద్ధమునకు రమ్మన సాహసింపలేదు కాని శిష్యుల నాహ్వానించి పెక్కురు వారిచే నోడిపోయిరి! కొలదిమంది సములైరి. గెలిచినవారు లేరు అన్ని మల్లశాలలు నాతని రానిచ్చెనుగాని, విద్యామల్లు అనువాని గరిడీలోనికి రానీయలేదు. ఆ గరిడీలోనికి మల్లుల కెవరికి ప్రవేశము లేదనియు, అక్కడ నాంతరంగిక శిష్యులకు కొలదిమందికే మల్లవిద్యారహస్యములు ఉపదేశింపబడుచుండెనని తెలియవచ్చినది నగరములోని మల్లులందరు ఎట్లైన పర్వతమల్లుచే విద్యామల్లును సవాలుచేయించి ఓడింపజేసి పరాభవింపజేయవలెనను కుతూహలముతో పర్వత మల్లును ప్రోత్సహించుచుండిరి.

పోవుచుండగా, వారిని పర్వతమల్లు నిశితముగా పరీక్షించెను. విశేషమేమియు కనబడలేదు. జనము అన్ని మల్లశాలలలోనివారును విద్యామల్లు శిష్యులను గెలిచినవారు లేరని చెప్పువారే. రహస్యముగా చిన్న ఆయుధములు దాచుకొందురో, ఏమైన మోసము చేయుదురో ఏమోగాని, వారితో తలపడినవారెంత బలవంతులైనను ఓడిపోవుటేకాక, మరల జన్మలో మల్లయుద్ధములకు పనికిరాకుండ పోవుచుండిరి పోరికి పూర్వము వారి సర్వాంగములు పరీక్షించి మధ్యవర్తిక్షేత్రములలో జరిపినను లాభములేకపోయినది.

అన్నియు నాలోచించి పర్వతమల్లు తన చివరి శిష్యునిచే విద్యామల్లును సవాలు చేయించెను అతడు ముందు తన శిష్యుని జయింపుమనెను ఇద్దరి శిష్యులకును చైత్రశుద్ధ సప్తమినాడు మల్లయుద్ధము నిశ్చయించిరి ఏబది సువర్ణములు పందెము.

ఆ మల్లపోరు చూచుటకు నగరములోని అన్ని గరిడీలవారు వచ్చిరి వారే వేయిమంది యుండిరి. ఇతర జనములు వేలకొలది వచ్చిరి. పర్వతమల్లు శిష్యునిముందు విద్యామల్లుశిష్యుడు ఏనుగుగున్నముందు తట్టుగుఱ్ఱమువలె కనిపించుచుండెను. విరివిగా పై పందెములుకాయుట సాగుచున్నది.

మల్లుర నిద్దరిని మధ్యవర్తులు పరీక్షించి గోదాలో వదలిరి పోరుకు సంజ్ఞ యిచ్చిరి. చేతులు కలసిన మరునిమేషములోననే విద్యామల్లు శిష్యుని పర్వతశిష్యుడు ఎత్తి గోదాలో పడవేసి, మీది కెక్కి పీటుచేయుటకు పెనగులాడుచుండెను. ఆకస్మికముగా పర్వత శిష్యుని కుడి బాహువులో విపరీతమైన నొప్పిపుట్టి చచ్చుపడుచుండగా గిపెట్టెను తర్వాత ఎడమచేయి అవశమైనది. అతడు గీపెట్టుచునే తన రెండుకాళ్ళతో నదిమి. పట్టువదలక, భయంకరముగా చిత్తుచేయుటకు యత్నించుచుండెను అంతలో నాతని ఎడమకాలు కూడ చచ్చువారగా పట్టువదలి ప్రక్క కొరగెను. వెంటనే విద్యామల్లుశిష్యుడు సింహమువలె పై కెగసి అవలీలగా ఏనుగుగున్నవంటి తన ప్రత్యర్థిని పీటుచేసెను. పర్వత శిష్యుడు గోదాలో మూర్ఛ నొంది మాటలేక పడిపోయెను.

ప్రేక్షకులందరు "అన్యాయము! మోసము! రహస్యాయుధములకై వెదకండి!" అని ఒక్కపెట్టున కేకలువేసిరి. విద్యాశిష్యుడు చేతులెత్తి చూపెను. తన టోపీలోనున్నదనగా అది తీసి చూపెను. కట్టిన ధట్టిలో దాచినాడని కేకలువేయగా, అతడా ధట్టియు వూడదీసి దిగంబరుడై నిలుచుండి పరీక్షించుకొనుడనెను గోదా మట్టిలో పారవేసినాడని ప్రేక్షకు లరచిరి మధ్యవర్తులకును ఆ సందేహమే కలిగి, గోదామట్టి కుళ్ళగించి జాగ్రత్తగా వెదకిరి. ఏమియు లేదు విద్యామల్లుశిష్యుడు న్యాయముగానే గెలిచినాడని ప్రకటించిరి. గరిడీలవారు తమ కన్నులు తామే నమ్మలేక "ఎప్పుడూ ఇంతే" అనుచుండిరి.

పర్వతమల్లు నోట మాట పెకలలేదు. ఎట్లో ప్రయత్నించి ఈమారు తన పెద్ద శిష్యునిచే సవాలు చేయించెను ఈమారు విద్యామల్లు పెద్ద శిష్యుడు ప్రత్యర్థి. పణము నూరు సువర్ణములు. పోరికి తిథి వారములు నిర్ణయించుకొనిరి

... శ్రీనాథునకు చెప్పదలపలేదు కొండవీటివారి అతిశయము విద్యానగరములో ప్రకటించుటకు మల్లు నను ప్రయోగింపదలచిన శ్రీనాథుడు వారలగూర్చి విచారణ చేయగా, ఆ రాత్రికే ఆ యశుభవార్త తెలిసినది. వెంటనే శ్రీనాథుడు మల్లుడుకొనగిన శాలకు స్వయముగా వెళ్ళెను

తత్తరముతో పర్వతమల్లు వచ్చి నమస్కరింపగా, శ్రీనాథుడు ములుకులవంటి చూపులతో నాతని వేధించుచు, "మల్లూ, ముందుగా నా కెందుకు చెప్పలేదు?" అని గర్జించెను.

"ఇది నా విద్యకు సంబంధించినది కనుక తమతో మనవిచేయ నక్కరలేదనుకొంటిని ప్రభూ !"

"నీకు దేహమే బలిసినదికాని మతి శూన్యము. కండబలము పనికిరాదు. ప్రాయశ్చిత్తమైనది నీ శిష్యుని ఓటమితో, నే నోడినట్లయినది కొండవీటిరాజ్యమే నోడినది. ప్రభువులు, సర్వజ్ఞ సార్వభౌములే పరాజితులైనట్లని గమనించినావా?"

"లేదు. క్షమింపవలెను!"

మూర్ఛనొందిన శిష్యుని శరీరమును శ్రీనాథుడు పరీక్షించి నాడులు చూచి, "నే నిప్పుడు చూడనిచో, వీడు తెల్లవారువరకి మరణించియుండును" అనుచు మతి ... చివా... పెట్టి, తన మందిరము నుండి ఔషధమ ... తెచ్చి, ...తనతో వచ్చి, అక్కడ నుండి తక్కిన వారిని ...పివేసెను ముందొక ఔషధము వాడి ఆ మల్లునికి స్మృతి కలిగించెను. అతని కెక్కడెక్కడ ఎక్కువ బాధగా నున్నదో విచారించి, అక్కడ కోతన అమృత హస్తముచే అంజన మొకటి మర్దింపజేసి, సుఖనిద్రపోవుటకు ఔషధము త్రావించెను. అప్పుడు పర్వతమల్లును కావిచ్చి ఆ రాత్రికి లోగి నెవ్వరు పలుకరింపవద్దని శాసించెను.

మరునాటి యుదయమున శ్రీనాథుడు రోగిని చూచుటకు రాగా, చిత్రముగా నా మల్లుడు, "నే నోడిపోలేదు నిన్నిదుగో పేటు చేస్తాను" అని రోజాచు చిప్పునలేచి, ఎదుటనంగియున్న శ్రీనాథునిపై ప్రతి మల్లుడను భ్రాంతితో కలబడబోవుచుండెను. పర్వతమల్లు తన బాహు బంధములో నాతని బంధించి పరుండబెట్టి, ఏకధారగా కన్నీరు కార్చసాగెను. శ్రీనాథుడు పకపక నవ్వుచు, "ఇతని కీరోజు కడుపు నిండా గోక్షీరము పరిశుద్ధ జలము ఇమ్ము. రేపటి నుండి గోదాలోకి పోవుటకు తయారు తినవచ్చును" అనుచు వెడలిపోయెను

ఆ మల్లుడు నాలుగురోజులకే నగరములోని గోదాలను దర్శింపబోగా, ప్రతిచోటను అతని నాదరించువారే చనిపోయినవాడు బ్రతికివచ్చినట్లుగా నాతనిజూచి వా రాశ్చర్యానందములు ప్రకటించిరి అంతకుముందు విద్యామల్లు శిష్యులను పడవేసినవారే అరుదు చచ్చుపడిన బాహువులు కాళ్లు బాగుపడుటకాని, మూర్ఛ నొందినవారు బ్రదుకుటకాని వారెరుగరు ఓడిపోయినందుకు అనాదర మేమాత్రము చూపక స్వస్థుడై బ్రదికినందుల కభినందించుచుండిరి.

తన పెద్ద శిష్యునకు విద్యామల్లు శిష్యునకు ప్రా... ముందు చెప్పుటకు సాహసింపలేదు. పోరు తగ్గిర పడుచున్నందున చెప్పక తప్పదని ఒకనాడు పోయి నివేదించెను. శ్రీనాథుడు మండిపడి చీవాట్లు పెట్టెను పదిరోజులు గడువు తీసికొమ్మని శ్రీనాథు డాదేశించెను.

"ప్రభూ, కుస్తీకి గడువు కోరినచో ఓడిపోయినట్లే—నా ప్రాణము పోయినట్లే!"

"అయితే నీ శిష్యుని ప్రాణములు తీయింతువా"

"మా గౌరవముముందు నా శిష్యుల ప్రాణము లును, నా ప్రాణములును తృణప్రాయములు."

శ్రీనాథుడు : "నీ ప్రాణములు, నీ శిష్యుల ప్రాణములు నీ చేతులలోలేవు పేము ప్రభువులు మా కప్పగించినారు. నీవుగాని, నీ శిష్యులుగాని నా యాజ్ఞలేనిది మన పనతి గడపదాటరాదు—నేను కబురంపువరకు నీ ముఖము నాకు చూపకు, పో!"

పర్వతమల్లు చిన్నబుచ్చుకొని తన శాలకుబోయి

"ఏమిటల్లా ఉన్నారు?" అని అడిగాడు ఒకాయన రామారావుగారిని,

"మా ఆవిడ ముప్ఫైరోజులు మౌనవ్రతం వహించింది." రామారావు విచారంగా అన్నాడు.

"ఇంకేం మరీ మంచిది! దీనికి విచారం దేనికి?"

"ఇవ్వాళ్ళ ఇరవై తొమ్మిదవ రోజు."

వి. యస్. యస్.

దినముగా శిష్యులకు ప్రభువుల యాజ్ఞ తెలిపెను.

ఇట్లే శ్రీనాథుడు చైత్ర శుక్లపక్షమంతయు చిరాకుగా నుండెను వినుగు కోపము తొందరపాటు ప్రదర్శించుచు చిరుబుర్రులాడుచుండెను. నృసింహభట్టు తప్ప తక్కినపండితులు కూడ నాతనికి దూర దూరముగా మెలగుచుండిరి

ఆకస్మికముగా చతుర్దశినాటికి శ్రీనాథుని ముఖలక్షణము సౌమ్యత వహించెను స్థానాపతి కరణము బాచప్పను పిలిపించి, యాత డిట్లాజ్ఞాపించెను : "రేపు మూడు జాముల వేళకు మన విడిదిలో కవితాగోష్ఠికి ఏర్పాట్లు చేయింపుము. శ్రీ విద్యానగరములో నున్న ద్రావిడ కర్ణాట మహారాష్ట్ర, పారశీక మళయాళాంధ్రాది భాషా కవుల నందరిని రావింపుము. పండితులతోగాని, పండిత కవులతోగాని పనిలేదు. కేవల శాస్త్ర చర్చలతో తలలు పట్టుకొని రసము గ్రహింపలేని వారిని పిలువవద్దుసుమా. ముమ్మకవిని మాత్రము పిలు!"

బాచప్పను పంపివేసి పర్వతమల్లును రమ్మని వచ్చెను. అతడు దిగులుతో చిక్కి సగమై, రెక్కలు తెగిన కొండవీటి కొండవలెనే యుండెను.

"మల్లూ, నీ శిష్యుని కుస్తీకి గడువు ఎన్నాళ్ళున్నది?"

"నాలుగు రోజులే, ప్రభూ!"

"ఆ రోజాతనికి జ్వరము వచ్చినచో పోరు సాగునా?"

"నిజముగా జ్వరము వచ్చినదని మధ్యవర్తులు చూచి తృప్తిపడినచో, మల్లపోరు గౌరవహాని లేకుండ వాయిదా పడవచ్చును మధ్యవర్తులు మల్లునకు తీవ్రమైన జబ్బుచేసినదని ప్రకటించిన తర్వాత, ప్రతి వీరుడు కుస్తీ జరుగవలెనని పట్టుపట్టినచో మధ్యవర్తులు అతనికి పందెపు ధనమిప్పించి అతనిపై ఉమిసి "నీవు గెలువలేదు' అని పంపివేయుదురు. ఆ పరాభవమున కిచ్చగింపక వాడు వాయిదాకే అంగీకరించును"

శ్రీనాథుడు : "నీ పెద్ద శిష్యుడనగా గండమల్లేనా? వానికానాటి మధ్యాహ్నమునకు గజజ్వరము వచ్చును. అర్ధరాత్రివరకు తగ్గదు. పది రోజులు గడువు తీసికో! గెలుచునులే పో!"

పర్వతమల్లు తీరని హృదయవేదనతో సెలవు తీసికొనెను.

ఆ మరునాటి యపరాహ్ణవేళ శ్రీ విద్యానగరములోని కేవల కవులందరు ఒకరొక్కరే కొండవీటి విడిదికి చేరుకొనసాగిరి వారెక్కువ భాగము యువకులు, శాస్త్ర వాసనలు గిట్టనివారు హృదయములో నుండి పొంగివచ్చు కవితావేశమును అప్పటికి స్ఫురించిన భాషలో వారు ప్రకటింతురు. వారి కావ్యములును, వారి వేషములు రూపములవలెనే, అవ్యక్త మధురములై వింత వింత రుచులీనుచుండెను. వారు ఏవరికవనము వారే పందలపర్యాయములు పఠించి ఆనందించువారుకాని, ఇతరుల రచనలు పఠించిన చోపమున పోయినవారుకారు. ఇతర కవులు కావ్యగానము చేయునప్పుడు, హృదయమునకు హత్తించుకొనకయే, అతిశయోక్తులతో శ్లాఘించుచుందురు. తమ కావ్యము పఠించునప్పుడు మాత్రము, శ్రోతలందరు దాని నిరుపమాన నిర్విశేష సౌందర్యమునకు ముగ్ధులై ఆలకించుచున్నారని తలచుచు, దాని రసమునకు తామే తన్మయులై, బహు విధాభినయములతో ఎడ తెగకుండ వినిపింతురు.

ఆ కవి కోకిలల కందరికి ముమ్మకవి గురుతుల్యుడు ఆతడు బహుశాస్త్రవాసనలు కలవాడైనను, సాహిత్యవ్యాకరణములలో తప్ప, గట్టి ప్రవేశము లేదు. ఎక్కడ ఏ మాత్రము గుణలేశము కానిపించినను దానిని పొగడుట యాతని కభ్యాసము. తన కవిత్వ మెప్పుడోకాని వినిపింపడు. అతనిని పేరుతో కాని, వారు నిజమైన కవిగానే భావింపరు. ఐనను గౌరవముతో గురుదేవా, గురూజీ యని తప్పనంభోదింపరు.

ఇట్టి చిత్ర చిత్ర ప్రకృతులు గల బాహుభాషాకవుల కవితాగానతరంగములతో ఆనాటి కవితాగోష్ఠి అపూర్వశోభతో రాణించెను. వారల కావ్య రసముకంటె శ్రీనాథుని పరివారము మాటిమాటికి వారి కందించుచు వచ్చిన తెరకు పాన

...గా నుండెను. నృసింహభట్టు అప్ప తక్క ... మరి పండితు లెవ్వరు అక్కడలేరు. పోతన దుగ్గన లుండిరి. ముమ్మకవితో నారనప్ప కూడ వచ్చెను.

చీకటి పడినది. దీపములు వెలిగించిరి. గోష్ఠి సాగుచునే యుండెను ముమ్మకవి శ్రీనాథుని తన పద్యములేమైనా క్రొత్త వున్నచో వినిపింపుమనెను.

గోష్ఠిలోని కవులందరు నిట్టూర్చిరి. పోర్చు తిరుగని పద్యములు వినవలసి వచ్చునుగదా, భగవంతుడా యనుకొనిరి. మధురపానీయము లిచ్చినందుకు కృతజ్ఞతయైన చూపవలెగదా యనుకొనుచు, అవి విను దురవస్థకు సిద్ధపడిరి

శ్రీనాథుడును వారితోపాటు యువకుడై వచ్చె, ముగ్ధ మనోజ్ఞ లజ్జతో ఎర్రవారిన ముఖముతో, సర్వాంగములు కుంచుకొని పోవుచుండ ముందిట్లు ప్రారంభించెను

"ఈమధ్య మా యాత్రా మధ్యములో ఉటుకు రోశై విరూపాక్షదేవుని స్మరించుచు, కావ్యము వ్రాసి, దానికి మానసోల్లాసమని నామకరణము చేసితిని మీబోటి సహృదయులు విని ఆనందించినచో, కృతార్థుడ నగుదును సంస్కృత భాష కమక మీ కందరికి తెలియును."

అంతట రంగు రంగులతో నలంకృతములైన చెక్కలలో బిగింపబడి, మనోహర చిత్రములు చిత్రించియున్న తాళపత్ర గ్రంథ మాతడు మరింత సిగ్గుపడుచు చేతులలో గ్రహించి, వ్యాసపీఠముపై నుంచి పూజించి, వినిపింప నారంభించెను. పదములు సంగీతములో తరిసిపోవుచుండెను.

ప్రతిశ్లోకమును ఎవరో కొందరు కవులు మెచ్చుకొనుచుండిరి. ముమ్మకవి మాత్రము మౌనము వహించెను. ఎదుటున్న కలదయు నాతని ముఖము వివర్ణమగుచున్నదని క్రీగంట చూచుచున్న శ్రీనాథుడు గ్రహించి, మరి మరి పద్యములు వినిపించెను.

విని విని ముమ్మకవి ఆనందము ప్రకటించుచు, "శ్రీనాథభట్టా, నీ తాళపత్రగ్రంథము ఎంత అందముగా ఉన్నదయ్యా! దాని చెక్కలు, దాని పత్రములు, అందులోని చిత్రములు, ముత్యాల కోవవంటి దస్తూరీ, నీ మధుర మనోజ్ఞకంఠము అన్నీ నీ విచ్చిన పానీయములవలెనే హృదయంగమములుగా ఉన్నవయ్యా! చాల సంతోషమాయె! ప్రొద్దుపోవుచున్నది. సెలవు తీసుకొందును" అనెను.

ఆయనతో తక్కిన వారును బయలు దేరిరి. శ్రీనాథు డందరికి కృతజ్ఞత తెలిపి తాంబూలము లిచ్చి సాగనంపెను.

ఇడిదికి తమ మాటలు వినబడనంతటి దూరము పోయిన తర్వాత వారి నోళ్ళు ఒక్కొక్కటే విప్పుకొనసాగినవి. "గురూజీ, శ్రీనాథభట్టు విద్వాంసుడంటిరే—అదేమిటి, అన్ని వ్యాకరణదోషములు చేసినాడు!— వర్ణముక్కలను సరిగా ఉచ్చారణయే చేయలేక పోయెనే—ఇటువంటివాడేనా డిండిమములతో వాదించేది!—సామాన్య జ్ఞానము గల మాకే ఇన్ని దోషములు కనిపించినవే—గురూజీ, ఆయన ఎన్నో శాస్త్రములో పండితుడన్నారు— గురూజీ కూడా ఎన్నడూ లేనిది పొరబడ్డట్లున్నారే! ... శ్రీనాథభట్టుకు ఒక్క విషయంలో పాండిత్యమున్నది" అవగానే, ఒక్కొక్కరే అందుకొని, "గోష్ఠి మందిరము ఎంత చక్కగా అలంకరించాడు!—అక్కడ ఆసనాల ఏర్పాటు ఎంత బాగున్నది!— మన కిచ్చిన ఫల రసాలు ఎన్నెన్ని చవులూరుతున్నవి—వాటిలోని మాధుర్యములోని శతాంశమైనా ఆయన కవిత్వంలో ఉంటే, ఎంత రాణించేది!—" అని ఎకసెక్కము లాడసాగిరి.

ఆ పూర్ణిమనాటి వెన్నెలలో, శ్రీ విద్యానగర రాజవీథులలో, నానావిధముగా బిగ్గరగా శ్రీనాథకవి అపాండిత్యమునుగూర్చి పకపకలాడుచు, పరిహాసము లాడుచుండగా, వయస్సువలన పోకనలో కలియక పోయినను, ముమ్మకవి కూడ మొత్తముమీద వారితో నేకీభవించెను ఆ రాత్రి వీధులలో జరిగిన ప్రసంగములవలననేమి, మరునాటినుండి ఆ గోష్ఠిని గూర్చి తమ మిత్రులతోడను, పరిచితులతోడను వారు పలికిన మాటలవల్లనేమి, చైత్ర బహుళారంభకాలమునకు శ్రీనాథుడు వ్యాకరణాలంకారశాస్త్రము తెలియురాని నీరసకవి యను ప్రథ శ్రీ విద్యానగర నాగరకు పండితలోకమందెల్లెడల వ్యాపించెను. లింగనచయనుల అతిరాత్ర క్రతువులో ప్రథితమైన క్రొత్త పాండిత్యమువలన, "ఇతడు వట్టి ఛాందసుడు" అను పేరు కూడ ప్రాకి, ఆ ప్రథను బలపరచెను. "పాపము, శ్రీనాథభట్టు నోరు మంచిది!—పాపము వేషము బాగుండును!— పాపము, స్ఫురద్రూపి!—" అందరు నాతని కవితా ప్రతిభపై జాలి చూపువారే! (సశేషం)

మో కొన్ని ఇంజక్షనులు ఇచ్చింది. కాని ఫలితం కనిపించలేదు. నా భార్యను ఇంకో డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాను. మందులు వ్రాసిచ్చాడు. నాకు మందులు రు. 60 — దాకా అయ్యాయి. సీసం నా భార్య నేను ఇచ్చిన మందులన్నీ పుచ్చుకుంటూనేవుంది. అయినా ఫలితంలేదు. చివరకు ఆడపిల్లను ప్రసవించింది. ఆ బిడ్డ ఎండుకుపోయి పుట్టింది. మూడేళ్ళుదాటినా నడకరాదు, పలకలేదు. ఆ శిశువు గర్భంలో వుండగా నా భార్య తీసుకున్న ఇంజక్షన్లు, మందుల ఫలితమేనని నేను చాలా బాధపడ్డాను. ఆ పసికూన జీవితాన్ని నాశనం చేశానని ఆవేదన పొందాను. ఏమైనాసరే శస్త్ర చికిత్స పొందాలని నిశ్చయించుకున్నాను. చికిత్స ఇంజక్షనుకన్న ఎక్కువ బాధ అనిపించలేదు. మా ఆఫీసువాళ్ళు రు. 25 —నాకు ఇచ్చారు. ఇప్పుడు నేను నా భార్య ఆనందంగా వుంటున్నాం. కానీ మా కడగొట్టుపిల్ల

కుటుంబ నియంత్రణం

19—వ పేజీ తరువాయి

కోలుకోటానికి ఎంతకాలం పడుతుందో అనేదే నా బాధ."

సంతాన నిరోధక శస్త్ర చికిత్సవల్ల బహిష్టు ఆగిపోతుందా ?

హంసాబాయ్ : : 'మా ఆయన టాంగాతోలేవాడు. ఆటోరిక్షాలు రావటంవల్ల టాంగాల గిరాకీ తగ్గిపోయింది. దీనికితోడు మా ఆయనకు ఆస్త్మా వుండటంవల్ల రోజుల తరబడి సుస్తీగా వుండేవాడు. నేనూ కొద్దిగా కాయకష్టం చేయాల్సి వచ్చేది. రోడ్డుమీద కూరగాయ లమ్ముతూ కొంత ధనం సంపాదించేదాన్ని. ఒక రోజున మా పిల్ల లిద్దర్నీ గుడ్డ లసహ్యంగా వున్నై బడికి రావద్దని ఇంటికి పంపించారు. సరిగా తిండి పెట్టేందుకు నాకు గతిలేకపోతే వీళ్ళకు మంచి గుడ్డలు ఎక్కణ్ణుంచి తెచ్చేది? పైగా అతని కాన్పు రోజులు! కె. ఇ. ఎం. ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణకుగాను శస్త్ర చికిత్స చేస్తారని తెలిసింది. అక్కడికివెళ్తే మీ ఆయన ఒప్పుదల తీసుకొస్తేనేగాని, చేయటానికి వీలులేదన్నారు. మా ఆయన మొదట ఒప్పుకోక పోయినా, చివరకు ఒప్పించి పత్రంపై సంతకం చేయించుకొచ్చాను. ప్రసవానంతరం నాకు శస్త్ర చికిత్స చేశారు. 11 వ రోజున ఇంటికివెళ్ళి మామూలు ప్రకారం వంటా, వార్పు, ఊడ్చటం చేసుకో గలిగాను. మూడు వారాల తరువాత మిక్కిలి బరువైన పళ్ళ, కూరగాయల బుట్టలు కూడా మోసుకు పోగలిగాను ఈ చికిత్సవల్ల నా కెటువంటి ఇబ్బంది కలగకపోగా, నా ఆరోగ్యం బాగా అభివృద్ధిపొంది యథాప్రకారంగానే సకాలానికి బహిష్టవుతూ వున్నాను. అవి వస్తాయో రావో అన్న సందేహం కూడా నాకు లేదు." ★

"ఎన్ని సంగనాదివేషాలు వేసినా అసలు సంగతి మీకు తెలుసునని చరిత్రకారుడు పసిగట్టక మానడు. ఆ తరువాత .... నాకేం—నీమీదే బోలెడన్ని దుర్మ్రు ద్రాలు వేసేస్తాడు, మోసగత్తె అనే విశేష ణంతో ప్రారంభించి."

"ఎవడా పెద్దమనిషి ?"

"రామ రామ ! మరీ అలా మాట్లాడకు సుభా ! ఏదరయినా వింటే పవిత్ర భారతస్త్రీ దిగజారి పోయిందని ఆత్మహత్య చేసుకోగలదు."

"మంచిదేగా ? మీ డాక్టర్ల పని తేలికవుతుంది.' సంభాషణ అలీరున కొండలూ, అడవులూ పట్టి సాగిసాగి చివరికి మళ్లీ మొదటిచోటుకి జేరు కుంది. చక్రపాణి మళ్లీ అడిగాడు : "నీ ముద్దుం మరిది ఇందిరను ప్రేమించడానికిగల కారణం లేమి ?" అని.

సుభద్ర కూడా ఆ ప్రశ్న తనను తాను వేసు కుంది. నిజమే మరి. "అప్సరస"ల్లాంటి అడ పిల్లలు అతనితోబాటు కాలేజీలో చదువుతున్నారు. వాళ్ల విషయం సరసటున్నైనా అమాటకొస్తే కలలోనయినా తలచినవాడు కాదు రాజా. ఈ ఇంది రను చూశాక దాదాపు పెర్రివాడయిపోయాడు. ఆ అమ్మాయి కనుముక్కుతీరు బావుంటుంది. రెండు జెడలు వేసుకుంటుంది. హిందీ చదువు తోంది కాని ఆ విషయాలవల్ల రాజా ఆకర్షింప బడలేదు. ఆమె సౌందర్యం వెనుక నిక్షిప్తమయి ఉన్న కోమలమైన హృదయం, ఆత్మగౌరవం, మాటల్లో గాక చేతల్లో త్యాగం ప్రదర్శించగల ధీరగుణం ఆమెకున్నాయి. ముక్కుపచ్చలారని పదహారేళ్ల పిల్లలో అంతటి ఉదాత్తత ఉండటం అపురూ పమే. అంతేకాదు. ఆ తండ్రి ఆమెకు కన్నబిడ్డలా ఉంటాడు. నిజమే. ఆమె సౌందర్యవతిగా గొప్పది కాకపోయినా మానసంలో మహారాణివంటిది.

ఆవిషయాలే చెప్పింది సుభద్ర భర్తతో.

"అయితే ఆ అమ్మాయి నీకూ నచ్చిందన్న మాట ?" అన్నా డతను

"అక్కడికి మీకు నచ్చనట్లు"

"క్షమస్వ పరమేశ్వరి ! రేపు సాయంత్రం సూర్యారావుగారితో మాట్లాడతా నన్నానుగా ?"

పకపక నవ్వింది సుభద్ర.

* * *

చక్రపాణి ఆ పర్ణకుటీరం లాంటి తోటలోకి అడుగుపెడుతూనే మొక్కలకు పాదులుచేసి నీళ్ళ పెడుతున్న సూర్యారావుగార్ని చూశాడు ఆయనా ఇతడిని చూసి "మీరా డాక్టరుగారూ ? రండి రండి" అన్నాడు సాదరంగా. మొక్కలన్నా, పువ్వు లన్నా అమితమయిన సరదా అతనికి. అందుకు తోడు ఆరోజు తీరిక కూడా అవటాన ఒక్కొక్క మొక్కనంగాతే ఆ డి గి చెప్పించుకున్నాడు చక్ర పాణి నిరాడంబరంగా, అందంగా ఉంది ఆ చిన్న తోట పూలమొక్కలూ, కాయగూరల మొక్కలూ అన్నీ జీవంతో నవనవలాడుతున్నాయి. అన్నీ చూశాక "అంతాబాగానే ఉంది గాని ఈ గడ్డిపూలు ఎందుకు పెంచుతున్నారు ?" అన్నాడు చక్రపాణి వాటి ద్వారా రోగక్రిములు పీకుతున్నాయని అతను విని ఉన్నాడు.

[illegible] కథ

17–వ పేజీ తరువాయి

"అనారోగ్యకరమయినవే కావచ్చునని చక్ర పాణిగారూ ! కాని అనారోగ్యం కలిగిస్తాయని తెలిసి కూడా తమాయనిక ఎరువుల్ని ఎందుకు పెరగ నిస్తున్నారు ?"

"అందుకు కాకపోయినా .... వాటిలో అందం ఏముంది చెప్పండి ? యావద్భారత ఖ్యాతి సంపా దించిన చిత్రకారులు కదా మీరు ?"

సూర్యారావుగారు నవ్వాడు. "ఖ్యాతి రావడానికీ దానిని పెంచడానికీ కారణం ఒకటే చక్రపాణి గారూ ! అది నాలోని సౌందర్యపిపాస. సౌందర్యా నికి హద్దులూ, తేడాలూ లేవు. ఉన్నాయనుకోవటంలో గల ఆత్మవంచన స్వార్థమూ మానవుడ్ని అధః పతితుడ్ని చేస్తున్నాయి. లేకపోతే ఈ అణ్వస్త్ర నిర్మాణానికి అర్థం ఏమిటి ? కొన్ని రహస్యాలు అలా ఉండిపోవటంలోగల అందం తెలిసినతరు వాత నశించిపోతుంది. ఆ నాశనం ఆత్మ వినాశా నికి దారితీస్తుంది" అన్నాడు.

చక్రపాణి మాట్లాడలేదు.

రోగి:- డాక్టరుగారూ! నేనింకా ఎంతకాలం బ్రతుకుతాను.

డాక్టరు:- పరవాలేదు! నామందు పనిచెయ్యడం మొదలు పెట్టేదాకా బ్రతుకుతావు.

సి. మల్లి ఖార్జునరావు (కాకినాడ.)

"ఇహ ఈ గడ్డిపూల సంగతి అంటారా ? వాటి వెనక ఒక దీనమయిన గాథ ఉంది. ఆ గాథకూ నా నేటి జీవితానికీ సంబంధం ఉంది ఆ సంబంధం నా జీవితాంతమూ ఉండవలసిందే. నా బాధ్య తలు గుర్తుతేవాలిసిందే."

చక్రపాణి కించిత్ చకితుడై "గాథా ?" అన్నాడు.

"ఊఁ ! వింటారా ?" సూటిగా అతని వంక చూస్తూ అడిగాడు సూర్యారావుగారు

చక్రపాణి తల ఆడించాడు.

సూర్యారావుగారు మన్నయిన చేతులు కడు క్కుని మొక్కలమధ్య ఒత్తుగా పెరిగిన పచ్చిక మీదకు దారితీశాడు

ఇద్దరూ కూచున్నారు

"నాకు ముప్ఫయి సంవత్సరాల వయసు ఒచ్చిం దాకా, యుక్తవయసు వచ్చిననాటినుంచీ 'చిత్ర కళారాధనే' ముఖ్యాశయంగా ఉండేది ప్రతి దినమూ సాయంత్రంపూట గోదావరి తీరానికి పోయి చూస్తూ కూచునేవాడిని ఆ అలలలో, సుడు లలో నాకు చిత్రాలకు వలసిన వస్తువులు లభిం చేవి. నాకు ఖ్యాతిని, అహంకారాన్నికూడా తెచ్చి పెట్టింది చిత్రించగలిగాను.

మా కుటుంబం ఆర్థికంగా పై అంతస్థులోది కాకపోయినా జీవనానికి ఒకరికి దాసోహం మనవల సిన అవసరం ఏనాడూ కలగలేదు. నా భార్య కూడా నా కృషికి ఎంతో ప్రోత్సాహమిచ్చేది. మా దాంపత్యం అన్యోన్యమయిన అనురాగపూరితమయి నది.

ఒకనాడు మామూలు ప్రకారం గోదావరి తీరా నికి వచ్చాను. మామూలుప్రదేశంలో ఒంటిగా కూచుని నిండుగా ఉరకలతో, నురుగులతో ప్రవ హిస్తున్న ఆమెను చూస్తూ నాలో కలుగుతూన్న ఆవేశానికి రూపం కల్పించుకో నారంభించాను. ఆ స్థితి చివరికి నా హృదయంలో, యువ్వన ప్రాదు ర్భావంలో సౌందర్యవిలసిత అయిన యువతి చిత్రాన్ని ప్రతిష్ఠించింది. అవును! అదే ఆవేశం ! అదే తొందర, అదే అనిపించింది. నా ఆనందానికి హద్దులు లేవు. దిగ్గున లేచి ఇంటికి బయలుదేర బోయాను

అప్రయత్నంగా ఆగిపోయాను.

అసమయాన చీకటి పడిపోయింది. వాహ్యాళికి వచ్చినవారిలో చాలామంది ఇళ్లకు వెళ్లిపోయారు. ఒక స్త్రీ మాత్రం వడివడిగా నీటివద్దకు వెళుతూ కనిపించింది. ఆ నడిలో అసహజమయిన అశాంతి నియమయిన తొందర అగుపించింది నాకు. ఆమె అలాగే వెళ్లిపోతోంది. నేను అచేతనంగా ఉండలేకపోయాను. రెండు అంగల్లో అక్కడికి జేరుకున్నాను. నదిలో దూక బోయిన ఆమెను ఆపి "ఏమిటమ్మా ఈ పని ?" అన్నాను గద్దింపుగా. ఆమె భోరుమని నా పాదాల వద్ద వాలిపోయింది. నయానా భయానా ఆమెను ఊరడించేసరికి పావుగంట పట్టింది. ఆమె గాథ నాకు ఆమె వివరించకుండానే అర్థమయింది. అసమయాన ఆమె నిండు చూలాలు. స్త్రీని దేవ తగా పూజించే ఈ దేశంలోని ఒక యువకుడు ఆమెను అవహాస్యానికి పాడుకుని వదలివేశాడు. యువ్వనపు ఆవేశం నాలో కట్టలు తెంచుకుంది. ఆమె జీవితాన్ని చక్కదిద్దాలనే అభిలాష పొడ కుంది ఆమెను నాకు తెలిసిన ఆసుపత్రిలో జేర్పించి ఆమెవద్దనుంచి వీలయినంత సమాచారం సేకరించి అన్వేషణ ప్రారంభించాను.

రెండురోజులు గడిచాయి

ఆ రెండు రోజులూ ఆ అమ్మాయే ఆలాపన అయిపోయింది నాకు మనసు కలతజెందిపోయింది. మూడవరోజున ఆమెను చూసి ఆసుపత్రినుంచి యింటికి జేరుకున్నాను బయట గదిలో నా బావ మరిదీ అత్తగారూ కన్పించారు నన్ను చూసి ముభావంగా పలకరించి ఊరుకున్నారు ఆ కొత్త రకం సంఘటన నాకు విస్మయం కలిగించింది. లోపలకు వెళ్లి నా భార్యను అడిగాను. ఆమె తీరూ అలాగే కనపడింది నా కిదేమీ అర్థం కాలేదు. నిగ్గదీసి అడిగేసరికి "లీల ఎవరు ?" అన్నది దిగ్భ్రాంతుడ్నై "ఎందుకు ?" అన్నాను.

ఆతరువాత చాలా రభస జరిగింది నా భార్యకు ఆమె తమ్ముడూ, తల్లీ నూరిపోయవలసిందంతా నూరిపోశారు. నా మాటలు, విన్నపాలు ఆమె

మీదా కూడా అసహ్యం పుట్టింది. కోపంతో ఆత్రితే ఉల్లు విడిచి వొచ్చాను. పిచ్చివాడిలా ఊరంతా తిరిగి తెలతెలవారుతూండగా అనువ్రతి చేరుకున్నాను. హడావుడిగా పోతూన్న నర్సు నన్ను చూసి ఆగి "లింగారు యింకో కాసేపట్లో ప్రవసిస్తారు" అని చెప్పేసి వెళ్లిపోయింది. నేను అనక్తుడ్నయి అక్కడే కూచుండిపోయాను. దాదాపు మూడుపావుగంట గడిచింది. కావ్పు చాలా కష్టమయింది ఆడపిల్ల కలిగింది లోపలకు వెళ్లాను. నన్ను చూసి ఆనందబాష్పాలు రాల్చింది పిచ్చిపిల్ల.

ఆ రాత్రే ఆమె కన్నుమూసింది, పాపను నా చేతిలో పెట్టి. ఆ సంఘటన నాలో కసిని ప్రజ్వలింపజేసింది అందరిమీదా. అమాయకులమీద పగ సాధించే ఈ సంఘాన్ని అవమానించి కక్ష తీర్చుకోవా లనిపించింది క్రోధంతో వణికిపోతూ యింటికి వెళ్లాను. ఇంటిముందు చాలా మంది జనం గుమికూడి కనిపించారు— లోపలకు వెళ్ళాను. నా భార్య ఆత్మహత్య చేసుకుంది

ఆతరువాత ఏమయిందో నాకే తెలియదు. నాలో పెరిగిపోయిన కసిని చిత్రాలు రూపంలో వెళ్లగక్కాను. కాని అవి పేలవంగా వెలవెలపోయాయి. బొమ్మలు గీయాలంటే నిర్మలమయిన అంతఃకరణ అవసరం. అది లోపించటంతో నా కుంచె స్వాధీనం తప్పింది. అవజయాలు నన్ను కుంగదీశాయి పూవులమ్మిన ఊళ్లో కట్టెలమ్మకోలేక పోయాను పసిపిల్లను తీసుకుని ఈ ఊరు చేరుకున్నాను. ఈ కుటీరం నిర్మించుకుని ఆమె పెంపకమే ధ్యేయంగా ఈ పదహారు సంవత్సరాలూ గడిపాను

ఆ పిల్లే మా ఇందు

ఆమె ఎలాంటిదో మీకు తెలుసు. నా జీవితంలో నేడు ఏకైక ఆశాకిరణం ఆమే డాక్టరుగారూ! అదే అనరా! ఆమె కీసంగతులన్నీ తెలుసు. ఆమెకు ఆనందకరమయిన భవిష్యత్తు ఉండాలంటే అది అవసరమనిపించి నేనే చెప్పాను. అయితేనేం? ఆమెకు నేనే సర్వస్వం. ఒక్కొక్కసారి అనిపిస్తుంది. ఆమెతల్లి ఈనాడు బ్రతికే ఉంటే ఆ బంగారు తల్లిని చూసి ఎంత మురిసి పోయేదో అని."

ఆఖరిమాటలు అంటూ వుంటే సూర్యారావుగారి గొంతు గాద్గదిక మయింది నయనాలు అశ్రుసిక్తా లయినాయి చక్రపాణి నిట్టూర్చాడు. ఎంతటి వేదన ఉంది ఆయనలో?

ఆతరువాత కొంతసేపు మౌనంగా గడిచిపోయింది. బాగా చీకటివడిపోయింది. చక్రపాణి లేచి "ఇహ నేను సెలవు తీసుకుంటాను" అన్నాడు భారంగా.

"వదండి."

ఇద్దరూ వీధిదాకా వొచ్చారు చక్రపాణి కారు వెక్కి "వస్తాను" అన్నాడు చేతులు జోడించి. సూర్యారావుగారు ప్రతినమస్కారం చేశాడు. కారు కదిలింది.

* * *

ఇంటికి వొచ్చిన చక్రపాణి భార్యవంకా తమ్ముడివంకా మాటిగా చూడలేకపోయాడు. ఇందిర గత జీవితం ఎలాంటిదో తెలియనివేళ అతడు సోదరుడి కోరికనూ, భార్య అభ్యర్థననూ మన్నించగలిగాడు. ప్రస్తుత పరిస్థితి వేరు. ఈ వివాహం జరిగే అవకాశం లేదు. తాను అంగీకరించినా తన తండ్రి అంగీకరించడు. అయితే అతనికి తమ్ముడిమీద కలిగిన జాలి తను విన్నది చెప్పటానికి అవరోధం కలిగించింది

అందుకే అతడు ఆ మరునాడు రాత్రి సుభద్ర గుచ్చిగుచ్చి అడిగిందాకా ఆసలుసంగతి చెప్పలేకపోయాడు. అంతా విన్నాక "అయితే ఈ పెళ్లి జరగదంటారా?" అన్నది సుభద్ర.

"నాన్నగారు ఒప్పుకోరు."

"మీకు యిష్టమేనా?"

ఆ ప్రశ్నకు చప్పున జవాబు చెప్పలేకపోయాడు చక్రపాణి. అతని అభిప్రాయం ఏమిటో తెలిసే సుభద్ర ఆ ప్రశ్న అడిగింది.

"చూడండి! ఇంతటి స్వల్పవిషయాన్ని మీరింతగా పట్టించుకోవటం మీ చదువుకీ, గౌరవానికీ తగిందికాదు. ఎవరో చేసిన తప్పు అది. ఆమె ఎందుకు బాధపడాలి? ఆ అమ్మాయిలో ఏ లోటూ లేదని మీకూ తెలుసుగదా?" అన్నది సుభద్ర అనునయంగా.

"ఇవన్నీ పుస్తకాల్లో కబుర్లు సుభా! .... ఇహ నువ్వూ వాడూ దానిసంగతి మర్చిపోండి" అన్నాడు చక్రపాణి చివరిమాట అదే అన్నట్టు.

సుభద్ర ఏమీ మాట్లాడలేదు అయితే యిప్పుడేం జరిగేటట్టు? ఈ వివాహం తప్పక జరుగుతుందని తాను మరిదికి హామీ యిచ్చింది అందుకు భిన్నం జరిగితే ఆ అమాయకుడు చాలా దారుణమయిపోతాడు జరగాలంటే (వివాహం) తన మామగారు ఒప్పుకోవాలి అందుకోసం పల్లెటూళ్లో ఉన్న ఆయనకు ఉత్తరమన్నా రాయాలి, లేదా ఆయన ఇక్కడకన్నా రావాలి.

మరునాడు కాఫీలు తాగేసిన తరువాత సుభద్ర ఒంటిగా ఉండటం చూసి రాజా వొచ్చాడు. రెండు సార్లు గొంతు సవరించుకుని ఏదో అడగబోయి ...న్నాడు.

"ఊఁ!" అన్నది సుభద్ర.

రాజా వీధిలోకి వొచ్చాడు. అతనికి వదిన వైఖరీ, అన్నగారి వైఖరీ అణుమాత్రం కూడా అర్థం కాలేదు. సూర్యారావుగారి యింటికి చక్రపాణి వెళ్లడం, అక్కడ చాలాసేపు వాళ్లిద్దరూ బాతాఖానీ వెయ్యడం తాను ఆ ఇంటికి ప్రదక్షిణాలు చేసి కనిపెట్టాడు. ఏం మాట్లాడుకున్నారో మాత్రం తెలియలేదు ఆ ఇందిర ఉందంటే ... అయ్యా బాబోయ్! మాట్లాడినంతసేపట్లో మొదటి కాసేపు సరిగానే ఉంటుంది ఆ తరువాత తాను ఏమయినా అడిగితే అసలే పెద్దవయిన కళ్ళు మరీ పెద్దవిచేసి హడలగొట్టేస్తుంది అయితేనేం? అలాంటి అమ్మాయి ఈ లోకంలోనే లేదు

రాజా ఆలోచనల్లోంచి తేరుకుని రోడ్డుని గమనించాడు అప్పటికిగాని అతనికి తాను సెంటర్‌కి వొచ్చానన్న సంగతి స్ఫురించలేదు రోడ్‌కి అవతల అతనికి తెలిసిన మెడికల్ స్టోర్సు ఒకటి ఉంది. అందులో ఆప్తమిత్రుడయిన ఆదిమూర్తి పని చేస్తున్నాడు. రాజా అందులోకి వెళ్లాడు. మిత్రుడు ఇతన్ని చూడంగానే "ఏం భాయ్? మరీ నల్లపూసయిపోయావు?" అన్నాడు రాజా సమాధానంగా చిరునవ్వు నవ్వి పక్కగా వేసిఉన్న కుర్చీలో కూచున్నాడు మరుక్షణాన ఏదో వింతవాసన సోకినట్లయి గుమ్మంవైపు చూశాడు ఇందిరా మరో అమ్మాయి కిలకిల నవ్వుకుంటూ లోపలికి వొచ్చారు. స్నేహితురాలు ఏదో మందు కావాలని అడగటం ఆదిమూర్తి ఇవ్వటం ఆమె ఖరీదు చెల్లించి ఇందిరతో సహా వెళ్లిపోవటం చకచకా జరిగిపోయాయి. ఇంతసేపూ రాజా వాళ్లవేపు క్రీగంట చూడటం మినహా చేసిందేమీ లేదు. ఇందిరను పలకరించాలనిపించినా ఫలితాలు దారుణంగా ఉంటాయేమోనని భయపడి మానేశాడు అరనిముషం తరువాత "ఏవిట్రా? అలా తెల్లమొహం వేసుక్కూచున్నావ్? ఆ ఇందిరగాని నీకు తెలుసా?" అన్నాడు ఆదిమూర్తి.

రాజా ఉలిక్కిపడి "ఏదో కొద్దిగ" అన్నాడు.

"ప్రణయమా?"

రాజా అర్థిష్ట్ర" అన్నాడు కంగారుగా.

"నీ మొహమే చెబుతోందిలే. కాని ఒక్కమాట భాయ్! ఈ కథ సుఖాంతం కాదు. ఆ అమ్మాయికి బావవరస అయే యువకుడు ఒకతను ఉన్నాడు. నాగార్జునసాగర్‌లో యు. డి. సి గా పనిచేస్తున్నాడు అతనంటే ఈమెకి ఈమంటే అతనికీ .."

ఆతరువాత ఆదిమూర్తి చెప్పలేకపోయాడు. ఎందుచేతనంటే ఒక తొమ్మి దడుగుల కార్తీ" "శారీ డాన్ ఫ్లైజ్" అంది దబాయిస్తున్నట్టుగా.

మిత్రుడు చెప్పిన విషయం రాజాని కుంగిపోయేలా చేసింది. సూర్యారావుగారి యింటికి వెళ్లిన తన అన్నగారు కూడా ఈ సంగతే వినివుంటాడు. తనతో చెప్పలేక పొదిన బాధపడుతూ ఉండి ఉంటుంది ఆ నిర్ణయానికి వొచ్చిన రాజా మిత్రుడితోకూడా చెప్పకుండా సరాసరి యింటికొచ్చి పడ్డాడు.

ఆసామి:-(సర్వరుతో)ఇంతకూ నువ్వు తీసుకొచ్చింది కాఫీయా? టీయా?

సర్వరు:-ఆ మాత్రం తెలీకపోతే ఎట్లా! వాసన చూడరాదూ! ఆముదం వాసనవేస్తే కాఫీ! కిరసనాయిలు వాసనవేస్తే టీ!

-చిమ్మపూడి శ్రీరామమూర్తి (సిరికొండ)

తెబ్బతిన్నది. అతని ఆలోచనల్లో, మనసులో, ఆశల్లో ఇందిరతప్ప మరేమీ లేదు. ఆమెను తనదాన్ని చేసుకుంటాడని, ఆనందంగా సంసారం చేస్తాడని కలలుగన్నాడు. ఆ కలలు నేడు కూలిపోయాయి. తన జీవితం నిస్సారమ్మై, వ్యర్థమ్మై నాశనం కావలి సిందే మోకాళ్లలో తలపెట్టుకుని అలాగే పడక కుర్చీలో వాలిపోయాడు. కొంతసేపటికి "అలా కూచున్నావేంరా రాజా ?" అన్నమాట విని అతను కళ్ళు తెరిచి ఎదురుగా చూశాడు ఆశ్చర్యంతో "ఎప్పుడొచ్చారు నాన్నా ?" అన్నాడు లేస్తూ.

శేషయ్యగారు కూచుని "అంతా ఓ గంట యింది .... బాగా చదువుతున్నావా ?" అన్నాడు.

"ఆ" అన్నాడు రాజా.

"ఏమిటి విశేషాలు ?"

తండ్రి ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో తోచలే దతనికి. "ఏవున్నయ్ ?" అన్నాడు కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఆయన లేచి "సమయా నికి అన్నయ్య ఇంట్లో లేకుండా వెళ్లాడు" అను కుంటూ వెళ్లిపోయాడు. రాజా ఆమాటకి కించిత్ ఆశ్చర్యపడి మళ్లీ తన మామూలు స్థితికి వెళ్లి పోయాడు.

ఆ రాత్రి మావఁగారికి పక్కా అది వేయించి ఆయన దానిమీద విశ్రమించాక సుభద్ర వొచ్చి కాస్త అవతలగా గోడనానుకుని నిలబడింది. కోడలు ఏదో మాట్లాడటానికి వచ్చిందన్న విషయం గ్రహించిన శేషయ్యగారు "కూచోమ్మా" అన్నారు. సుభద్ర చాపమీద కూచుని "రాజా పెళ్లిసంగతి ఏమయినా ఆలోచిస్తున్నారా ?" అన్నది సమా ధానం తెలిసినా.

శేషయ్యగారు చిరునవ్వు నవ్వి "ఎందుకు లేదమ్మా ? .... ఏం ? నీకు తెలిసిన అమ్మా యెవ న్నా వున్నదా ?" అన్నాడు.

సుభద్ర ఇందిరసంగతి చెప్పి "రాజా ఆ అమ్మా యిని చేసుకోవాలని ముచ్చటపడుతున్నాడు ఆయన్ని కనుక్కోమంటే .... " అర్థోక్తిలో వూరుకుంది

"మఁగపెళ్లివారం కదా ?"

"అందుకు కాదు"

"మరి ?"

సుభద్ర అసలు సంగతి చెప్పేద్దా మనుకుంది. కాని అందువల్ల అవాంఛనీయమయిన పరిణామాలు కలుగవచ్చునని "ఆయనకి క్షణం తీరిక ఉండదు. మీరే చూశారుగా ? అలాగే ఏ మిత్రుడో వొచ్చి తన కేసులో సాయంచెయ్యటానికి పిలిస్తే వెళ్లి పోతారు. ఇవాళ గుంటూరుతో అయిపోయింది ఒకోసారి అంతకన్నా దూరపువూళ్ళు కూడా వెళ్తూ ఉంటారు" అన్నది

"ఏం చేద్దా మంటావు ?"

"ఆ అమ్మాయిని రేపు మనయింటికి పిలి పిస్తాను. మీరు చూద్దురుగాని పలుకూ, నడతా మీకు నచ్చితే ఏ పేరిశాస్త్రిగారినో పంపి మాట్లా డించవచ్చు"

"కులమూ గోత్రమూనో ?"

"వాళ్ళు మనవాళ్లే మీకు తెలిసే ఉండాలి. సూర్యారావుగారని ఆర్టిస్టు"

"సూర్యారావా ? .... బక్కగా ఎర్రగా ఉంటాడు కదూ ?"

భయపడిందికూడా.

"నిన్నటిదాకా నాకూ తెలియదు. ఇవాళ బస్సులో వొస్తూండగా కలిశాడు; ఆయనా మరో పిల్లాను. ఆ అమ్మాయే అయితే ఈడూ జోడూ బాగానే ఉంటుంది"

"రేపు చూస్తారుగా ? ఇంతగా ఎందుకు చెబుతున్నానంటే వారం రోజుల్నించీ రాజా వేళకి అన్నమయినా తినకుండా పిచ్చిగా తిరుగుతున్నాడు. నాకూ ఓపట్టాన తెలిసిందికాదు బతిమాలగా బతి మాలగా అతనే చెప్పాడు పిచ్చిబాబు కన్నీళ్ళు పెట్టుకున్నాడు" శేషయ్యగారు కళ్ళు వత్తుకోవటం గమనిస్తూ అంది సుభద్ర.

"అలాగేనమ్మా ! నాకూ వాడిసుఖమేకదా కావలిసింది" అన్నా డాయన.

సుభద్ర ఆ తరువాత మరేమీ మాట్లాడలేదు. మావఁగారి దగ్గర్నుంచి సెలవుతీసుకుంది.

* * *

రాజాకి తన వొదినెకూ తండ్రికీ జరిగిన సంభా షణ తెలియదు. అతన్ని నైరాశ్యం పూర్తిగా ఆవ హించింది. కథ అంతానికి వచ్చిందని అనిపించింది. స్నానాదులు కాంగానే బట్టలు వేసుకుని రోడ్ మీదికి వొచ్చాడు అయోమయంగా నడుచుకొంటూ సూర్యారావుగారి కుటీరం పరిసరాలకి వచ్చాడు. అతని కిప్పుడు ఒక్కటే ఆశ. ఇందిరను ఒకసారి చూడాలి. ఆ తృప్తి అయినా ఉంటే ......

రాజా ఆ రోడ్డుమీద నాలు గయిదుసార్లు తిరి గాడు తాయిలంగారి దర్శనభాగ్యం కలగలేదు అత నిలో బాధ, ఉక్రోషమూకూడా పెరిగిపో సాగాయి తెగించి (?) ఇంటోకి వెడదామంటే అది వరకు లేని బెరుకు ఆవహిస్తోంది చివరిసారి అని నచ్చచెప్పుకుని ఆ యింటిముందుగా వొచ్చాడు. ఆ గుమ్మం దాటుతోండగా సూర్యారావుగారు బయ టికి వొచ్చాడు. ఆయనకళ్ళు నిప్పులు కక్కు తున్నాయి రాజాను చూసి ఆగి "చూశావా నాయనా ఎంతపని జరిగిందో ?" అన్నాడు

"ఏమిటి ?" అన్నాడు రాజా అయోమయంగా.

"ఎవడో త్రాష్టుడు అమ్మాయికి ఉత్తరం రాశాడు పోలీసురిపోర్టు ఇద్దామని బయలుదేరు తున్నాను" అన్నా డాయన కోపంతో వొణికిపోతూ.

"ఉత్తరమా ?" అన్నాడు రాజా తెల్లబోయి.

"ఊఁ"

"సంతకం చేశాడా ?"

"ఆ ! ఎవడో ఆదిమూర్తిట."

అప్పుడు తనకు మిత్రుడయిన .... అతనికి అను మానం తీరలేదు. ఏ టింకోడేమో ? గభాయిన సూర్యారావుగారిచేతిలో ఉత్తరం లాక్కుని దస్తూరీ చూశాడు అతని అనుమానం తీరిపోయింది. ఎంత నాటకం ఆడాడు దుర్మార్గుడు ? ఇదా కథ ? అను కున్నాడు. సూర్యారావుగారు అతని భావాల్ని అర్థం చేసుకునేపరిస్థితిలో లేడు. "పద నాయనా ! పో ..."

అంతే ! ఆ తరువాత ఆయన నోటివెంట మాట రాలేదు. బాధతో మెలితిరిగిపోసాగాడు. రాజా కంగారుగా సాధ్యమయినంతవరకూ అదుముకుంటూ ఆయన్ని భూజాని కానించుకుని లోపలకు దార తీశాడు. అప్పుడే వంటింటిలోంచి వచ్చిన ఇందిర అది చూసి పరుగున వచ్చి "ఏమిటి నాన్నా ?" అన్నది గాభరాగా. రాజా ఆమెను వారించి "భయ పడకండి ! ఫ్రిట్సు మళ్లీ వచ్చినట్లుంది. అన్న య్యకు ఫోన్‌చేసి వస్తాను. అందాకా యిక్కడే కూచోండి" అంటూ తొందరతొందరగా బయ టకు వచ్చాడు.

ఫోను అందుకున్నాక కాని అతనికి గుర్తు రాలేదు చక్రపాణి గుంటూరు వెళ్లాడని. అయితే ఒకటి అనిపించింది. అతనికి అన్నగారు వూరు గూరు వెళ్లినా తెల్లారేసరికి వచ్చెయ్యడం అను భవమే. ఇప్పుడూ వచ్చి ఉండవచ్చు రాకపోతే .... అతను ఫోన్ చేశాడు రిసీవ్ చేసుకున్నది చక్ర పాణే ! రాజా ద్విగుణీకృతోత్సాహంతో సంగతంతా చెప్పి అయిదు నిముషాల్లో వస్తున్నా నన్న అన్న గారి మాట విని ఒక్క అంగలో సూర్యారావుగారి యింటికి వచ్చిపడ్డాడు.

అన్నట్లుగానే అయిదు నిమిషాల్లో చక్రపాణి కారుదిగాడు. అతడితోపాటు తన తండ్రి కూడా దిగటం చూసి ఆశ్చర్యపోయాడు రాజా. ఆయన మాత్రం కొడుకును చూడంగానే చిరునవ్వు నవ్వి "పద" అన్నాడు. అంతా లోపలికి వచ్చారు. చక్ర పాణి కూర్చుంటూనే సిరెంజి తీసి మందు ఎక్కిస్తూ "నాన్నగార్ని ఆవేశపడనివ్వద్దని చెప్పాను గామ్మా ?" అన్నాడు.

ఇందిర "పొద్దున్న పేపరు రావటం కాస్త ఆలస్యమయింది. దానికోసం ఆయన లోపలికీ బయ టికీ తిరిగారు చాలాసేపు. ఇంతలో ఏమయిందో బట్టలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు అదరాబాదరాగా. పదినిముషాల తరువాత మీ తమ్ముడుగారే ఆయన్ని లోపలకు తీసుకువచ్చారు" అన్నది

"ఏం జరిగిందండీ ?" అన్నాడు చక్రపాణి.

సూర్యారావుగారి ఆయాసం కాస్త ఉపశ మించింది గుండెల్ని చేత్తో రాసుకుంటూ మెల్లిగా జరిగింది చెప్పాడాయన : "ఈ ఉత్తరం గుమ్మంలో పడేసిఉంది. చూడంగానే వొళ్లూపై తెలిసిందికాదు" అన్నాడు చివరికి.

"పోన్లెండి ! ఆ విషయమే తలుచుకు హైరాన పడకండి" అన్నాడు చక్రపాణి

కొన్నిక్షణాలు మౌనంగా గడిచాయి. అంత సేపూ గోడలవంకా వాటికి తగిలించివున్న చిత్ర పటాల వంకా చూస్తూ కూచున్నాడు శేషయ్య గారు. ఆ చిత్రాల్లో చాలాభాగం సూర్యారావు గారు గీసినవే. శేషయ్యగారిని అవి ఎంతో ఆక ర్షించాయి. వయసులో ఉన్నప్పుడు ఆయనకే

32 వ పేజీలో

వెలుగు

బొంబాయి ఆంధ్ర మహాసభ

బహుమతి కథ.

ఉండేది. సాధారణంగా అలాంటి వ్యక్తులకి తన పిల్లవాళ్ళను చూస్తే అభిమానం కలుగుతుంది. శేషయ్యగారికీ కలిగింది.

చక్రపాణి లేచి నిలబడ్డాడు. ఇందిరతో మొదటి సంగతి చెప్పేసి బయలుదేరబోతూ "వండి నాన్నా" అన్నాడు. శేషయ్యగారు లేచి "విశ్రాంతి తీసుకోండి సూర్యారావుగారూ! మీతో పనుంది. సాయంత్రం కలుస్తాను" అన్నాడు. సూర్యారావుగారు చిరునవ్వుతో "అలాగే" అన్నాడు.

తండ్రీ, కొడుకు తిన్నగా బయటకు వచ్చి కారెక్కారు.

ఇంటికి చేరిందాకా అంతా మౌనంగానే ఉన్నారు. చక్రపాణి అంతరాంతరాల్లో తండ్రి ఎందుకు తనతో అక్కడికి వచ్చాడా అని ఆలోచిస్తూనే ఉన్నాడు. ఆ ఆలోచనల్లో అతడికి సాక్షాత్కరించింది సుభద్ర రూపమే. ఆమె ఇందిర గురించి పకాలా పుచ్చుకుందన్న విషయం అతనికి తెలిసిందే. ఏదో ఆ అమ్మాయినిగురించి చెప్పి ఉంటుంది ఆయనతో. భోళాశంకరుడయిన తన తండ్రి అది ఆధారంగా అక్కడికి వచ్చాడు. కాని ఈ క్షణాన నిజం ఆయనకు తెలుస్తే ..... అసలే ఆయనకు తనమీద కోపం సుభద్రను పెళ్ళిచేసుకున్నాడని. అందుకు ఈ కారణం కూడా తోడయితే ..

తనకోసం కాచుకూర్చున్న పేషంట్లను కాసేపు కూచోమని చెప్పి మేడమీదకు వచ్చాడు చక్రపాణి అతనికి భార్యమీద కోపంగా ఉంది. గదిలో మంచంమీద కూచుని ఏదో అల్లుకుంటున్న సుభద్ర కంటపడగానే "నాన్నగారికి ఏం నూరి పోశావేం ?" అన్నాడు.

"ఏం ?" అన్నది సుభద్ర నవ్వుతూ.

చక్రపాణి కోపంగా ఏదో అనబోయి తమాయించుకుని "ఆయనకి నిజం తెలిస్తే ఏం జరుగుతుందో తెలియదా ?" అన్నాడు.

"తెలియకుండా ఎలా ఉంటుంది ?"

"తెలిసిన తరువాత ఆయన ఒప్పుకుంటారనా? చక్రపాణి కంఠంలో హేళన ధ్వనించింది.

"ఆశ అదే !"

"ఫలితం అపజయమే "

"చూద్దాం "

చక్రపాణికి మరీ వొళ్ళు మండిపోయింది తండ్రితో పోయి అసలుసంగతి చెప్పేద్దామని బయలుదేరి గుమ్మంలో తండ్రి ఎదురవటంతో ఆగిపోయాడు ఆయన లోపలికొచ్చి "అమ్మాయిని చూచి వచ్చానమ్మా" అన్నాడు కోడలితో

"ఆయన అదే చెబుతున్నారు" అన్నది సుభద్ర లేచి నిలబడి.

శేషయ్యగారు ఒక్క క్షణం ఆలోచించి "తల్లి లేదు మరి" అన్నాడు

"ఎట్లా ఉంటుందిలెండి ?" అన్నాడు చక్రపాణి

"అదేమిటి ?" అన్నాడాయన ఆశ్చర్యంగా

ఆ ప్రశ్నతో చక్రపాణిలోని ఆవేశం కట్టలు తెంచుకుంది. ఇందిర జీవితచరిత్ర యావత్తూ పూసగుచ్చినట్లుగా చెప్పేశాడు. చివర్న "మీ కోడలుగా చేసుకోవటానికి యిష్టపడతారా ?" అన్నాడు ఆవేశంగానే.

శేషయ్యగారిలో కలిగిన మార్పును పసిగట్ట గలిగింది సుభద్ర. ఆయనలో ఏదో తీవ్రమయిన సంఘర్షణ ప్రారంభమయింది. కొన్ని క్షణాలదాకా ఆయన కొడుకువంకా కోడలివంకా అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత మంద్రస్వరంలో "నాకు యిష్టమేనా ?" అన్నాడు.

ఉలిక్కిపడ్డారు సుభద్రా చక్రపాణీ.

అవునమ్మా! నీ కోరికా రాజా వాంఛితము తప్పకుండా నెరవేరుతుంది. అయితే దాని క్కారణం నీమీద అభిమానమూ వాడిమీద జాలీకాదు ఒక కథ.... ఆ కథ ...." ఆయన గొంతు గాద్గదికమై మాట పెగిలి రాలేదు. చక్రపాణి ఒక్క క్షణం దేనికోసమో అన్నట్లుగా నుంచుని చిరాగ్గా వెళ్ళిపోయాడు.

సుభద్రకి మావగారి ఆవేదన అర్థంకాలేదు. అయితే ఆయన నిర్ణయానికి మాత్రం ఆమె కళ్ళు ఆనందంతో తృప్తితో చెమర్చాయి. కొంతసేపు పోయాక "రాజాతో ఈ సంగతి చెబుతాను" అన్నది లేవబోతూ.

"కథ వినవూ ?" అన్నాడాయన జాలిగా.

పెట్టంతమనిషి అలా బేలయిపోయేసరికి సుభద్ర భరించలేకపోయింది. ఆయనలో ఉన్న పసితనానికి, అమాయకత్వానికి, అదే నిదర్శనమేమో ననిపించింది. ఆగిపోయి "చెప్పండి మామగారూ" అన్నది.

ఒకడు:-కందిపప్పు సేరెంత?

షావుకారు:-ఇప్పటివరకు 75 న. పైలు అమ్మింది. కాని కొత్త జీతాల మార్పువల్ల రూపాయి దాకా పెరిగింది. అంతే.

సి. సత్యనారాయణశర్మ (విశాఖపట్నం.)

"నాకు ఒకవేలువిడిచిన చెల్లెలి కూతురు ఉండేదమ్మా ఆ అమ్మాయిపేరు పార్వతి. చాలా తెలివయినదీ, అందమైనదీను. తల్లిదండ్రులకి ఒక్కతే కూతురు కావటాన అతిగారాబంగా పెరిగింది నేనంటే ప్రాణం పెట్టేది.

"అందర్నూ ఆ అమ్మాయిని మేనబావ కిచ్చి వివాహం చెయ్యాలనే అనుకునేవారు. నాబోటి వాళ్ళు ఒకరిద్దరు అందుకు వ్యతిరేకించినా బలం ఆ వర్గందే అయింది అయితే విధి లిఖితం మరోలా ఉండిపోయింది ఆఖరిక్షణాన ఆ పెళ్ళికుమారుడి తండ్రి — అంటే మా మామయ్య లాంఛనాలకీ కట్నాలకీ ఏదో యివ్వాలంటూ పట్టుబట్టాడు. పెళ్ళి ఖర్చులకీ ఏవో మాత్రప్రాయమయిన లాంఛనాలకి సిద్ధమయిన మా బాబాయి అందుకు తూగలేకపోయాడు. ఫలితం పీటలమీద పెళ్ళి ఆగిపోయింది.

"వారం రోజులు గడిచాయి "

"ఎనిమిదోరోజున మా బాబాయి రాసిన ఉత్తరం చూసి మా ఇంట్లో అంతా ఆశ్చర్యచక్కింది. పీటలమీద లేచిపోయిన ఆ బావా ఈమె దంపతుల్లై చిలకా గోరింకల్లా ఏడెనిమిది నెలల పాటు రాజమండ్రిలో కాపురం చేశారు. ఆ అన్ని నెలల్లోనూ మా మామయ్య కొడుకుని మార్చటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. అతను మారలేదు.

ఈ విషయాలన్నీ విని ఆనందించినవాళ్ళల్లో నేను ప్రథముడిని. అవును మరి ! అతం శుభం ఎరగనివాళ్ళ జీవితాలను నాశనంచేయ సంకల్పించిన వాళ్ళని ఎదురునిలిచి గెలిచాడంటే ఆనందంగానే ఉంటుంది. ఓసారి ఏదో రాజమండ్రి పోవాల్సిన పని తగిలి వాళ్ళ యింటికి వెళ్ళాను ఇల్లు తాళం వేసి ఉంది ఎక్కడికి వెళ్ళారని పక్కింటివాళ్ళని అడిగాను. ఆయన నన్ను మర్యాదచేసి కూచోబెట్టి, "వారు మీకు బంధువులా మాష్టారూ ?" అన్నాడు. అవునన్నాను. "అతని తండ్రీ తల్లీ నిన్న వచ్చారు. వాళ్ళవెంట వెళ్ళిపోయాడతను. ఆ అమ్మాయి కాళ్ళావేళ్ళా పడి ఏడిచింది. అయినా ఆ రాతి గుండె కరగలేదు పయిగా నీవల్ల అయినవాళ్ళందర్నీ దూరం చేసుకున్నాను. సుఖశాంతులు లేకుండా చేస్తున్నావ్ అని తిట్టిపోశాడు అతను వెళ్ళిపోయాక ఏం అఘాయిత్యం చేస్తుందోనని వెయ్యి కళ్ళ కనిపెట్టిచూశాం కనుచీకటి పడ్డాక కాస్త యివతలికి వొచ్చి తిరిగివెళ్ళి చూసేసరికి లేదు. ఏమయిందో ఏమో ?" అన్నాడు నాకు నోట మాట రాలేదు. ఎంతపనిచేశాడు పాపాత్ముడు అనిపించింది అయితే నేను చెయ్యగలిగిందేముంది? మా యింట్లో అంతా దాని దురదృష్టానికి వాపోయారు. ఏమయితేనేం ? దాని జీవితం అలా నాశనమయిపోయింది ఆ తరువాత పార్వతి ఏదో అనువత్రిలో ప్రసవించిందనీ ఆడపిల్లను కన్నదనీ కథలుగా ప్రచారమయ్యాయి ఆడపిల్ల కలిగితే కలిగిఉండవచ్చు ఎందుకంటే నేను వెళ్ళిన నాటికి ఆమె చూలాలే ఇందిర సంగతి వినంగానే ఆ కథంతా గుర్తొచ్చింది. నువ్వే చెప్పమ్మా ? ఇందిరే నా చెల్లెలికూతురయితే అలా విదిలించెయ్యగలనా ?"

మాటలు పూర్తయేసరికి శేషయ్యగారి కంఠం బొంగురుపోయింది. కన్నీరు ధారలుగా కారిపోయింది. సుభద్రకు ఆయన బాధ అర్థమయింది అది అంతే మరి అయితే అంతటి ఉన్నతంగా ఆలోచించగలగటం నిజంగా గొప్పతనమే ! ఆమె లేచి ఉత్సాహంగా "ఇప్పుడే వస్తాను మావగారూ" అంటూ హాల్లోకి వొచ్చింది రాజా కూచుని ఉన్నాడు శుభవార్త చెవిని వేసేసరికి అతగాడు ఎగిరి గంతువేసి, "ఆ ఆదిమూర్తిగాడి నేపాళం భూపాళానికి పంపించేస్తాను"అంటూ గబగబా వెళ్ళిపోయాడు

ఆ రాత్రి సుభద్ర "ఆయనకున్నపాటి తెగింపు మీకు లేకపోయింది ? ఎందుకు మళ్ళీ అంతంత చదువుకున్నారు ?" అన్నదానికి "అది తెగింపు కాదు మేడమ్ ! ఒకరకమయిన స్వార్థం" అన్నాడు చక్రపాణి.

సుభద్ర అతని వంక కోపంగా చూసి "అవునులెండి ! మీ లొక్కరే నిస్వార్థజీవులు" అన్నది వెటకారంగా ★

"ప్రపంచంలో ఎంతోమంది ఇన్ని అబద్ధాలే చెప్పి హాయిగా బతికిపోతున్నారు లేకలేక నేనొక్క అబద్ధం చెప్పాను అదీ సొంతంగాదు దానికే ఇలా దొరికిపోవాలా ?" అన్నాడు యువకుడు

"భయపడకండి మిమ్మల్ని అంత సులభంగా ఇతరులకు దొరకనిస్తానా ?" అని ఆమె అభయం ఇచ్చింది

"నిజంగానా ? ఈ ఆపదనుంచి నన్ను కాపాడతారా ?" అని అతడు ప్రాధేయపడ్డాడు

"ఆ ! కాపాడితే మీరు ఏ అర్థరాత్రిపూటో ఇలాగే చల్లగా జారుకుంటారా ?" అని వెక్కిరించింది

"నో! నో! మీరు గీచిన గీటు దాటను ఎలాగైనా నన్ని చిక్కునుండి బయట పడేయండి ప్లీజ్ ! ప్లీజ్ !" అని ప్రతిమాలాడు అతడు.

"ఏ చిక్కు ?"

"అదేనండీ—ఈ టెలిగ్రామ్ బిడ్డ తెచ్చిన ఆపదనుంచి నన్ను గట్టెక్కించండి"

ఇద్దరూ ఎరగబడి నవ్వుకున్నారు వీరి పేర్లు కాంత, వేణులు ఈ పాత్రల్లో సావిత్రి, నాగేశ్వరరావులు చక్కగా నటించారు ఇది బాబా మూవీస్ వారు "కుముదం" తమిళచిత్రగాథ ఆధారంగా తయారుచేస్తున్న చిత్రానికి చెందిన సన్నివేశం దర్శకుడు : ఆదుర్తి సుబ్బారావు, రచన : ఆచార్య ఆత్రేయ, కామెరా : పి ఎల్ రాయ్, సంగీతం : కె వి మహదేవన్, నిర్మాత : పి సుందరం ఈ చిత్రానికి కొన్ని పాటలు దాశరథి కవి రచించాడు ఎడిటర్, అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ, నృత్యాలు : హీరాలాల్

ఈ చిత్రంలో ఇతర పాత్రలలో జానకి, శాంతకుమారి వి ఏ, ఎస్ వి రంగారావు, గుమ్మడి, నాగభూషణం నటిస్తున్నారు

దివ్యలోకంలో మానవుని దిగ్విజయం

అల్లదిగో నీలాంబరపు అంచుల్లో యక్షరాజా దివ్యలోకం! అక్కడ కంటికి ఇంపుగా ఒక కొలను! అందులో గులేబకావళి పుష్పాలు! మాయామణి ప్రభావంతో మానవుడు వీరుడు విజయ్ ఆ లోకంలోకి వెళ్ళగలిగాడు సరస్సులో స్నానం చేస్తున్న చిన్నారిని చూశాడు; వలచాడు, వలపించాడు తనకు కావలసిన గులేబకావళి పుష్పాన్ని తెంపుకుని ఈ లోకంలోకి వచ్చాడు అతనికి తమ్ముళ్ళెదురయ్యారు అన్నను ఈ చిట్టి తమ్ముళ్ళు మోసంచేసి పువ్వును లాక్కుని పోయారు

తండ్రి కంటిజబ్బును కుదర్చటానికి విజయ్ ఈ పువ్వు కోసం ఈ లోకం వచ్చి సాధించాడు. తమ్ముళ్ళు కూడా తండ్రి ఆరోగ్యం కోసమే పువ్వును పట్టుకుని వెళ్ళారని విజయ్ తన మనసును కుదుటపరచుకుని ఒకసారి తిరిగి బకావళి వైపు మనసును లగ్నం చేశాడు కలలో ఆమెను కన్పించి, ఆమెకు తన ఉంగరాన్ని కూడా అందించాడు ఇప్పుడే స్థితిలో ఉందో. చూసిరావా లనిపించింతనికి తిరిగి యక్షరాజలోకానికి వచ్చాడు.

* * *

సినీ విహారం

14-వ పేజీ తరువాయి

అప్పటికి పరిస్థితులన్నీ విషమించినవి బకావళి కన్యకు ఎదురైన ప్రమాదం ఆమె తండ్రి యక్షరాజా గ్రహించాడు ఉగ్రుడై ఆమెను విచిత్రమైన శైలులో బంధించాడు ఇంతక సరస్సు గతి ఎలాగ ఉందో గమనించాడు. ప్రతి పున్నమికి అక్కడొక పువ్వు వికసిస్తూంటుంది దానిని యక్షరాజా తన కులదైవానికి అర్పిస్తూంటాడు అటువంటి సరస్సులోని నీళ్ళు, పువ్వులూ బుగ్గి అయిపోయాయి యక్షరాజా మండిపడ్డాడు ఈ విపత్కర సమయంలో విజయుడు వీరుడుగా యక్షరాజా కళ్ళెదుట సాక్షాత్కరించాడు.

"పున్నమిచంద్రుడు ఉదయించబోతున్నాడు బుగ్గయిపోయిన మా దివ్య సరస్సు పునరుజ్జీవితం కావాలి మా పూలపంట పసిడి వెలుగులో మాకు మనోహరంగా సాక్షాత్కరించాలి మా వేలుపు పూజ సువర్ణ సుమ సమర్పణతోనో, నీ కన్నె రుధిర తర్పణంతోనో జరిగితీరాలి నీ త్యాగశీలకు, కార్యదీక్షకు ఇదే పరీక్ష" అని యక్షరాజా విజయ్‌ని శాసించాడు

"అట్లుగు రాజా ! దీక్ష నాకు, పరీక్ష ఆ దేవికి. ఏ దేవి దయాభిక్షతో నే నీ దివ్యలోకంలో అడుగు పెట్ట గలిగానో, ఏ తల్లి కృపా కటాక్షంతో గులేబకావళీ పుష్పం సాధించి ప్రజలకు సార్థకం చేసుకో గలిగానో ఆ లోకమాత నా కార్యదీక్ష నిరూపిస్తుంది మాతృశ్రీ మహదాశీర్వాదంతో జయమిదేరిన నేను మానవుణ్ణయినా నా కసాధ్యం లేదు. అసాధ్యమే లేదు" అంటూ విజయ్ సరికి ఆత్మ మహత్తర ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు

ఈ పతాక సన్నివేశం ఎన్ ఏ టి చిత్రం "గులేబకావళి కథ" కు చెందినది విజయ్‌గా ఎన్ టి రామారావు, యక్షరాజాగా మిక్కిలినేని, బకావళిగా నాగరత్నం, ఆమె సఖిగా మీనాకుమారి నటించారు నిర్మాత త్రివిక్రమరావు కామెరా రవికాంత్ నగాయిచ్ సహాయ దర్శకుడు సి హెచ్ విజయరావు మాటలు : జూనియర్ సముద్రాల.

ఈ దివ్యలోకంలోని సన్నివేశాలన్నీ కనుకట్టు దృశ్యాలతో (ట్రిక్ ఫోటోగ్రఫీ) దిగ్భ్రమ చెందే విధంగా నిర్మాత చిత్రీకరిస్తున్నాడు ★

రాత్రిపూట టార్చిలైటు పైకి చీకట్లోకి వేసి, "ఈ టార్చి వెలుతురు కిరణాల మీదుగా పైకి ఎక్కి వెళ్ళావంటే లక్షరూపాయలిస్తా" అన్నాడొక పిచ్చివాడు.

"నీ మోసం నాకు తెలిదా! సగం దూరం ఎక్కిన తర్వాత స్విచ్చి నొక్కి 'ఆఫ్' చేస్తావ్!" అన్నాడు రెండవ పిచ్చివాడు

వెంకట్ (మద్రాసు)



జగపతి వారి 'ఆరాధన'లో రమణారెడ్డి, రేలంగి, శివరామకృష్ణయ్య, గిరిజ.

అంటే ముందుగా కన్పించేది గుమ్మడే నవి దొంగల్లో దొర, శభాష్ రాముడు, మాయింటి మహాలక్ష్మి కి భార్యాభర్తలు చిత్రాలు నిరూపిస్తున్నాయి

సాంఘికపు ఊరగాయలతోటే సంతృప్తిపడే వ్యక్తి కాదు శ్రీ గుమ్మడి పౌరాణికపు పరమాన్నా లన కూడా ప్రియంటూ అందుకుని ఆస్వాదింప గల పటిమ ఉన్న వ్యక్తి నేటి నాటకరంగంలో కర్ణపాత్రకు మల్లాది మాదిరిగానే చిత్రరంగంలో కర్ణపాత్రగుమ్మడిదేననిపించి నిరూపించు కున్నాడు, 'శ్రీకృష్ణ రాయబారం' లో కర్ణ పాత్ర ధరించిన వెంకటేశ్వరరావు బి ఎ యన్ వారి భీష్మలో కూడా అదే పాత్రను నిర్వహిస్తున్నారు రేణుకామహాత్మ్యంలో జమదగ్నిగాను, 'ఋష్య శృంగ' లో విభాండకమహర్షిగాను గుమ్మడి చూపిన నటన మరువరానిది మాయాబజారు, ఐయబేరి చిత్రంలో గుమ్మడి ఆకార సౌష్టవం, నటన నాయక పాత్రల రాణింపుకు తోడ్పడ్డాయి ఒకరకమైన అవయవ లక్షణాలు కల వ్యక్తి ఒక తరహా పాత్రలే నటించటం ఉచితమని ఆయన చిత్రాలు నిరూపిస్తున్నాయి కనుకనే ఇప్పటికి పలుమార్లు ఉత్తమసహాయనటుడుగా ఎన్నిక కాగలిగినఘనత ఆయనకు దక్కుతున్నది

నటనంలో అతిప్రధానమైంది వాచికం సా...ఉచ్చారణ నవ్యంగా ఉన్నప్పుడే ఆ పాత్ర

మడీ-గుమ్మడీ

13-వ పేజీ తరువాయి

ప్రేక్షక జనాదరణీయమైన ఆమోదం పొందు తుంది అటువంటి విస్పష్టోచ్చారణం కల కొద్ది మంది నటుల్లో గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకరు శబ్ద శ్రవణ మాత్రంచేత పాత్ర స్వరూపం కళ్లకు గోచరింపజేసే ఆవాచిక శక్తిని ఇటీవల వాగ్దానంలో రంగనాథం పాత్రలో చూడగలిగాం ఆయన నటిం చిన నమ్మినబంటు అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రశంసలు పొందింది

సాంఘిక, జానపద, పౌరాణికాలలో భేదం లేకుండా కవికల్పితపరిధుల్లో నటిస్తూ పాత్ర లకు వింత సొయగం కొంత కల్పించే 'మడి' గలవ్యక్తి గుమ్మడి ఆయన పాల్గొన్న చిత్రాలు విఫలమైనా, సఫలమైనా ఆయన పాత్ర నిర్వహణ విధానాన్ని అందరు ప్రశంసిస్తున్నారంటే కారణం ఆయా పాత్రస్వరూపకల్పనకు తగ్గ ప్రతిభ, శారీరక సౌష్టవం సమకూరటమే''

* * *

''ఏమిటీ! మనిషిని చూపించమంటారా! అడుగో ఆయన ఆ కార్లో వెళ్తున్నాడు, ఆలస్యం చేస్తే అందడు! బూట్లు భూజాన వేసుకుని పరుగెత్తండి! అయింది, అన్నంతపనీ అయింది! వాళ్ళకారుజావ్వలయ్యా, సిగటం తప్ప అగటం లేదని నే చెప్తే విన్నారూ పరుగెత్తవయ్యా అంటే స్టూడియో ముందర బోర్ల పడితే ఎలా? మనిషి చూడబోయి పాపం మోహం బద్దలు కొట్టుకున్నారు' ఏం చేస్తాం! కాని కాలం అందుకనే డానికి! స్టూడియో గేటు కూడా అడ్డం తిరిగింది!''



మోహినీ రుక్మాంగదలో జమున

ఫోటో నిష్ఠాణిపారధి

రచయితలకు విజ్ఞప్తి

రచయితలు తమ రచనలతోను, రేఖా చిత్రములతోను, తగినన్ని తపాలా బిళ్ళలు అంటించి, చిరునామా వ్రాసిన కవర్లు జతచేసి పంపవ గోరుతాము. అట్లా పంపితే నే నిరాకరించిన రచనలను మరి కొంత త్వరగా త్రిప్పి పంపటం సాధ్యమవుతుంది.

మనసూ మనదేహస్థితి

12-వ పేజీ తరువాయి

వరకు వస్తి మూలాశయములు పెరిగి కొన్ని ఉపాంగములు అందులో ఎదిగిపోతవి లివరు ఎడమ ఖండము పరిమాణము తగ్గిపోతుంది బిడ్డ పుట్టంగానే కడుపు పైభాగము ఎత్తుగా వుండడం క్రమంగా ఆ భాగం తగ్గి క్రిందిభాగం పెద్దది కావడం సహజం. అది చిక్కిపోవడంవల్లా కాదు వ్యాధి లక్షణమూ కాదు

లివరు చేతికి మృదువుగా హల్వాలాగా వుంటుంది మాంసభుక్కులు చాలామంది జంతువుల లివరు చూచేవుంటారు లివరు కూర చాలామందికి యిష్టం కూడా. శరీరంలో వున్నప్పుడే లివరు పటంలో చూపించిన ఆకారం కలిగి వుంటుంది ఈ పరిస్థితిలో యిది వుండడానికి 'లిగమెంటు'లు (Ligaments) అనే రజ్జునిర్మితులు కారణం కాని శరీరంలో నుంచి తీసి బల్లమీద వుంచితే లివరు హల్వాముద్దలాగా తన భారంతో తానే సాగిపోతుంది లివరు క్రింది వైపున ఒక పెద్ద "నెర" (Fissure) వున్నది. ఈ 'నెర'యే లివరు కుడి యెడమ ఖండములకు హద్దు ఇందులోనుంచే లివరుకుపోయే ప్రధాన ఆర్టెరీ చిన్న ప్రేగునుంచి ఆహారింపబడిన జీర్ణాహార పదార్థములను తీసుకునివచ్చే "పోర్టల్ వెయినూ" (Portal vein) లివరులోకి ప్రవేశిస్తవి ఇక్కడనుంచే లివరులో తయారయిన పిత్తరసము (పసరును) బయటికి వచ్చి రెండుగా చేరి ప్రధాన పిత్తరస నాళముగా ఏర్పడతవి లివరు క్రింది వైపును అని, ఉదరంలో చాలా ఉపాంగముల పై భాగములు అని వుంటవి డుయోడినం, పెద్దప్రేగు కుడివైపు మడత, కుడి మూత్రాశయంపై కొమ్ముమీద దానివుండే ఎడ్రినల్ గ్రంధి యివన్నీ లివరు క్రిందివైపును అని వుంటవి

ఇతర అవయవములకు ఒక ఆర్టెరీ ఒక వెయిను వుంటే లివరులోకి రెండు రకముల వెయినులు పోతవి హృదయోన్ముఖములయిన రక్తనాళములను వెయినులనీ, హృదయమునుండి బయలుదేరే నాళములను ఆర్టెరీలనీ పిలవడం సంప్రదాయం ఆర్టెరీలలో రక్తం శుద్ధమైనదనీ ఆక్సిజన్ పుష్కలంగావుండేదనీ వెయినులలో రక్తం అపరిశుద్ధమైనదనీ అనుకోడం పొరపాటు హృదయంనుండి వూపిరితిత్తులకుపోయే ఆర్టెరీలో ప్రాణవాయువు లేదనే చెప్పవచ్చు అల్లాగే వూపిరితిత్తులనుండి హృదయం ఎడమ భాగానికి వచ్చే వెయినులో ప్రాణవాయువు పుష్కలంగా వుంటుంది ఇల్లాగే చిన్న ప్రేగునుండి లివరుకు పోయే పోర్టల్ వెయినులో జీర్ణక్రమంలో తయారయిన ఆహార పదార్థములన్నీ లివరుకు పోతవి అందువేత అది ప్రాణాధారకరమైనది అవిరోగగ్రస్తమైతే జీవితమే దుర్లభం. ఆయుర్వేదంలో ధమనీ, సిరా, నాడీ, స్నాయువులు అన్న మాటలు రక్తనాళముల విషయంలోనూ, వరములవిషయంలోనూ వాడేరు. కాని వీటిలో ఏది ఆర్టెరీ, వెయిన్, నెర్వ్ అన్న ఇంగ్లీషు మాటలకు సమ పదమో ఆయుర్వేద వైద్యులకే వివాదస్పదమైన విషయంగా వుంది ఆధునిక శరీర విజ్ఞానం తెలుసుకునేవారు ఆ మాటలనే తెలుగులోనికి తెచ్చుకుంటే మంచిది లివరులోకి పోర్టల్ వెయినేకాక, లివరులోనుంచి శాఖోపశాఖలుగా యేర్పడి ఆ ఉపశాఖలు కలిసి లివరునుంచి హృదయానికి పోయే వెయిను వున్నది. కాని అందులో తక్కిన వెయినుల లాగే ప్రాణవాయువు అధికంగా వుండదు లివరుకు పోయే నరములు, సీలియక్ ప్లెక్సస్‌నుంచి లేగస్ నరంనుంచి వస్తవి యోగశాస్త్రంలో వివరించిన మణిపూరక చక్రానికీ, యీ సీలియక్ ప్లెక్సస్‌కీ చాలా పోలిక వున్నవి పెద్ద ప్రేగుల వ్యాధులు వివరించేటప్పుడు ఆ విషయం మళ్ళీ వివరిస్తాను

లివరులోవున్న ప్రతి ఖండికలోనూ అక్కడ తయారయిన పిత్తరసమును తీసుకునివెళ్ళే ఉపనాళిక, పోర్టల్ వెయిన్ ఉపశాఖ, ఆర్టెరీఉపశాఖ, వెయిన్ ఉపశాఖ వుంటవి వీటన్నిటినీ కలిపి పోర్టల్ సిస్టం అంటారు. ఆ సంగతి లివరు సూక్ష్మ నిర్మితిని వివరిస్తున్నప్పుడు చర్చిస్తాను

లివరులో తయారయిన పిత్తరసం తయారయినది తయారయినట్లుగా డుయోడినంలోకి పోదు అది పసరు తిత్తిలోకిపోయి నిలవ వుంటుంది పసరుతిత్తి అత్తిపండు ఆకారముగల ఒక సంచీ ఆ సంచి గోడలో కండరములు వున్నందున దానికి సంకోచ వ్యాకోచ శక్తి కలద్దై వుంటుంది అది సంకోచించినప్పుడు అందులో రసం దానినుండి బయలుదేరే నాళం ద్వారా డుయోడినంలోకి పోతుంది ఇది లివరు క్రింది వైపునవున్న గాడిలో అంటి వుంటుంది కాని, దీని ముందుభాగం ప్రక్క ఎముకలకు క్రిందుగా బయిటికి కనుపిస్తువుంటుంది ఒక్కొక్కప్పు డిది బాగా లోపల ప్రక్కనే వుండవచ్చును గూడా దీని నాళం, లివరు నుంచి వచ్చే పిత్తరసనాళంతో కలిసివుంటుంది ఈ రెండూ చేరిన నాళమే డుయోడినంలోకి పోతుంది

ఈ నాళం క్రిమిదోషానికి గురిఅయినప్పుడుగాని ఇందులో రాళ్ళు చేరినప్పుడుగాని, ప్రక్కనవున్న ఉపాంగములలో కణుతులవంటి అతిద్వారం మూసుకుపోయి పసరు పైకి ఎగదన్ని శరీరభాగములకు వ్యాపించి కామెర్లు వస్తవి. కామెర్లకు యిది ఒక కారణము

లివరులో తయారయిన పిత్తరసం పలచగా వుంటుంది పసరు తిత్తిలో రసం చిక్కగా వుంటుంది ఒక్కొక్కప్పుడు ఇందులో స్ఫటికములు ఏర్పడి బాధ కలుగుతుంది. ఇందులోనూ క్రిమిదోషం యేర్పడి వాస్తుంది ఆ విషయాలు తరవాత చర్చిస్తాను ఇందులో వున్నరసం చిక్కనైనందున లివరు ద్వారా మాత్రమే బహిర్గతములయ్యే కొన్ని రంగు పదార్థములను, నోటి ద్వారాను వెయిన్ ద్వారానో శరీరంలోకి పంపినప్పుడు ఆ రంగులు పసరుతిత్తిలో ఘనీభవించుతవి లటువంటి రంగులో కొన్నింటి ద్వారా ఎక్సరేలు ప్రసరించవు ఈ వైజ్ఞానిక సత్యం అవకాశంగా తీసుకుని వైద్యులు పసరుతిత్తి రోగ గ్రస్తమైనప్పుడు దాని ఎక్సరే ద్వారా పరీక్షించడానికి వీలు కలుగుతున్నది (సశేషం)


డిసెంబర్
22
విడుదల!
దిలీప్ కుమార్
వైజయంతిమాల
నసిర్ ఖాన్
సిటిజన్స్ ఫిలిమ్స్
గంగా
జమున
(టెక్నికలర్)
సంగీతం: నౌషాద్
దర్శకత్వం: నితిన్ బోస్
విజయవాడ,
అలంకార్ & శ్రీమారుతీ సినిమా
రాజమండ్రి,
స్వామీ టాకీస్

చలమయ్యా పెళ్లి

11–వ పేజీ తరువాయి

వాళ్లింట్లోకి వెళ్లిపోయింది చలమయ్య నివసి స్తున్నది యింటి వీథి భాగంలోని ముందు గది కాబట్టి, ఆ యింట్లో వాళ్లెవర్నీ శ్రమ పెట్ట వలసిన అవసరం లేకపోయింది

గది తలుపు తెరచి, తెచ్చిన డబ్బును పెట్టెలో దాచిన తర్వాత, గదిలోని నులక మంచాన్ని బయ టికి తెచ్చి వేసుకుని శరీరం వాల్చాడు చలమయ్య. అతని ఆలోచనలు భద్రయ్య మాటలను ఒక్క సారి జ్ఞప్తికి తెప్పించాయి. 'గంపెడు సంసారాన్ని నెత్తిన పెట్టుకున్నట్లు, మరీ చెప్పొచ్చావు లేవోయ్! నువ్వూ ఒక కుటుంబీకుడ వయితే అలా చెప్పేవాడివేనా ?—'

అనుభవస్థుల యెదుట వివేకంతో వాదించడం కూడా ప్రమాదమే గాబోలు!

భద్రయ్య ఎన్నోసార్లు తనను హెచ్చరించాడు. 'చలమయ్యా! జీవిత పరిధిలో—ఎన్నో కోణాలు— వేర్వేరు విధాలుగా ఉంటాయి ఆ కోణాలను చేజిక్కించుకుని, మంచీ చెడుల మాటలను అవ తల నెట్టి—లోకం ఎన్నో విధాలుగా నింది స్తుంది ఒక్కొక్కప్పుడు భట్రాజులా పొగడు తుంది కూడా! అందువల్ల జీవితం సాంతం నిర్మ లంగా సాగుతున్న సహజం ఏమాత్రం కనిపించదు. నేనూ—నా చిన్నతనంలో పెళ్లి వాంఛను మనస్సు లోకి తెచ్చుకోకుండానే ఉండిపోయాను . కాని, తెలియరాని వాంఛ, అసహజమైన అనుభూతులు నన్ను వేర్వేరు కోణాలలోకి ఈడ్చుకుపోయాయి అలాంటప్పుడల్లా ఆలోచించేవాణ్ణి!—బాగా ఆలో చించేవాణ్ణి! ఆఖరికి పట్టు దొరికింది. ఆడా, మొగా లోకాన్ని ఎదిరించి—ఏకాకిగా నిలబడడం దుర్భరమనీ, అసహజమనీ గ్రహించాను అందుకే ఆఖరికి పెళ్లి చేసుకున్నాను .అప్పటికి నాలోని అనుభూతులకు 'మేత' లభించింది నాలో సంతృప్తి ఏర్పడింది . ఆ కొన్నాళ్లపాటి జీవిత పరిధులు నన్ను మానవుణ్ణి చేశాయి .ఆ జీవిత పరిధులు ఏమిటో తెలుసా ?—నా స్వరూపాలు! అంటే, నా పిల్లలు! నా పిల్లల్ని చూస్తున్నప్పుడల్లా—నాలో నేను—మాన వత్వం నిలబెట్టుకున్నా నన్న గర్వంతో ఉప్పొంగి పోతున్నాను ."

అయితే, చాలినంత సంపాదన లేక, కుటుం బంలో చిన్న కలతలు రేగుతున్నప్పుడల్లా భద్రయ్య బాధలను తను కళ్లారా చూస్తూనే ఉన్నాడు కాని, ఆ బాధలన్నీ క్షణికాలనీ భద్రయ్యచేత విన్నప్పుడు, కొన్ని గంటల తర్వాత వాళ్ల కుటుంబం లోని చేతలు చూసినప్పుడు—ఆ జీవితం అంతే నేమో అని సంతృప్తి పడి, ఒప్పుకోలుతో నిట్టూర్చే వాడు తను

అర్ధాంగి లేని జీవికి, జీవితం రుచించదన్న సిద్ధాంతం వాస్తవమే గాబోలు! బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా ప్రమాద మనే వాక్కు నిజమేనేమో!

అలా అయితే, తను కుటుంబ జీవితం గడపాలి ..

ఆ అనుభూతులలో—ఏవేవో వాంఛలు తీరు తున్నట్లు, స్వప్నిపన్నగా జరిగిపోయింది. కొంతసేపు.

ఎక్కడో గణగణ గంట మ్రోగుతున్నట్లు చప్పుడయింది అనుభూతుల్ని విదిలించుకొని, వాస్తవికలోకంలోకి ప్రవేశించాడు చలమయ్య

"అన్నయ్యా! ." అంటూ ఓ స్త్రీ కంఠం అతన్ని పిలిచింది. చలమయ్య కళ్ళు విప్పి, మంచం మీద లేచి కూర్చుని—వీథిలోకి చూశాడు మసక వెలుగులో కనిపించిన ఆ స్త్రీమూర్తిని గుర్తించి ఆశ్చర్యపోయాడు "సుశీలా! ...." అంటూ అతని అధరాలమధ్య అక్షరాల సంబోధన వెలువడింది.

అప్పుడప్పుడే సైకిలు రిక్షా నుండి దిగిన ఆమె చలమయ్యను సమీపించింది

"ఏమిటమ్మా యిది ? ఇంత రాత్రివేళ ఒంటరి రిగా ఎందు కొచ్చావు ?" అని ఆతురతగా, అర్ధా వేశంతో, ప్రశ్నించాడు చలమయ్య

"ఆపదలకు ఒంటరితనము, రాత్రివేళలూ అడ్డొస్తాయా అన్నయ్యా ?" అంది సుశీల— అతని చెల్లెలు ఆవేదనతో.

రిక్షావాడు సవారీ డబ్బుల్ని గురించి హెచ్చ రించాడు కొంగున ముడి వేసుకున్న చిల్లర డబ్బుల్ని రిక్షావాడి కిచ్చిం దామె రిక్షావాడు వెళ్ళి పోయాడు. అంతలో దీపం వెలిగించి వచ్చాడు చలమయ్య

"కూర్చో, సుశీలా! ...."

"అన్నయ్యా! . . ఎదురుచూడనివన్నీ జరిగి పోయాయి నా చెడ్డకాలం కాకపోతే, ఈ ఆపద లన్నీ మమ్మల్నెందుకు చుట్టుకుంటాయి? భగ వంతుడు కూడా చిన్నచూపు చూస్తున్నాడు"

"జరిగిందేదో వివరంగా చెప్పు, సుశీ ?"

"ఏం చెప్పను ? . ." అంటూ ఆవేదనతో కుమిలిపోయి, నెమ్మదిగా యిలా అంది : "ఆయన పనిచేస్తున్న కంపెనీలో, మేనేజరు కొంత డబ్బు యిచ్చి ఆయన్ని వెళ్లి బ్యాంక్‌లో కట్టి రమ్మన్నా రట డబ్బు తీసుకొని వెళుతూండగా ఎవరో జేబుదొంగ ఆ డబ్బుల్ని కొట్టేశాడు గాబోలు తీరా, ఆయన బ్యాంకి దగ్గరికి వెళ్లి చూసుకుంటే డబ్బు లేదట. జరిగిందంతా ఆ మేనేజరు వద్ద చెప్పుకున్నా, మేనేజరు ఆయన మాటల్ని లెక్క చేయక రేపు మధ్యాహ్నానికల్లా ఆ డబ్బు తనకు తెచ్చిపెట్టకపోతే పోలీసుకు రిపోర్టు చేసి, ఆయన్ని జైల్లో పడేస్తానని చెప్పాడట! మరి, ఆ డబ్బు తెచ్చిపెట్టడం ఎలా యిప్పుడు ? ఆ విషయమై ఏమీ తోచక ఆయన నిర్జీవిలా ఉన్నా రన్నయ్యా! ఆయన ఉన్న స్థితిని చూస్తే—నా జీవితానికి ఏం ప్రమాద మేర్పడుతుందో నని కంగారుగా ఉంది దీనికి నువ్వేదైనా దారి చూపించి, నా మాంగ ల్యాన్ని నిలబెట్టు అన్నయ్యా! ఈ ఆపద సమ యంలో నువ్వు తప్ప నా కింకెవ రున్నారూ ? ...." అని విలపించింది.

చెల్లెలు దుఃఖాన్ని చూడలేక కళ్ళు తుడుచు కున్నాడు చలమయ్య "మరేం ఫరవాలేదు లేమ్మా! విచారించకు! ... ఆఁ . పోగొట్టుకున్న డబ్బు ఎంతమాత్రం ఉంటుంది ? .... " అని ప్రశ్నిం చాడు

"వెయ్యిన్ని రెండు వందలట! ...."

"ఆఁ! .. అంత పెద్ద మొత్తమే!"





చలమయ్యా పెళ్లి

"ఆయన విషయం నీకు తెలిసిందేగదా, అన్నయ్యా! .. అంత పెద్ద మొత్తాన్ని ఆయన మాత్రం ఎలా తెచ్చిపెట్టగలడు?"

"నిజమే, సుశీ! .... నారాయణ విషయం నాకు తెలుసు .... ఇందులో అతని 'విషమం' అంటూ ఏదీ ఉండదన్న నమ్మకం కూడా నాకు పూర్తిగా ఉంది. కాని, అంత పెద్ద మొత్తాన్ని నేను మాత్రం ఎలా తెచ్చి యివ్వగలను?"

"అలా చెప్పకు అన్నయ్యా! .. మనస్సుంటే, తప్పక మార్గం కనిపిస్తుంది నీకు! రేపు మధ్యాహ్నానికి ఆ డబ్బు చెల్లించకపోతే ... ఆయన ... ఆయన .... ఏవిధంగానైనా .... ఆత్మహత్య .. చేసుకుంటారేమోనని ...."

"ఛీ, ఛీ!!—ఏం పాడు మాటలవి—పిరికివాళ్ళ అనవలసినవి! .... సరే! .... ఇంటికి వెళ్దాం రా, సుశీ! ...."

"మరి ... మరి .. డబ్బు విషయం? ...."

"నీకు సహాయం చేయలేని ఈ శరీరం బ్రతికి ఉంటుం దనుకున్నావా! నా ప్రాణాలను పణయం పెట్టి అయినా, నీ మాంగల్యానికి వచ్చిన ఆపదలను అడ్డగిస్తాను. వెళ్దాం రా!"

తోబుట్టువు కళ్ళలో నీళ్ళు తిరిగాయి ....

"పిల్లాడ్ని తీసుకురాలేదా?" అని ప్రశ్నించాడు చలమయ్య నిద్రిస్తున్న తన రెండేళ్ళ కొడుకును, మరో వాటాలో ఉన్న అమ్మలక్కలను చూసుకోమ్మని చెప్పి వచ్చానని చెప్పింది సుశీల

తన గదికి తాళం పెట్టిన తర్వాత, చెల్లెల్ని తీసుకుని హైరోడ్డుకు వచ్చాడు చలమయ్య. సుశీలను సవారీలో తీసుకొచ్చిన అదే రిక్షావాడు టీ కొట్టు దగ్గర కూర్చుని బీడీ కాలుస్తున్నాడు కాబట్టి, ప్రయాణం చేయడానికి వాళ్లకే అగచాట్లూ లేకపోయాయి

చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న దురదృష్టహీనులు చలమయ్య, సుశీలలు. అప్పటికి చలమయ్యకు పదమూడేళ్ళు సుశీలకు అయిదు సంవత్సరాలు చేనేత పరిశ్రమ వాళ్ళ కుటుంబ కులవృత్తి గాబట్టి, అంత చిన్నతనంలోనే చలమయ్య తన తండ్రి స్థానంలోకి జొరబడ్డాడు వాళ్ళ తల్లి అతనికి చేదోడుగా శ్రమించసాగింది. అయితే—విధి విచిత్రమైందన్న సత్యం వాళ్ళ విషయంలో ఋజువైంది. కొన్నాళ్ళ తర్వాత—ఒకనాడు, 'కలరా' సోకడంవల్ల—వాళ్ల తల్లి గూడా హఠాత్తుగా వాళ్లకు దూరమయిపోయింది ఏకాకిగా—తన చెల్లెల్ని పువ్వులాగా రక్షించాలనే ఏకైక లక్ష్యంతో చలమయ్య కొంతకాలంపాటు కష్ట పరంపరలను ఈదుతూ, తన జీవిత వృత్తినే అవలంభించాడు. అయితే చేనేత పరిశ్రమ క్షీణించే స్థితి కలగటం వల్ల, అతనికా వృత్తిలో ఏవగింపు కలిగింది. అతని ఆశయాలు సగానికి సగమయినా నెరవేరలేక పోయాయి. అంతటి కష్టదశలోనూ—ఒక వంద రూపాయలు చేర్చిపెట్టి, దాన్ని ఆధారం చేసుకుని, జీవితంలో పురోభివృద్ధి చెందాలని ఆశించి, డబ్బునూ, చెల్లెల్నీ తీసుకుని పల్లె వదిలి పట్నం

వచ్చేశాడు. కొందరి సత్పురుషుల సలహాలమీద మొదట చిన్న కిళ్లీకొట్టు పెట్టాడు చలమయ్య. సంవత్సరాలు గడిచాయి అతను పాతిన పూల మొక్కలు పుష్పించినాయి. విర గాచినాయి నిజమే. కిళ్లీకొట్టు క్రమేణా జనరల్ స్టోర్సుగా రూపొం దింది. అతని దగ్గర నాలుగు డబ్బులు కూడా నిలిచాయి. అప్పటికి సుశీల ఈడు కూడా పెరి గింది పెళ్లి కెదిగి, విరబూచిన పువ్వయింది. చలమయ్య తన కర్తవ్యాన్ని మరచిపోలేదు తన చెల్లెలకు తగిన వరుడ్నిగా నారాయణను ఏరుకుని, నిశ్చయంచేశాడు. అదేదో పెద్దకంపెనీలో లొంభై రూపాయల ఉద్యోగం చేస్తూ ఏకాకిగా జీవితం గడుపుతున్న అతనికి, తన చెల్లెల్ని పెళ్లిచేసి, వాళ్లను కుటుంబీకుల్ని చేశాడు తను సాంప్రదాయ ప్రకారం, తన తోడుసిడై పెరిగిన తన చెల్లెల్ని, భర్తతో సాగనంపి విచారాశ్రువులు నిండిన ఆశీర్వచనాలతో—ఆనందంగా నిట్టూ ర్చాడు చలమయ్య చెల్లెలికి కొడుకుపుట్టి రెండు సంవత్సరాలు గూడా గడిచింది. అయితే—ఇప్పటికి ఆమె జీవితంలో ఇంతటి అపశ్రుతులా! ....

నిర్ఘాంతిలా వచ్చుకుని, వేదన అనుభవిస్తున్న చెల్లెలి భర్తను చూసి, విచారవదనంతో నిట్టూ ర్చాడు చలమయ్య.

"బావా! .... ఈ స్వల్ప విషయానికి ఇంతగా కుమిలిపోవడం బాగుండదు! ధైర్యంగా ఉండండి! జరగవలసిందేదో, నేను చూస్తాను" అని హామీ ఇచ్చాడు చలమయ్య

అప్పుడే నిద్ర మేల్కొన్న రెండేళ్ల కుర్రాణ్ణి తీసుకొచ్చి, తన అన్నగారి చేతి కిచ్చింది, సుశీల ... ఆ పసిపాపడ్ని భుజాన వేసుకుని వీధి అరుగుమీద కూర్చున్నాడు చలమయ్య భుజాన వేసుకున్న ఆ పిల్లాడు కొంతసేపటికల్లా నిద్రిం చాడు, ఏ విచారాన్నీ మనస్సులోకి తెచ్చుకోకుండా! కాని చలమయ్య మాత్రం–ఏదో ఆలోచిస్తూనే – రాత్రి చాలాసేపటి వరకూ నిద్ర కుపక్రమించ లేకపోయాడు.

* * *

మరునటిరోజు ఉదయం—మామూలుగా నౌక రిలో ప్రవేశించడానికి వచ్చిన రంగడికి, తా డెన్నడూ ఎదురుచూడని విచిత్ర సంఘటన ఎదురయింది.

చలమయ్య కొట్టులో మరో 'చెట్టియారు' కూర్చొని ఉన్నాడు కొట్టులోని సరుకును వివ రిస్తూ—ఆయనకు లెక్క గడుతున్నాడు తన యజమాని

ఆ దృశ్యం రంగడి హృదయంలో పెద్ద గొడ్డలి పెట్టుగా నాటుకుంది పేవ్‌మెంటు మీద నిలు చున్నట్లే—చూస్తూండిపోయాడు, అర్ధగంట వరకూ

వివరాలు పూర్తి అయాక, చలమయ్య కొట్టు దిగివచ్చాడు విచారవదనంతో ఉన్న రంగడికి— విచారపు నిట్టూర్పుతో సమాధాన మిచ్చాడు యజమాని

"రంగా! అలా ఉన్నావేం ?"

"ఏమిటి బాబూ, యిదంతా! మీ కొట్టులో కూర్చున్న ఆ కొత్త మనిషి ..."

" ఇకనుంచీ, ఈ కొట్టుకు యజమాని!"

"అంటే ? .... "

"డబ్బు అవసరంకొద్దీ, కొట్టును అమ్మేయ వలసిన అగత్యం ఏర్పడిందోయ్ ... "

"బాబూ ! .... "

" .... నీ నౌకరీ వూడిపోయిందని విచారిస్తు న్నావు గదూ ! .... ఏం చేయగలను ! .... ఈ కొట్టులో నిన్నే ఉంచుకోమని చెట్టియారుకు ఎన్నోవిధాలా చెప్పిచూశాను కాని, ఆయన దగ్గర ఇంతక్రితంనుంచి మరో వ్యక్తి ఉండడంవల్ల —ఈ కొట్టులో—నిన్ను ఉంచుకోవలసిన అవసరం లేదని చెప్పేశాడు. "

చలమయ్యమాటలు విని—ముఖం దించు కున్నాడు రంగడు. వాడి నేత్రాలనుండి నీటి బొట్లు—నేలమీద రాలాయి—రక్తబిందువుల్లాగా.

"వెయ్యిన్ని రెండువందల రూపాయలలో—నా చెల్లెలి జీవితం బాగుపడగల సమయం రావడం వల్ల—నేనీ కొట్టును అమ్మేయగల స్థితి ఏర్ప డింది ఇలా చేయడం కంటే, మరో మార్గం తోచలేదు, రంగడూ !—

రంగడు తనయజమాని ముఖంలోకి చూశాడు.

వచ్చేవారం

స్వయంవరం

దేవిక

వాడికి విచారం పెల్లుబికింది. రెండు చేతులా ముఖం కప్పుకుని ఏడ్చేశాడు.

రంగడి భుజాన్ని ఆప్యాయంగా తట్టి, బుజ్జ గించవేశాడు చలమయ్య. పిదప రెండువందల రూపాయల నోట్లు జేబునుండి తీసి వాడికిస్తూ "రంగడూ !—నావద్ద నువ్వు నమ్మకంగా మూడేళ్ల పాటు పనిచేసినందుకు, ఆత్మీయతతో నడుచు కున్నందుకు—ప్రతిఫలంగా దీన్ని ఉంచుకో! అదృష్టం కొద్దీ—నేను మళ్లీ వృద్ధికి రాగల సూచనలు కను పిస్తే, నిన్ను నేను తప్పక ఆదుకుంటాను వెళ్లు" అన్నాడు

టవర్ గడియారం పదిగంటలు కొట్టి, చలమయ్యకు మరో అవసర కర్తవ్యాన్ని గుర్తు చేసింది

అతను ప్రయాణమై, తన చెల్లెలి యింటికి వచ్చి—పన్నెండు వందల రూపాయలను నారాయణ చేతికిచ్చి, నిర్లక్ష్యంగా నవ్వి వూరుకున్నాడు ఆ నిర్లక్ష్యంలో తను చెల్లెలి సౌభాగ్యంకోసం చిన్న త్యాగం చేస్తున్నట్లు మనశ్శాంతి కలిగింది

ఆపద సాగరంలో చెలరేగిన అవమానపు తుఫాను వల్ల మునిగిపోతోన్న తన జీవిత నౌకను రక్షిం చిన తన అన్నగారి పాదాలకు నమస్కరించింది సుశీల.

"నా గౌరవాన్నీ, ఉద్యోగాన్నీ కూడా నిల బెట్టారు, బావగారూ!— మీ ఋణం త్వరగా తీర్చు కుంటాను" అన్నాడు నారాయణ కృతజ్ఞతతో.

"నీ పిచ్చిగాని, ఋణం తీర్చుకోవలసిన బాధ్యత నాది మాత్రమే, నారాయణా!—నాకు, నా చెల్లెలి సుఖంకంటే, కావలసిం దేముంది, చెప్పు!—" అన్నాడు చలమయ్య—అనుబంధ పాశాలను హృద యంలో కుదించుకుంటూ

నారాయణతోపాటు చలమయ్య కూడా వెళ్లి, కంపెనీలో డబ్బు కట్టి వచ్చారు.

అయితే—కంపెనీకి చెల్లించిన అంత డబ్బు, ఎలా సంపాదించానన్న విషయాన్ని, ఎవరికీ చెప్పడానికి నిరాకరించాడు చలమయ్య.

* * *

ఒక వారం రోజుల తర్వాత—

ఒకానొక రాత్రి తొమ్మిది గంటలకు తన గదికి వచ్చాడు చలమయ్య. తన జీవిత గమనంలో అసం తృప్తి, సుఖంలేని బ్రతుకు బ్రతుకుతున్నట్లు నిరుత్సాహం—అతన్ని పీడించింది. ఏకాకి నివాసా నికీ, హోటలు తిండికీ అలవాటుపడ్డ అతని శరీరం నిరుపయోగమైన మొక్కగా తయారవు తున్నట్లు కన్పించింది. ఇప్పుడు తను నివాసం లేరగానే తన బాధలను తమునింప చేయగల తోడు నీడ, చిరునవ్వుతో పలకరించగల దిక్కూ—ఇవన్నీ తన జీవితానికి అవసరమన్న ఆశయం అతన్ని వేధించింది.

ఏ అడ్డంకులూ లేక—మనిషిని లోబరచుకోగల శక్తి ఒక్కటే ఉంటున్నది లోకంలో!—అది ః నిద్ర

ఆలోచనా వేధనలతో అలసి సొలసి, ఆఖరికి నిద్ర కుపక్రమించబోయి కనులు మూశాడు చలమయ్య. అంతలో—

"చలమయ్యా!—" అని పిలుస్తూ భద్రయ్య అతన్ని సమీపించాడు.

"రా, భద్రయ్యా!—కూర్చో!—" అన్నాడు చలమయ్య

"ఇప్పుడే వచ్చి—వచ్చీ రాగానే, పడక వేశావన్న మాట! .. అంతేలే! ఏకాకివి .. . జీవితం ఎట్లా ఉన్నా, నీకు సరిపోతుందిలే!"

"నీమాట నిదిగాని—భద్రయ్యా!—నాకు ఒక్క సందేహం! కోరికలు లేని మానవు డంటూ— ఎవడైనా, ఈ ప్రపంచంలో ఉంటాడంటావా ?"

"ఉంటాడు ... "

"ఆశ్చర్యమే!—మరి ఎవరు, ఎక్కడుంటా డంటావ్ ?"

"సన్యాసి!—ఇక్క డుండడులే!—ఏ కారడవు ల్లోనో, పర్వతశిఖరాల్లోనో తపస్సు చేస్తూ ఉంటాడు!"

"సన్యాసికీ—మోక్షం సిద్ధించాలన్న కోరిక ఉంటుంది కదా!—"

"నిజమే కాని, అది మరో లోకపు మాట గదా!—"

"మంచి వేదాంతమే .." నవ్వాడు చలమయ్య.

భద్రయ్య కూడా కొంతసేపు మనసు విప్పి నవ్వుకున్నాడు పిదప—"ఆఁ! చెప్పడం మరచాను చలమయ్యా!—మీ చెల్లెలి భర్త—నారాయణ—

చలమయ్య పెళ్లి

ఇంతవరకూ నీకోసం ఎదురుచూస్తూ కూర్చుండి ఇప్పుడిప్పుడే వెళ్లాడు" అన్నాడు.

"అలాగా! నేను రావడం ఇవాళ కొంత ఆలస్యమయింది గాని, అతనేమైనా చెప్పాడా ?"

"ఆ!—తన పిల్లాడికి, రేపటికి పుట్టినరోజు పండగట! ఏవో పనులకొద్దీ, నిన్ను పిలవటానికి మీ చెల్లెలు రాలేకపోయిందట ఆ శుభకార్యాన్ని నువ్వు దగ్గరుండి జరిపించవలసిందిగా చెప్పమని, నిన్ను తప్పకుండా రమ్మని మరీ మరీ చెప్పి, వెళ్లాడు!"

"సంతోషం!—" అని నిట్టూర్పు విడిచాడు చలమయ్య .. అయితే తను వెళ్లడమనేది సాధ్యమా అన్న సందేహం అతన్ని వేధించింది ఆ బాధను భద్రయ్య ఎదుట కనబర్చుకోలేకపోయాడు కూడా!

ఆతర్వాత ఆ మిత్రులిద్దరూ లోకాలోకనం గురించి చర్చించుకుంటున్న సమయంలో—

"బాబూ! ...." అనే పిలుపు విని, వాళ్లిద్దరూ వీధిలోకి తిరిగి చూశారు కుర్రాడు రంగడు వీధిలో నిల్చున్నాడు. అతని వెంబడి మరో మగువ, చీరచెరగు భుజానికి చుట్టుకుని నిలబడి ఉంది

"రంగడూ! ... " అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చలమయ్య

"నేనే బాబూ! "

"అక్కడే నిలబడ్డావేం ?—ఇలారా" అని చలమయ్య సమాధాన మిచ్చిన తర్వాత, రంగడు వాళ్లను సమీపించాడు. "ఇలా వచ్చావేం ? ఎక్కడైనా పనిలో ఉంటున్నావా, లేదా ?" అని ప్రశ్నించాడు చలమయ్య

"లేదు .... బాబూ! .... " అని నెమ్మదిగా ముఖం దించుకున్నాడు రంగడు

"ఫరవాలేదు. ఆ! ... నీతోబాటు "

" ..... మా అక్కయ్య కూడా వచ్చింది బాబూ! .... మీతో మాట్లాడాలిట!" అని ఆమె వేపు తిరిగి "అక్కయ్యా!—ఈయనే నే చెప్పిన చలమయ్యబాబు .." అన్నాడు. ఆమె చలమయ్య కేసి ఒకసారి చూసి, నమస్కరించి, ముఖం దించుకుంది ఆమె వినయసంస్కారాలు, చలమయ్యను లజ్జాపూరితసంశయాలకు గురి చేశాయి

"రండి, కూర్చోండి" అన్నాడు చలమయ్య తడబడుతూ.

ఆమె కూర్చోకుండానే స్తంభం చాటున నిలుచుంది

"ఏమిటమ్మాయ్ విషయం ?" అని ప్రశ్నించాడు చలమయ్య.

"మరేం లేదు ...." అనే ఆమె జవాబు విని, మిత్రులిద్దరూ సంశయంతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కాని, అంతలో ఆమె మళ్లీ ఇలా అంది: "మీ దగ్గరనుండి వచ్చేశాక, మా తమ్ముడికి మరెక్కడా నౌకరీ దొరకలేదు ... ఎంతో శ్రమ పడుతున్నాం .."

"నేను కొంత డబ్బు యిచ్చాను గదా! వాడికి

నౌకరీ దొరికే వరకూ—దాన్ని ఉంచుకుని కాలం వెళ్ళనీయకూడదూ ?" అన్నాడు చలమయ్య

"మీరు ఇచ్చిన డబ్బు—మా పొట్టలు నింపుకోడానికే నన్న తలపు—మా కింతవరకూ లేదు !"

"అంటే ?"

"మీరు మరోచోట, చెమటోడ్చి; చేతులు కట్టుకు పనిచేస్తున్నప్పుడు—ఏ చీకూ చింతా లేకుండా—మీ రిచ్చిన డబ్బును ఖర్చుచేసి, మేము సుఖపడాలనే కోరిక మా మనస్సులకు నచ్చలేదు. ఇదిగో .. మీ రిచ్చిన డబ్బు ... " అంటూ కొంగు నుండి, మడచిన రెండు వందల రూపాయల కాగితాలను అతని కందివ్వబోయింది

ఆమె ముఖంలోకి రేఖలరంగులను, ఇప్పుడు స్పష్టంగా చూడగలిగాడు చలమయ్య. కాని, అదే సమయంలో—ఆ డబ్బుకేసి విచిత్రంగా చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు కూడా !—"ఈ డబ్బును రంగడికి నేను ఊరికే యివ్వలేదు. నావద్ద నౌకరీ చేసినందుకు, గౌరవంగా—నమ్మకంతో బ్రతికినందుకు ప్రతిఫలంగా, బహుమానంగా యిచ్చాను. దాన్ని మళ్ళీ నాకు తిరిగి యిచ్చేయడంలో, మీ భావాలు నాకు అర్థం గావడంలేదు ?" అన్నాడు.

"ఈ డబ్బును, మేం ఉంచుకుని మాత్రం చేయగలిగిం దేముంది చెప్పండి ? దాన్ని ప్రయోజనకరంగా ఉపయోగించుకోగల జ్ఞానం, మా తమ్ముడికి లేదాయె ! అందుకని, ఈ డబ్బు అదుకోవడంలో—మీకూ మంచిదారి ఏర్పడగలిగితే మేమెంతో ఆనందిస్తాం మే మిద్దరం పేదలంగానే పుట్టాం, పేదలంగానే పెరుగుతున్నాం. మీ ఆదరణ వల్ల—నాకుగాని, నా తమ్ముడికి గాని, మరో మంచి దారి ఏర్పడగల సూచనలు ఏర్పడగలిగితే . "

"ఏమిటా మంచిదారి ?" అంటూ మధ్యలో అడ్డు ప్రశ్న వేశాడు చలమయ్య.

"గోదారి !" అంటూ చలమయ్యను ఎక్కిరించాడు భద్రయ్య. "అర్థంచేసుకోలే వేమిటయ్యా !—పెళ్ళి కెదిగిన అమ్మాయి జీవితానికి మంచిదారి ఏముంటుంది, పెళ్ళి తప్పితే ?"

"ఓ తప్పటడుగులు వేశావన్నమాట" అని నాపోయాడు చలమయ్య.

"అమ్మాయ్ !—భగవంతు డెప్పుడూ—మనిషిని ఏకాకిగా పుట్టించడంలేదు ! తోబుట్టువులు లేకపోయినా, అనుబంధాలు లేకపోయినా—మానవులకు—ఒకర్ని ఒకరు అర్థం చేసుకోగల విలువైన హృదయాల నిచ్చాడు దేవుడు ఆ మంచి హృదయం ఉన్న ఎవరూ—ఎదుటివారిని ఏకాకిగా చూడరు. నువ్వా ఏకాకిగా పారబడడం అంత మంచిది గాదు నీకు నేను తోబుట్టువులాంటివాడ్ని ... ఏవిధమైన సంశయం లేకుండా—నీ మనస్సులోని మాటను నావద్ద చెప్పు తల్లీ !" అన్నాడు భద్రయ్య—పిల్లల తండ్రి

చలమయ్యవేపు చూసి ఇలా అంది ఆమె .

"బాబూ !—మీ రిచ్చిన డబ్బు మా కెలాగూ ప్రయోజన పడదని మేము తెలుసుకున్నాం కాబట్టి మీ దగ్గర నప్పగిస్తున్నాం ఆ డబ్బుతోపాటు మరో కొంత డబ్బును పొందికచేసి, చిన్న కొట్టు ఏర్పాటు చేసే ప్రయత్నం చేయండి ! ఆ కొట్టులో మా తమ్ముడికి చిన్న 'ఉద్యోగం' యిప్పించండి. అందులో వచ్చే కొద్దిపాటి జీతంరాళ్ళతో మా పొట్టను నింపుకొంటాం, మా జీవితం అంత మాత్రం సాగితే, చాలు !—అదే మా కోరిక !.. "

ఆమె మాటలు విని, నిశ్చేష్టు డయ్యాడు చలమయ్య . ఆమె తన ముందుంచిన డబ్బును చూస్తూ—ఆలోచనలో పడిపోయాడు

జీవిత పురోభివృద్ధికై ఆమె చూపిన మార్గదర్శం ఎంత ఉత్కృష్టమైనదీ అర్థం చేసుకుని ఆనందంగా నవ్వుకున్నాడు భద్రయ్య.

"ఆలోచించండి !—వెళ్ళొస్తాను . . " అని, వీధి వేపుకు నడిచిం దామె.

ఆమెను వెంబడించిన రంగడిని, కేకవేసి పిలిచాడు భద్రయ్య

"మీ అక్కయ్య పేరు చెప్పావుగాదు ?"—బుజ్జగింపుగా అడిగాడు

"చిట్టి—చిట్టమ్మ ! .... " అని నవ్వుతూ జవాబిచ్చి, ఆమెను వెంబడించి కను మరుగై పోయాడు రంగడు.

"చలమయ్యా !—ఏమిటాలోచిస్తున్నావ్ ?" అని ప్రశ్నించాడు భద్రయ్య.

"భద్రయ్యా !—ఆమె యిచ్చిన సలహాను గురించి నీ అభిప్రాయ మేమిటి ?" అని అడిగాడు చలమయ్య

"ఇలాంటి సలహాలు యివ్వగల ఆడవాళ్ళు లోకంలో పుట్టడం అరుదు వాళ్ళే వెనకటికి

"నేనీ మధ్య 'వైట్ హౌస్'కి వెడదామని బయలుదేరాను. దారిలో ఒక తమాషా జరిగింది" అని శ్రీ అడ్లాయ్ స్టీవెన్సన్ ఒక ఉపన్యాసం ప్రారంభించాడట.

ఎల్. ఎన్. (మద్రాసు)

మంత్రి స్థానాల కెక్కుతా రనుకుంటూ ... అయితే చిట్టి విషయం వేరు !"

"అంటే ?"

"ఇప్పటికి ఏకాకి గదా—"

"అందుకే, నే నొక్క నిశ్చయానికి వచ్చాను నాదగ్గర మూడొందల రూపాయ లున్నాయి రంగడిడబ్బు రెండు వందలూ కలిపి— పెద్దగా కొట్టు పెట్టుకొనే ఏర్పాటు చేసి, ఇద్దరం భాగస్వాములు కాబోతున్నాం "

"అంతేనా ? . మరేం విశేషవిశేషణం లేదూ?"

"ఉంది .. . అయితే, ఆ విశేషణ మేదో నే నిప్పుడు చెప్పదలుచుకోలేదు . "

"చాల్లే, బిగువు !—నాకూ తెలుసులేవోయ్ !" అని బిగ్గరగా నవ్వేశాడు, భద్రయ్య.

* * *

తన చెల్లెలి కుమారుడి పుట్టినరోజు పండగ ఆనందాన్ని అనుభవించాలన్న ఆశయం చలమయ్యకున్నా, ఉద్యోగ ధర్మం అతన్ని అక్కడికి పెందరాళే వెళ్ళనీయకుండా చేసింది ఆరోజు రాత్రి ఎనిమిది గంటల ప్రాంతానికి తన చెల్లెలిల్లు చేరాడతడు. అతని రాకకోసం ఎదురుచూస్తున్న సుశీల అల్పానందంతో అతన్ని ఆహ్వానించింది. చెల్లెలి కొడుకును చేతులకు తీసుకుని, హృదయపూర్వకంగా ఆశీర్వదించాడు చలమయ్య అంతా చూస్తూ, నారాయణ నిస్తబ్ధతగా ఉండిపోయాడు

చెల్లెలి బలవంతంమీద భోజనానికి అక్కడే కూర్చున్నాడు చలమయ్య అతనికి వడ్డిస్తూ, సుశీల కళ్ళనీళ్ళు పెట్టుకోవడం గుర్తించాడు తను

"ఉన్న కొట్టును అమ్మి, నా సుఖం కోసం ఎంత త్యాగం చేశావు, అన్నయ్యా ! కాని, ఇప్పటికి—ఇంకొకరికి చేతులు కట్టుకుని నౌకరీ చేయగలుగుతున్నావు . ఎంత దురదృష్టం ! —అంతా నావల్లనే గదూ !" అని కుమిలిపోయింది సుశీల

"సుశీలా ! జీవితమంటే, ఎంత విలువైన వస్తువో, నాకు తెలుసు కాబట్టే అలా చేయవలసివచ్చింది ఎవరికోసం— ? నా ఒక్కగా నొక్క చెల్లెలి కోసం—తల్లిని పోగొట్టుకున్న పిల్ల కోసం —నీ కోసం ! నీ సుఖం కంటే, నా క్కావలసిం దేముంది చెప్పు !—ఏకాకిగా ఉన్న నేను ఎలా బ్రతికినా సరిపోతుంది !" అన్నాడు చలమయ్య.

"ఇకమీదట అదేం వీలుగాదు, బావగారూ ! .." అంటూ రంగంలోకి జొరబడ్డాడు నారాయణ.

"ఏమిటి ?"

"మా సుఖం కోసం మీరెంత త్యాగం చేశారో ఆ కృతజ్ఞతతోనైనా—మిమ్మల్ని సుఖపెట్టడానికి మేము మరో నిశ్చయానికి వచ్చాం .. "

"అబ్బో! పెద్ద ఆలోచనలే మరి ! మీ నిశ్చయం ఏమిటో ?"

"మీకు పెళ్ళి జరిపించడం!" అని నవ్వాడు నారాయణ

"పెళ్ళి?! ... " అని ఆశ్చర్యార్థంతో వెక్కిమొగం వేసి, నవ్వేశాడు, చలమయ్య .... "ఆ విషయంగురించి, నాకే అవసరం కలగనప్పుడు?"

"మీ అవసరావసరాలు మాకు తెలియదేమిటి ? మీ పొరుగింటి మిత్రుడు—భద్రయ్య అన్ని విషయాలు చెప్పాడులెండి !" అన్నాడు నారాయణ.

"కాబోయే వదిన పేరు నాకు తెలుసు .... చిట్టి! చిట్టమ్మ.... " అని నవ్వింది సుశీల. "వైశాఖంలో మీకు ముహూర్తం పెట్టించా లనుకుంటున్నాం .... పెళ్ళి పెద్దలం మేమే, మరినూ !"

"మీ రనుకున్నంత దగ్గర్లో ముహూర్తం పెట్టించడం నా కిష్టంలేదు .. డబ్బూ, వసతీ వగైరాలు చూడాలి గదా ?" అన్నాడు చలమయ్య.


"ఆ విచారం మీ కక్కర్లేదు" అన్నాడు నారాయణ

"ఏమిటయ్యా, నీ సొద !" అని పరిహాసంగా నారాయణను మందలించాడు చలమయ్య.

"ఓహో !—అసలు విషయం మీకు తెలియదేమిటి, బావగారూ !—నా జేబుకొట్టేసిన దొంగ—పోలీసులకి పట్టుబడిపోయాడు! డబ్బులో రెండొందలు హరించిపోయినా, వెయ్యి రూపాయలు చేజిక్కిందట .. కోర్టులో తీర్పు కాగానే, అవి నాచేతికి రాదూ ? అవే, మీ పెళ్ళికి ఖర్చులు ...." అన్నాడు నారాయణ—నవ్వుతూ.

"నిజంగా ! .... " అని ఆశ్చర్యపోయాడు చలమయ్య. ★

గళ్లనుడికట్టు - 84



అడ్డం

1 2 నిలువుకి ప్రథమావిభక్తి చేరిస్తే అల్ప మయిపోతుంది

5 ఈ పత్రికలో ఒక వాణికి మూలమా ?

7. కలిసి ఉండగోరే గుణం గోవులు, తనంత అంటే తెలిసిపోవాలి.

9 రోజా.

10 ఆపద; బలపములో రెండు అక్షరాల మధ్య ఒక సరళము చేర్చాలి

13 నలుగు, చెడు

15 న్యాయవాది (ఇంగ్లీషుమాట)

16 కలగాపులగమయిపోయిన వరుసలు.

19 17 నిలువులో ఒకటి చిందరవందర అయి పోయింది.

20 ఆపద.

21 జ్యోతిష శాస్త్రానికి సంబంధించినది.

23 విశ్వనాథ సత్యనారాయణగారి ఒక నవల పేరు బహువచనం.

26 కత్తిరించేది.

27. శత్రువు పరిగెత్తువాడులో ఉన్నాడు.

నిలువు

1 కబళం.

2 వేడియవక యేమగును ?

3 అదిగో, పట్టణములు !

4 సన్నబడు.

5 నీటిలో మృగం.

6 తగువులాటలో యుక్తమగు.

8 నమస్కారము ! బాగా చూడండి మనస్సుకు నచ్చేది దొరుకుతుంది !

9 ఒక రకమయిన సుయ్యి

11 ఇది చిత్తగించా రంటారు!

12 ఇంద్రుడు.

17 తునియ రెండుసార్లు . ....

18 ఇది తినాలని ఎవరికి ఉండదు ? నైషధం చదవాలా ?


22 కప్ప ధ్వనిలో సగం మాత్రమే·

23 జైలు

24 ఎస్నో తలక్రిందులు.

25. మంచిది కానిదిగానము చేయు.

83-వ గళ్లనుడికట్టుకు జవాబు



ఒక క్లాసు టీచరుగారు పిల్లల నెప్పుడూ పత్రికలు చదవ మని చెప్పడుతూ ఉండేవాడు. ఒకరోజు క్లాసులో వార్తా పత్రికలు చదివారో లేదో నని పరీక్ష చేస్తున్నాడు. మామూలు ఉపన్యాసం తర్వాత ఒక విద్యార్థిని ఆ రోజు వార్త లేమిటో చెప్పమన్నాడు. ఆ విద్యార్థి కొంచెం తటపటాయించి, ప్యాట్రిస్ లుముంబా మరణించిన వార్త చదివానన్నాడు "అలాగా!" అని ఉపాధ్యాయులు ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయారు.

పి. యస్ ఆర్. (గుంటూరు)

న్యూ ఢిల్లీ లేఖ

7వ పేజీ తరువాయి

కోల్పినట్లు ఇటీవల ప్రధాని చెప్పారు. 'అయితే ఇవి సరిహద్దుకు మైలు ఇటు ఉన్నాయో, అటు ఉన్నాయో నిశ్చయంగా చెప్పటానికి వీలుకాదు'' అని కూడా వారు అన్నారు కాని యీ ప్రాంతాలు భారత భూభాగంలోనివే నని మన మాప్‌లు స్పష్టం చేస్తున్నాయి 1961 అక్టోబరు 31 వ తేదీ నిరసనపత్రంలో వీటిని వశం చేసుకొనటం 'దురాక్రమణ' గానే పరిగణిస్తున్నట్లు ఉన్నది.

'ఆరోజు మధ్యాహ్నమే శ్రీ నెహ్రూ రాజ్య సభలో, లాంగ్జూ సరిగ్గా సరిహద్దు మీద ఉన్నదనీ, అందువల్ల అది సరిహద్దుకు కొంచం ఈవల ఉన్నదా, ఆవల ఉన్నదా అన్నది వివాదాస్పదమైన విషయమనీ "చెప్పారు.''

''ఇది పూర్తిగా సత్యదూరమైన ప్రకటన 'లాంగ్జూ నిస్సందేహంగా మా భూభాగంలోనే, అంతర్జాతీయ సరిహద్దుకు రెండు మైళ్ళ దక్షిణంగా ఉన్నద' ని భారత ప్రభుత్వం 1959 ఆగస్టు 28వ తేదీన పెకింగ్‌కు పంపిన అధికారపత్రంలో పేర్కొన్నది. 'ఈ ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దును గూర్చి ఏవిధమైన వివాదానికీ తావు లేదు. దీనిని (లాంగ్జూ) ఆక్రమించటం భారత భూభాగంమీద దురాక్రమణ జరిపినట్లే అవుతుంది'' అని కూడా ఆ పత్రంలో ఉంది అటు తరువాత భారత ప్రభుత్వం చైనాకు అందజేసిన ప్రతి లేఖ ఈ విషయాన్ని ధృవపరిచింది నిన్న మొన్నటి వరకు శ్రీ నెహ్రూ కూడా ఈ మాటే అంటూ వచ్చారు''

''ఇంతకుమునుపు శ్రీ నెహ్రూ అక్సాయ్‌చిన్ ప్రాంతాన్ని గూర్చి ఒక విచిత్రమైన వ్యాఖ్యానం చేశారు ఈ ప్రాంతం 'నిస్సందేహంగా భారత భూభాగంలోనిదే' నని భారత ప్రభుత్వం పంపిన అనేక అధికార పత్రాలు వక్కాణించాయి 1959 సెప్టెంబరు 12 వ తేదీన లోక్‌సభలో మాట్లాడుతూ శ్రీ నెహ్రూ యిలా అన్నారు : అక్సాయ్‌చిన్ ప్రాంతం మన భూభాగంలోనే ఉన్నట్లు మన మాప్‌లు తెలుపుతున్న మాట యథార్థమే. అయితే ఇతర ప్రాంతాలకు దీనికి తేడా ఉన్నదనే నా వాదం ఈ ప్రాంతంలో ఏ భాగం మనదీ, ఏది యితరులదీ అన్నది అంత విస్పష్టంగా ఉన్న విషయం కాదు''

చైనీయుల దురాక్రమణను, మన భూభాగాన్ని సంరక్షించటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చి ప్రజల దృష్టిని మరల్చడానికే ఇప్పుడు గోవామీద చర్య తలపెట్టారని కొందరి అభిప్రాయం నిర్జనమూ, సైనికరీత్యా అప్రధానమూ అయిన పర్వత శిఖరాల కోసం దేశాన్ని యుద్ధంలోకి దించేందుకు శ్రీనెహ్రూ అంగీకరించరని కొందరు వాదిస్తే వాదించవచ్చు సైనికరీత్యా నైతేనేమి, ఆర్థికంగా నైతేనేమి కొన్ని ప్రాంతాలు బొత్తిగా పనికిరానివని అనుకున్నప్పుడు, చైనాతోనే కానివ్వండి, పాకిస్తాన్ తోనే కానివ్వండి, భారతదేశం నిరర్థకమైన వివాదానికి దిగవలసిన అవసర మేమిటో తెలియదు. ఈ సందర్భంలో నాకొక కథ జ్ఞాపకం వస్తోంది. మన దేశంమీద 17 సార్లు దండయాత్రలు జరిపిన మహమ్మద్‌గజ్‌నవీ పరిపాలన నాటి గాథ ఇది. ఒక వృద్ధురాలు గజ్‌నవీకి ఒక మహజర్ సమర్పించుకున్నది బందిపోటుదొంగలు తన ఇంటిమీద పడి దోచుకున్నారనీ, తన ఒక్కగా నొక్క కొడుకునూ చంపారనీ అందులో విన్నవించుకున్నది మహజర్ చూచి ''అవ్వా నా రాజధానికి నీ గ్రామం చాలా దూరంలో ఉన్నది అందువల్ల నేను చేయగలిగిం దేమీ లేదు'' అని గజ్‌నవీ సమాధానం యిచ్చాడట. ఆమాట విని ఆమె 'అయ్యా ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించలేనప్పుడు తమ రాజ్యాన్ని ఇంతదూరం ఎందుకు విస్తరింప జేసుకున్నారు ?' అని అడిగిందట అప్పుడు గజ్‌నవీ సిగ్గుపడి దుండగులను శిక్షించేందుకు తగు చర్యలు తీసుకున్నాడట ఈనాడు మన ప్రభుత్వం ఒకవంక చైనీయులు ఆక్రమించిన ప్రాంతాలు దుర్గమమైనవని చెబుతూ, వేరొకవంక నిరసనపత్రాలు నిరంతరాయంగా పంపుతోంది. గోవామీద భారతదేశం తీసుకునే చర్యను చూచి చైనీయులు బెదరిపోతారని అనుకోటం పొరపాటు.

మరొక ప్రయోజనం ఆశించి కూడా ఇప్పుడీ గోవా విమోచన చర్యను తలపెట్టారని అనిపిస్తోంది. శ్రీ కృష్ణమీనన్ బొంబాయి నియోజకవర్గంనుంచి ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. అక్కడ ఆయన పరిస్థితి ఏమీ అనుకూలంగా లేదు కాబట్టి, ఈ ద్వారా వారి పలుకుబడి పెంచవచ్చునని ఆశిస్తున్నారనుకోవచ్చు

* * *

శ్రీ జయప్రకాష్ నారాయణ ఈ వారంలో ఢిల్లీ వచ్చారు. ''శాంతిసేన'' తాలూకు ఒక దళం కూడా వారి వెంట వచ్చింది ఈ దళం న్యూఢిల్లీ వీధులలో పూరేగి, బాబు రాజేంద్రప్రసాద్‌కు జన్మదిన శుభాభినందనలు తెల్పడానికి, రాష్ట్రపతి భవనానికి వెళ్లింది నాటి సాయంత్రం బహిరంగ సభ ఏర్పాటైంది ప్రధాన మంత్రి ఈ సభలో పాల్గొన్నారు దేశ భద్రతవిషయమై వారు మొట్టమొదటి సారిగా యథార్థ వైఖరిని ఈ సభలోనే వ్యక్తం చేశారు. గోవా సమస్య వంటి జటిలమైన సమస్యల పరిష్కారానికి శాంతియుత విధానాలకే కట్టుబడి ఉండటం సాధ్యంకాదని ఆయన అన్నారు. శాంతి సేనా సమితి లక్ష్యాలనే తాము ఆచరించవలసి వస్తే సైనిక, పోలీసు శాఖలను రద్దుచేసి ప్రధానమంత్రి పదవినుంచి తప్పుకోవలసి ఉంటుం దన్నారు ఆధునిక రక్షణ దళాలు అవసరమయ్యే చోట్లకు ఈ శాంతిసేన వెళ్లి దేశ సరిహద్దులను ఏవిధంగా కాపాడగలదో తమకు అర్థంకావటం లేదనిచెప్పారు శాంతిసేన ఏర్పాటుకు సంబంధించిన యోచన ఉత్తమమైనదే అయినా, ప్రస్తుత పరిస్థితులలో దాని లక్ష్యాలు ఆచరణ సాధ్యం కావని ఒప్పుకున్నారు

సహకార నిరాకరణ పద్ధతు ద్వారా ఏ దేశానికైనా విమోచన కలిగించవచ్చుననే గాంధిజీ సిద్ధాంతాన్ని శ్రీ నెహ్రూ త్యజించినట్లు ఈ ప్రసంగంవల్ల స్పష్టమవుతున్నది ఆ విధానాలు బ్రిటన్ వంటి నాగరికదేశంపై పనిచేసి ఉండవచ్చును కాని, కమ్యూనిస్టు నియంతృత్వాలపై పనిచెయ్యవని భారతదేశానికి ఇప్పుడిప్పుడే కనువిప్పు కలుగుతోంది. ★

యువ ప్రపంచం

వరకట్నాస్త్రాలు

[ఈ శీర్షికకు 'వరకట్నాల' మీద చాలా మంది రాసి పంపారు. మొదట్లో ఆశ్చర్యం కలిగించినా ఇది యువతీయువకులకు సంబంధించిన విషయమే కాబట్టి కొన్ని 'ఉదాహరణలు' ప్రచురిస్తున్నాము. 'పాత చింతకాయ పచ్చడిని' మళ్లీ వడ్డిస్తున్నామని పాఠకులు భావించరని ఆశిస్తున్నాము.]

*   *   *

50 మెగాటన్నుల బాంబు ప్రేల్పులు, తద్వారా రేడియోధార్మికశక్తి, ప్రజల, ప్రపంచ వినాశం మొదలగునవి యీనాటి రాజకీయాలు. కానీ! పూర్వం నుండి జరుగుతున్న "కట్నాణ్వస్త్రం" పరిశోధనలు, మగ సంతతికల మగ మహానీయులు (ఆడ గార్డియన్లు కూడ) ప్రారంభించిన సాంఘిక సంక్షోభం. దాని భయంకరజ్వాలలు (రేడియో ధార్మికశక్తి లాటిదే) నల్దిక్కుల ప్రసరించి అమ్మాయిల అమ్మా, నాన్నలకు అక్షయపాత్ర అందిస్తున్న సందర్భాలే చర్చించవలసివచ్చింది. చూడండి, వరుల తండ్రులందరూ (90%) తమ అబ్బాయిల ఉన్నత విద్యాభ్యాసానికి వెచ్చించిన సమస్తం, నయా పైసలతో సహా కోడలి తరఫు నుండి గుంజాలని, కట్నాల పాట (వేలం) స్థాయి హెచ్చిస్తుంటారు. అయితే!

అబ్బాయిలసంగతి చూడండి, మేమే అమెరికా, యూరోపు ఖండాలు వెళ్లాం కదా! అని కాక్ టెయిల్సు, బూట సవరింపే గానీ, మనసులోని మలినాల మరలింప ధ్యాసే వుండదు. (ద్వేషించకండి, అటువంటివారి నుద్దేశించి)మా అమ్మా, నాన్నే గా! కట్నాలు అడిగేది? అడగనీ, అదీకాకుండా నే చెడ్డవాణ్ణి కాకుండా, అణకువగా, అయినే, ఆ వసేదో చూసేంతవరకు నా "నర్" నలగకుండా కూర్చుంటే సరిపోతుంది. "పోనీ, యీ మేనా రంభ...మరొకరింటికి వెళ్దాం" అనుకుని, నలురితో విహారంగా పదిమందిని చూస్తుంటారు!

అన్నా (బందరు)

*   *   *

ఈ మధ్య కొంతమంది సంస్కరణావశులైన యువకులు కట్నం విషయంలో తలిదండ్రులకు నచ్చచెప్పాలనే ఉద్దేశంతో, 'చూడండి నాన్నగారూ! మనం యిలా కట్నంకోసం పట్టుదలగా వుంటే ఏం బాగుంటుంది మనకున్నది మనకు చాలదూ! వాళ్లు నాలుగు వేలిస్తే మిగిలిపోతుందేమిటి? అంతకంటె ఎక్కువ ఇవ్వలేమని అంటున్నారు. మిగతా అన్ని విషయాలలోను ఆ అమ్మాయి నచ్చింది కదా మనకి' అంటూ చెప్పబోతారు, తండ్రి మండిపడ్తాడని తెలిసి భయపడుతూ. ఈ మాట వినేసరికి తండ్రి తాటిప్రమాణాన లేస్తూ "అమ్మాత్రం మంచి చెడ్డలు నాకు తెలియవనుకున్నావా? అన్నీ నచ్చితే మాత్రం కట్నం నచ్చవద్దా. అసలు కట్నం నచ్చితే మిగతావన్నీ ఎలాగైనా సర్దుకోవచ్చు. ఎం.బి.బి.యస్. పాస్ అయిన కుర్రాడికి పదివేలకి తక్కువ ఏ తండ్రి తీసుకుంటాడో చెప్పు?" అని గర్జిస్తాడు. అప్పుడా యువకుని పరిస్థితి ఎలా ఉంటుంది?

నంబూరి అలివేలుమంగ (తణుకు)

*   *   *

నేటి యువకులు పైకి మేకపోతుగాంభీర్యమే గాని నాన్న ముందు నిలబడేటప్పటికి నీరయిపోతారు. వారు నిరక్షరాస్యులా కాదు! పట్టభద్రులు! తండ్రిగారి ఆస్తిరాదా? రాకపోతే యేమి? తమ చేతులు కాళ్లు సరిగా ఉన్నంతవరకు ఇతరులపై ఆధారపడవలసిన ఖర్మ యేమి? మాకు అవేమీ పట్టింపులు లేవుగాని, మేము మా తలిదండ్రులమాట జవదాటము అంటారు!

పాణంగి కృష్ణమోహన్,
(సికింద్రాబాదు.)

*   *   *

మన యువ జనత ప్రస్తుతం ముఖ్యంగా చర్చించవల్సిన ముఖ్య విషయాలు మూడు. అవి: నైతిక విలువలు కాపాడుకోవడం, స్నేహ సంబంధాలు, కుల మత రహిత సమాజానికి నాంది ప్రస్తావనగా ప్రేమ వివాహాలు

యువ ప్రపంచం పురోగమించగలదనే ఆకాంక్షతో—

పి. వి. కె రాజు, (జిన్నూరు)

*   *   *

ఉండబట్టలేక రాస్తున్నాను! మన విద్యార్థులు అనేకులు గిరజాలు పెంచడం, మెడలో బంగారుగొలుసు ధరించడం, పువ్వుల అల్లికలు గల బనియన్లు వేసుకోవడం - ఇవన్నీ చూస్తే వీరు వీలైనంతవరకు స్త్రీలను పోలాలని ప్రయత్నిస్తున్నారా, అనే అనుమానం కలుగుతూ ఉంటుంది. చౌకబారు సెంట్లు, పౌడర్లు, స్నోలు ఉపయోగిస్తే ఈ అనుమానం ఇంకా బలపడుతుంది! ఇటువంటివాళ్ళను ఒకసారి చార్మినార్ (హైదరాబాదు) లో పరిసరాలను పరికించమని కోరడంకన్నా వేరే చేయగలిగినదేముంది?

ఎస్. కె. (విజయవాడ)

*   *   *

చిత్రలేఖనం : వాస్తవికత

8-12-61 సంచికలో, శ్రీ ఎస్. వి. రామారావుగారి "నీలాటిరేవుకాడ" చిత్రం ప్రచురించగా, చూడగనే యీ సందేహం వ్రాసి, నివృత్తి చేసికోవాలనుకుంటున్నా. దయయుంచి సహృదయతతో సమాధానం యివ్వగలరని ఆశిస్తున్నా. వారు చాల ప్రసిద్ధి చెందిన చిత్రకారులు. అయితే యీ ప్రచురించబడిన చిత్రంలోని భావగాంభీర్యం ఏకోవకు చెందినది? ఆ చిత్ర రచన - మాబోటి సామాన్యులకు అత్యంత దుర్భేద్యమైన సమస్యగా ఉంది. అస్వాభావికతను, ప్రత్యంకలోనూ రూపొందించడం-అవే అత్యద్భుత చిత్రరాజాలుగా వాకొనడం-ఈ అంతరార్థం—మాకు తెలియకపోవడంవలన తెలిసికోవాలనే తలంపుతో వ్రాస్తున్నా. "నీలాటి రేవుకాడ" చిత్రం నూటికి నూరుపాళ్ళు వాస్తవికతకు దూరంగా ఉంది. కాని ఆ చిత్రరచయితలు గొప్పవారు గనుక ఆ చిత్రం గొప్పదిగా భావించాలి. ఆ గొప్పతనం సూక్ష్మంగానైనా—చిన్న మాటలలో సామాన్యులకు అర్థమయ్యేలా యీ శీర్షికలో ప్రచురిస్తే ఎంతైనా కృతజ్ఞుడను.

టి. వి. రమణమూర్తి. (అనపర్తి)

*   *   *

"యువ ప్రపంచం శీర్షికకు "చక్కటి డిజైను గీసిన యువ చిత్రకారులు శ్రీ బాపుకు కృతజ్ఞత" అని తెల్పారు. వారు గీసిచ్చిన "అంత చక్కటి" డిజైను ఎక్కడ ప్రచురించారో తెలియలేదు.

ఎస్. సూర్యారావు (గుంటూరు)

ఆ పేజీ మళ్ళీ చూడండి.

కవరుపైన 'యువప్రపంచం' శీర్షికకుఅని స్పష్టంగా వ్రాయాలి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Stree
Madras-1. Chief Editor : S. Sambhu Prasad.